www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 26-10-2025 | పేజీలు: 12 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 190 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి తె.6.05 తదుపరి షష్ఠి, నక్షత్రం: జ్యేష్ఠ ఉ.10.47 తదుపరి మూల, వర్జ్యం: రా.7.40-రా.9.27, దుర్ముహూర్తం: సా.4.11-4.57, అమృతఘడియలు: ఉ.6.20-8.07, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.15, సూర్యాస్తమయం: 5.43 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



నిర్లక్ష్యపు నిప్పు

ప్రైవేటు బస్సు విషాదంలో కీలక మలుపు

ఏం జరిగిందంటే..

శుక్రవారం తెల్లవారుజాము 2:45 గంటలు: కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామ సమీపంలో హైదరాబాద్-బెంగళూరు హైవేపై పల్సర్ బైక్ డివైడర్‌ను ఢీకొని రోడ్డు మధ్యలో పడిపోయింది. బైక్ నడుపుతున్న బి.శివశంకర్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. వెనక కూర్చున్న ఎర్రిస్వామి డివైడర్ మధ్యలో గడ్డిపై పడటంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. చలనం లేని శివశంకర్‌ను ఎర్రిస్వామి రోడ్డు పక్కకు లాగాడు.

2:45 నుంచి 2:55 వరకు: పది నిమిషాల్లో ఓ ఆర్టీసీ బస్సు సహా 3 బస్సులు ఇదే మార్గంలో బెంగళూరు వైపు వెళ్లాయి. రోడ్డు మధ్యలో పడి ఉన్న బైక్‌ను గమనించి పక్కగా వెళ్లాయి. అయితే... దానిని పక్కకు లాగేయాలని ఏ ఒక్కరూ అనుకోలేదు.

2:55 గంటలకు: రోడ్డు మధ్యలో ఉన్న బైక్‌ను పక్కకు లాగేద్దామని ఎర్రిస్వామి ప్రయత్నిస్తున్నప్పుడే... హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు వచ్చింది. రోడ్డు మధ్యలో పడి ఉన్న ఆ బైక్‌ను ఢీకొట్టి అలాగే తోసుకుంటూ 200 మీటర్లు వెళ్లింది.

ఘోర ప్రమాదం: బస్సు కింద ఇరుక్కుపోయిన బైక్ ట్యాంక్ మూత తెరుచుకొని పెట్రోల్ రోడ్డుపై కారడం.. బైక్, రోడ్డు మధ్య రాపిడి వల్ల నిప్పురవ్వలు ఎగిసి పెట్రోల్‌ను అంటుకోవడంతో క్షణాల్లో బస్సు మొత్తం మంటలు వ్యాపించాయి. 15 నిమిషాల్లో ఘోరం జరిగిపోయింది.

బస్సు రాకముందే డివైడర్‌ను ఢీకొన్న బైకర్

అక్కడిక్కడే శివశంకర్ మృతి.. స్నేహితుడికి గాయాలు

రోడ్డు మధ్యలో పడిపోయిన బైక్

తర్వాత ఇదే మార్గంలో వెళ్లిన 3 బస్సులు

2:55 గంటలకు వచ్చిన వి.కావేరి బస్సు

ఆ బైక్‌ను తోసుకుంటూ ముందుకు

రోడ్డు, బైక్ మధ్య రాపిడికి నిప్పు రవ్వలు

బైక్ ట్యాంక్ మూత ఊడి పెట్రోలు బయటికి

వెంటనే బస్సంతా వ్యాపించిన మంటలు

బైక్‌ను గుర్తించకుండా బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం

అధికారికంగా నిర్ధారించిన పోలీసులు

కర్నూలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జరిగిన ప్రైవేటు బస్సు ఘోర ప్రమాదానికి అసలు కారణం తెలిసింది. బస్సు మంటల్లో చిక్కుకొని 19 మంది ప్రయాణికులు సజీవ దహనమైన ఈ ఘటన ఎలా జరిగింది? కారణాలేంటి? అన్నది పోలీసుల దర్యాప్తులో తేలింది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ముందుగా భావించినట్లుగా పల్సర్ బైక్‌ను వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టడం వల్ల ప్రమాదం జరగలేదు. బస్సు రావడానికి ముందే పల్సర్ బైక్ డివైడర్‌ను ఢీ కొని ప్రమాదానికి గురైంది. బైక్

మిగతా 12వ పేజీలో...



శుక్రవారం తెల్లవారుజామున 2:20 గంటల సమయంలో పెట్రోల్ బంకు వద్ద బైక్‌పై శివశంకర్, ఆ వెనుక ఎర్రిస్వామి

మృతదేహాల కోసం నిరీక్షణ!



మాంసపు ముద్దలుగా మారిన మృతదేహాలు

డీఎన్ఏ పరీక్షలకు బెజవాడ ల్యాబ్‌కు నమూనాలు

సోమవారం ఉదయం ఫలితాలు వచ్చే అవకాశం

ఆ తర్వాతే అప్పగిస్తామని చెబుతున్న అధికారులు

కర్నూలులో కుటుంబ సభ్యుల ఎదురుచూపులు



జీఎస్టీ సంస్కరణలు అటు వ్యాపారులకు.. ఇటు వినియోగదారులకూ ఆనందాన్నిచ్చాయి. ప్రజలకు సూపర్ సేవింగ్స్ అందుతుండగా, ఎంఎస్ఎంఈ రంగం, ఇతర వ్యాపారులు కూడా సంతోషంగా ఉన్నారు.

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రగతిశీల ప్రభుత్వం. సామాన్య ప్రజల ప్రయోజనం కోసం అనేక సంస్కరణలు తీసుకొస్తోంది. సామాన్యుల సాధికారతే లక్ష్యంగా పనిచేస్తోంది.

- ముఖ్యమంత్రి చంద్రబాబు

మోదీ సంపూర్ణ సహకారంతో

డబుల్ స్పీడ్

ఏడాదిలోనే సూపర్‌సిక్స్ అమలు చేశాం: సీఎం

డబుల్ ఇంజన్ సర్కారుతోనే సాధ్యమైంది

కేంద్రం చొరవతోనే ఆర్సెలార్ స్టీల్ ప్లాంట్

వచ్చే నెలలో శంకుస్థాపన చేస్తున్నాం

16 నెలల్లో 10 లక్షల కోట్ల పెట్టుబడులు

మరో రూ.5 లక్షల కోట్లు రానున్నాయ్

బిహార్ ఎన్నికల్లో ఎన్డీయేదే గెలుపు

ఓ వార్తాసంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ నుంచి సంపూర్ణ సహకారం లభిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఏపీలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అమలు చేయగలిగిందని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజన్ పాలనే దీనికి కారణమన్నారు. తాజాగా ఓ ఆంగ్ల వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ విషయంలో మోదీ చొరవతో అవసరమైన అన్ని అనుమతులనూ శరవేగంగా సాధించగలిగామని, కేవలం రెండు నెలల్లో ఈ ప్రాజెక్టును తీసుకురాగలిగామని అన్నారు. 7.3 మిలియన్ టన్నుల ప్రారంభ సామర్థ్యంతో ఏర్పాటయ్యే ఈ స్టీల్ ప్లాంట్‌కు వచ్చే నెలలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మోదీ రాజకీయ ప్రస్థానాన్ని ఆయన కొనియాడారు. 'దేశంలో చాలా ఆసక్తికరమైన పరిణామాలు

మిగతా 11వ పేజీలో...

ముంచుకొస్తున్న

మొంథా!

కోస్తాకు తీవ్ర తుఫాన్ ముప్పు

రేపటి నుంచి 29 వరకూ రెడ్ అలర్ట్

బంగాళాఖాతంలో వాయుగుండం

28 నాటికి తీవ్ర తుఫాన్‌గా బలపడుతుందని అంచనా

ఆ రాత్రికి కాకినాడ-తుని మధ్య తీరం దాటే అవకాశం

పలు జిల్లాల్లో అసాధారణ వర్షాలు

28 నుంచి 100 కి.మీ. వేగంతో గాలులు: ఐఎండీ

ఓడరేవుల్లో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక

ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకూడదు

ప్రభావిత జిల్లాలకు ఇన్‌చార్జిలను నియమించాలి

జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు సీఎం చంద్రబాబు ఆదేశాలు

అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష

కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని కలెక్టరేట్‌లలో కంట్రోల్ రూంలు ఏర్పాటు

పలు జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు



నంద్యాల జిల్లా వెలగలపల్లెలో నేలవాలిన వరి పంట

విశాఖపట్నం/అమరావతి/కాకినాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి 'మొంథా' తుఫాన్ ముప్పు ముంచుకొస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుఫాన్ కోస్తాతో పాటు రాయలసీమలోని పలు జిల్లాలపై విరుచుకుపడనుంది. ఈ మేరకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో శుక్రవారం ఏర్పడిన అల్పపీడనం పడమర దిశగా పయనించి శనివారం ఉదయానికి వాయుగుండంగా బలపడింది. శనివారం సాయంత్రానికి చెన్నైకి 890 కి.మీ. తూర్పు ఆగ్నేయంగా, విశాఖపట్నానికి 920 కి.మీ.,

మిగతా 11వ పేజీలో...

బంగారంలో 'బిస్కెట్ల'దే జోరు



ప్రొద్దుటూరులో భారీగా పెరిగిన అమ్మకాలు

రోజుకు 10 కేజీల వరకూ సాగిన విక్రయాలు

తగ్గిన ఆభరణాల కొనుగోళ్లు.. బిస్కెట్లపైనే మోజు

రేటు ఇంకా పెరుగుతుందనే అంచనాతో పెట్టుబడి

11

రేవంత్: ఆగ్రహం.. ఆక్రోశం.. ఆవేదన!

పార్టీలో తాను జూనియర్ అన్న భావన ఉన్నందున తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభం నుంచి అణకువతోనే ఉంటూ వచ్చారు. చివరికి అది అందరికీ అలుసుగా మారింది.



రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అన్న వాస్తవాన్ని విస్మరించి ఎవరు పడితే వారు ఏది పడితే అది మాట్లాడుతుండటంతో జనంలో ఆయన పలుచన అవుతున్నారు. దీని ప్రభావం సహజంగానే పార్టీపై కూడా పడుతోంది.

తెలంగాణలో మంత్రులు ఎవరికి వారు సర్వ స్వతంత్రులుగా వ్యవహరిస్తున్నారు. ఆ శాఖ, ఈ శాఖ అని లేకుండా అన్ని శాఖల్లో జోక్యం చేసుకుంటున్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రస్తుత పరిస్థితికి ఆ పార్టీ అధిష్ఠానం కూడా బాధ్యత వహించాలి. రాజశేఖర రెడ్డి హయాంలో వలె ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వేచ్ఛ ఇవ్వడంలేదు.

రేవంత్ రెడ్డి అత్యంత రిస్కు తీసుకొని సాధించుకున్న ముఖ్యమంత్రి పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కువంటిది కాదు. రాష్ట్రంలో నాయకత్వ మార్పిడికి అధిష్ఠానం కూడా సాహసించలేని పరిస్థితి.

కాంగ్రెస్ ప్రతిష్ఠను, ప్రభుత్వ ప్రతిష్ఠను పునరుజ్జీవింపజేయడమా? లేదా? అన్నది అధిష్ఠానం ముఖ్యులే తేల్చుకోవాలి.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..



ఎల్ఐసీ సొమ్ముతో

అదానీ బెయిలవుట్!

అప్పులు తీర్చేందుకు ఆర్థిక శాఖ, నీతిఆయోగ్ కలిసి రూ.33 వేల కోట్లు ఇప్పించాయి

రూ.28 వేల కోట్ల బాండ్లు, 5 వేల కోట్ల షేర్లు.. ప్రజల సొమ్ముతో రిస్కీ కంపెనీకి నిధులు

ఇది క్రోనీ క్యాపిటలిజం కిందకే వస్తుంది.. వాషింగ్టన్ పోస్ట్ పత్రిక సంచలన కథనం

ప్రజల కష్టార్జితాన్ని అదానీకి ఎలా అప్పగిస్తారు?.. పీఏసీ దర్యాప్తు జరపాలి

మోదీ సర్కార్‌ను నిలదీసిన కాంగ్రెస్ పార్టీ.. అది స్వతంత్ర నిర్ణయమే: ఎల్ఐసీ

న్యూఢిల్లీ, అక్టోబరు 25: అదానీ గ్రూప్ సంస్థలు మరో వివాదంలో చిక్కుకున్నాయి. చెల్లింపుల సంక్షోభంలో ఇరుక్కున్న అదానీ సంస్థలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్ కలిసి 33 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టించేందుకు ఎల్ఐసీని ఒప్పించాయని వాషింగ్టన్ పోస్ట్ సంచలన కథనం రాసింది. తమనెవరూ ప్రభావితం చేయలేదని, స్వతంత్రంగానే పెట్టుబడుల నిర్ణయం తీసుకున్నామని ఎల్ఐసీ ఖండించినప్పటికీ వాషింగ్టన్ పోస్ట్ కథనం తీవ్ర దుమారం సృష్టించింది. అదానీ షేర్ల ధరలను కృత్రిమంగా పెంచారంటూ 2023లో హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణ ఆ కంపెనీని తీవ్ర ఇబ్బందుల్లో నెట్టింది. అమెరికా కంపెనీల తరఫున భారతదేశంలో రాజకీయ నాయకులకు లంచాలు ఇచ్చారని స్వయంగా అమెరికా న్యాయశాఖ ధ్రువీకరించిన ఘటనతో 2024లో అదానీ గ్రూప్ మరోసారి ఒడిదొడుకులకు లోనైంది. ఇలాంటి తరుణంలో తాజాగా మోదీ ప్రభుత్వం కష్టాల్లో ఉన్న అదానీకి అండగా నిలిచి క్రోనీ క్యాపిటలిజాన్ని ప్రోత్సహిస్తున్నదంటూ వాషింగ్టన్ పోస్టు శనివారం కథనం వెలువరించింది. అదానీ కంపెనీలు ఎదుర్కొంటున్న చెల్లింపుల సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం గత మే నెలలో ఎల్ఐసీతో 3.9 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టించే ప్రతిపాదన చేసిందని కథనం తెలిపింది. అందులో 3.4 బిలియన్ డాలర్లు(రూ.28,000 కోట్లు) అదానీ బాండ్లు కాగా, 507 మిలియన్ డాలర్లు(రూ.5,000 కోట్లు) అదానీ కంపెనీల్లో

మిగతా 2వ పేజీలో...

గాంధీ కొండను చూశారా?

చారిత్రక కొండకు కొత్త సొబగులు


విజయవాడ వ్యూ పాయింట్‌కు మళ్లీ కళ

స్మారక స్తూపం చేరుకోవడానికి జంబోలిఫ్ట్

పార్కు, లైబ్రరీ, ప్లానెటోరియంకి ముస్తాబు

కొండపై పెరిగిన పర్యాటకుల సందడి


గాంధీ హిల్‌పైకి ఏర్పాటు చేసిన జంబో లిఫ్ట్



3

అదానీ బెయిలవుట్!

(మొదటి పేజీ తరువాయి)



షేర్ల కొనుగోలు. చెల్లింపుల సంక్షోభాన్ని పరిష్కరించుకోవడానికి మార్కెట్ నుంచి 585 మిలియన్ డాలర్లు బాండ్ల రూపంలో సేకరిస్తున్నట్లు ఈ ఏడాది మే నెలలో అదానీ గ్రూప్ ప్రకటించింది. కొద్ది రోజుల తర్వాత మే 30న మొత్తం డబ్బులు ఒకే సంస్థ(ఎల్ఐసీ) సమకూరుస్తున్నట్లు అదానీ ఒక ప్రకటన చేశారు. వాషింగ్టన్ పోస్టు చెబుతున్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన మొత్తం 3,900 మిలియన్ డాలర్లు లేదా 33 వేల కోట్ల రూపాయలు. అయితే, అదానీ కంపెనీల ఆస్తుల విలువ ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం 90 బిలియన్ డాలర్లు. ఎల్ఐసీ నుంచి కేంద్రం ఇప్పించదలచింది 3.9 బిలియన్ డాలర్లు. తమకు అవసరమైన మొత్తం సొమ్ము ఎల్ఐసీ నుంచి సేకరిస్తున్నట్లు గత మే నెలలో అదానీ ప్రకటించినపుడే విపక్షాలు గగ్గోలు పెట్టాయి.

ప్రభుత్వ బాండ్ల కన్నా ఇదే మెరుగు

అదానీ గ్రూపులోని రెండు సంస్థల్లో 3.4 బిలియన్ డాలర్లు బాండ్ల రూపంలో పెట్టుబడి పెట్టాలని కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదించినట్లు వాషింగ్టన్ పోస్ట్ కథనం పేర్కొంది. దీనికి అదనంగా మరో 507 మిలియన్ డాలర్లు అదానీ కంపెనీల్లో షేర్ల కొనుగోలు రూపంలో పెట్టాలని సూచించినట్లు చెప్పింది. కొన్నేళ్ల క్రితం ఈ సంక్షోభాలేవీ రాకముందు కూడా ఎల్ఐసీ అదానీ గ్రూపు సంస్థల్లో 30 వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టింది. అదానీని ఆదుకొనే కార్యక్రమానికి రూపకల్పన చేసిన బృందంలో ఆర్థిక శాఖ ఆర్థిక సేవల విభాగం, ఎల్ఐసీ, నీతి ఆయోగ్ అధికారులు ఉన్నట్లు తెలిపింది. దీనికి ఆర్థిక శాఖ ఆమోదం ఉన్నట్లు చెప్పింది. ఈ కార్యక్రమంతో సంబంధం ఉన్న ఇద్దరు అధికారులు తమకు ఈ విషయం వెల్లడించారని తెలిపింది. అదానీ గ్రూపు అప్పులు సంస్థ విలువలో 20 శాతానికి చేరిన నేపథ్యంలో ఎల్ఐసీతో 3.9 బిలియన్ డాలర్ల కమిట్‌మెంట్ చేయించడం ద్వారా అదానీ వెనుక తాను ఉన్నానన్న సంకేతాన్ని జాతీయ అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలకు ప్రభుత్వం ఇవ్వదలచిందని పేర్కొంది. భారత ప్రభుత్వం తనకు ఇంతకన్నా ముఖ్యమైన పనులేవీ లేవన్నట్లుగా అదానీ కొమ్ము కాస్తున్న తీరు క్రోనీ క్యాపిటలిజానికి అద్దం పడుతోందని టిమ్ బర్కిలే అనే ఆస్ట్రేలియా ఆర్థిక నిపుణుడిని ఉటంకిస్తూ వ్యాఖ్యానించింది. అదానీ గ్రూప్ స్పందన కోసం వాషింగ్టన్ పోస్ట్ అడిగినపుడు ఎల్ఐసీ అనేక సంస్థల్లో పెట్టుబడి పెట్టిందని, అదే విధంగా అదానీ సంస్థల్లో పెట్టుబడి పెట్టి మంచి లాభాలు పొందిందని సమాధానం ఇచ్చినట్లు పేర్కొంది.

పాత వివాదాల ప్రస్తావన

గతంలో అదానీ గ్రూప్ ఎదుర్కొన్న వివాదాలను కూడా వాషింగ్టన్ పోస్ట్ కథనం ప్రస్తావించింది. తప్పుడు సమాచారం ద్వారా అమెరికా సంస్థల నుంచి పెట్టుబడులు పొందేందుకు అదానీ గ్రూపు ప్రయత్నించిందని అమెరికా న్యాయశాఖ చేసిన ఆరోపణలను పత్రిక గుర్తు చేసింది. 250 మిలియన్ డాలర్లు భారతదేశంలో నాయకులకు, అధికారులకు లంచాలిచ్చి తప్పుడు పత్రాలు తెప్పించుకున్నారని పేర్కొంది. అమెరికా సెక్యూరిటీస్ ఎక్ఛేంజి కమిషన్ తమ నిబంధనలను అదానీ ఉల్లంఘించినట్లు సివిల్ కేసు వేసిన విషయాన్ని కూడా ప్రస్తావించింది. దీనికితోడు అదానీ సంస్థల్లో పెట్టుబడి రిస్క్‌తో కూడుకున్న వ్యవహారమని వివిధ సంస్థల నివేదికలను తన కథనంలో ప్రస్తావించింది.

తప్పుడు వార్త: ఎల్ఐసీ

వాషింగ్టన్ పోస్ట్ కథనాన్ని ఎల్ఐసీ ఖండించింది. తమ పెట్టుబడి నిర్ణయాలను ఎవరూ ప్రభావితం చేయలేదని, తాము స్వతంత్రంగానే, తమ విధివిధానాలకు లోబడి నిర్ణయం తీసుకున్నామని ఒక ప్రకటనలో తెలిపింది. తమ నిర్ణయాల్లో ఆర్థిక శాఖ కానీ ఇతర ఏ సంస్థల జోక్యం లేదని స్పష్టం చేసింది. 3.9 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రతిపాదన పత్రం ఏమీ కేంద్రం, నీతి ఆయోగ్, ఎల్ఐసీల మధ్య చర్చకు రాలేదని చెప్పింది. 41 లక్షల కోట్ల ఆస్తులున్న ఎల్ఐసీ 351 కంపెనీల్లో పెట్టుబడులు పెట్టింది. దాని మొత్తం పెట్టుబడుల్లో అదానీలో పెట్టిన మొత్తం రెండు శాతం మాత్రమే. ఇండియాలో 500 అగ్రశ్రేణి కంపెనీల విలువ గత పదేళ్లలో పది రెట్లు పెరిగిందని గుర్తు చేసింది.

పీఏసీ దర్యాప్తు జరగాలి: కాంగ్రెస్

వాషింగ్టన్ పోస్ట్ కథనంపై కాంగ్రెస్ స్పందించింది. అదానీ సంస్థకు లబ్ధి చేకూర్చేందుకు ఎల్ఐసీ నిధులను దుర్వినియోగం చేయడంపై పార్లమెంటరీ కమిటీ అయిన పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీతో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేసింది. ఆర్థిక శాఖ, నీతి ఆయోగ్ కలిసి అదానీ గ్రూప్ మీద ఆర్థిక సంస్థల్లో విశ్వాసం పెంచేందుకు ఈ స్కెచ్ వేశాయని వ్యాఖ్యానించింది. 30 కోట్ల మంది ఎల్ఐసీ వాటాదారుల కష్టార్జితాన్ని మోదీ దుబారా చేస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. తమ కష్టార్జితాన్ని మోదీ ఇలా అదానీని ఒడ్డున పడేయడానికి వాడుతున్నారని తెలుసా? అని ప్రశ్నించారు. ఇది తీవ్రమైన నేరమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఎవరి ఒత్తిడితో అధికారులు ఒక ప్రైవేటు కంపెనీని రక్షించే కార్యక్రమానికి పూనుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ విచారణ జరగాల్సిందేనని అన్నారు. మొదటి అడుగుగా పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. అదానీ సంస్థకు అమెరికా సెక్యూరిటీస్ కమిషన్ నోటీసులు పంపిస్తే వాటిని సర్వ్ చేయడానికి మోదీ ఏడాది కాలంగా అంగీకరించడం లేదన్నారు. ఇది కేవలం ఎల్ఐసీ వ్యవహారం కాదని, ఇదొక 'మొదానీ మెగా స్కామ్' అని వ్యాఖ్యానించారు.

లొంగు'బాట'లో హిడ్మా!

- ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోతారని కొన్నాళ్లుగా ప్రచారం
- తెలంగాణలోనే లొంగిపోతారని నిఘా వర్గాల అంచనా
- ఫిబ్రవరిలో వరంగల్‌లో లొంగిపోయిన హిడ్మా కుమార్తె కేషా



హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్ర నాయకుడు మడావి హిడుమాయ్ అలియాస్ హిడ్మా అలియాస్ సంతోష్ లొంగిపోతారని జరుగుతున్న ప్రచారంపై రాష్ట్ర నిఘా వర్గాలు దృష్టి సారించాయి. ఈ ప్రచారాన్ని ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఖండిస్తున్నప్పటికీ.. హిడ్మా తెలంగాణలో లొంగిపోయే అవకాశాలను తోసిపుచ్చలేమని పేర్కొంటున్నాయి. మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యుడిగా, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) ప్లాటూన్-1 కమాండర్‌గా ఉన్న హిడ్మాకు గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరుంది. గతంలో హిడ్మా నాయకత్వంలోనే భద్రతా బలగాలపై అనేక దాడులు జరిగాయని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూవర్తి గ్రామానికి చెందిన హిడ్మా.. మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నారు. చాలా సార్లు పోలీసులకు దొరికినట్టే దొరికి తప్పించుకున్నారు. అగ్రనేతలు సోనూ, ఆశన్నతోపాటు వందల మంది మావోయిస్టులు లొంగిపోయిన తర్వాత హిడ్మా లొంగుబాటు విషయంలో పెద్ద చర్చ జరుగుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే హిడ్మా కుమార్తె వంజెం కేషా అలియాస్ జిన్నీ వరంగల్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆమె భర్త, మావోయిస్టు నాయకుడు రమేష్‌ను 2020లో మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. హిడ్మా కుమార్తె కేషా... ఆపరేషన్ కగార్ భీకరమవుతున్న క్రమంలో పార్టీ నుంచి బయటకు వచ్చారు. తాజాగా ఇప్పుడు హిడ్మా సైతం తన అనుచరులతో కలిసి వరంగల్ పోలీసుల ఎదుట లొంగిపోయే అవకాశాలున్నాయని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

అమెరికా సరిహద్దుల్లోకి వెళ్లినా..దాటినా ఫేస్ రికగ్నిషన్‌తో ఫొటో..బయోమెట్రిక్

- అమెరికాయేతర వ్యక్తులకు కొత్త నిబంధన

వాషింగ్టన్, అక్టోబరు 25: అక్రమ వలసదారులకు అడ్డుకట్ట వేసే చర్యల్లో భాగంగా అమెరికా మరో కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికాయేతర పౌరులు అమెరికాను వీడినా, దేశంలోకి వచ్చినా.. వారు సరిహద్దులు దాటే సమయంలో ముఖ గుర్తింపు వ్యవస్థ(ఫేస్ రికగ్నిషన్) సాయంతో ఫొటోలు తీయడానికి, బయోమెట్రిక్ వివరాలను సేకరించడానికి సరిహద్దుల్లోని సంబంధిత అధికారులకు వెసులుబాటు కల్పించింది. వీసా గడువు ముగిసినా అమెరికాలో ఉంటున్నవారిని, దొంగ పాస్‌పోర్టులతో అమెరికాలోకి ప్రవేశించేవారిని సులభంగా గుర్తించడానికి ఈ నిర్ణయం దోహదం చేస్తుందని భావిస్తున్నారు. డిసెంబరు 26నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి.

బళ్లారిలో దొరికిన శబరిమల బంగారం

న్యూఢిల్లీ/బెంగళూరు/బళ్లారి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్ప ఆలయ ద్వారపాలక విగ్రహాల బంగారు తాపడానికి వినియోగించిన పసిడి చోరీ కేసులో సిట్ భారీ పురోగతి సాధించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, అయ్యప్ప ఆలయ పూజారిగా ప్రచారం చేసుకున్న ఉన్నికృష్ణన్ పొట్టి ఇంటి నుంచి రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పొట్టి నుంచి పసిడిని కొనుగోలు చేసిన బళ్లారికి చెందిన వ్యాపారి గోవర్ధన్ నుంచి 400 గ్రాముల బంగారంతో పాటు కొన్ని పసిడి నాణేలను కూడా స్వాధీనం చేసుకున్నారు. బళ్లారిలో 'రొద్దమ్ జ్యువెలరీ' పేరుతో వ్యాపారం చేస్తున్న గోవర్ధన్‌ను విచారిస్తున్నట్టు సిట్ ఎస్పీ శశిధరన్ తెలిపారు. సిట్ కథనం ప్రకారం.. 2019లోనే 476 గ్రాముల బంగారాన్ని గోవర్ధన్‌కు పొట్టి విక్రయించారు. వీరిద్దరి మధ్య పలు ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు ఖాతాలు స్పష్టం చేశాయి. వీరు ప్రత్యేక నెట్ వర్క్‌ను ఏర్పాటు చేసుకుని లావాదేవీలు సాగించారు. చెన్నైకి చెందిన 'స్మార్ట్ క్రియేషన్స్' మధ్యవర్తిగా వ్యవహరించింది. కల్పేష్ అనే వ్యక్తి పొట్టి సూచనల మేరకు ఈ వ్యవహారాన్ని నడిపించారు. అయితే, పొట్టి అభ్యర్థన మేరకు అయ్యప్ప ఆలయం ద్వారానికి మరమ్మతులు చేశానని, ద్వారపాలకుల మరమ్మతుల గురించి తనకేమీ తెలియదని గోవర్ధన్ సిట్‌కు చెప్పారు.

పత్రికలకు కేంద్ర ప్రభుత్వ ప్రకటనల రేటు 27% పెంపు!

న్యూఢిల్లీ, అక్టోబరు 25: దేశవ్యాప్తంగా పత్రికలకు ఇచ్చే ప్రభుత్వ ప్రకటనల రేట్లను 27% పెంచేందుకు కేంద్రం సిద్ధమైంది. బిహార్ ఎన్నికల కోడ్ ముగియగానే ప్రకటనల రేటు పెంపును నోటిఫై చేయనున్నట్టు కేంద్ర సమాచార, ప్రసార శాఖ అధికారి ఒకరు వెల్లడించారు. పత్రికలకు ప్రభుత్వ యాడ్ రేటును 2013లో 19శాతం, 2019 జనవరిలో 25శాతం పెంచారు. ఆరేళ్ల తర్వాత మళ్లీ సవరిస్తున్నారు. టీవీ చానళ్లకు ఇచ్చే ప్రకటనల రేటు సవరణపైనా కేంద్ర సమాచార శాఖ కసరత్తు చేస్తోంది. చానళ్లకు ప్రకటనలు ఇచ్చేందుకు ఆధారంగా తీసుకునే టెలివిజన్ రేటింగ్ వ్యవస్థలో సంస్కరణలు తీసుకువచ్చేందుకు, మరిన్ని రేటింగ్ ఏజెన్సీలను ఏర్పాటు చేయనుంది.

ఆరు నెలల్లో రూ.1,500 కోట్లు స్వాహా!

- పలు ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌ల పేరిట మోసం

న్యూఢిల్లీ, అక్టోబరు 25 : ఆరు నెలల్లో రూ.1,500 కోట్లు హాంఫట్.. సైబర్ నేరగాళ్లు దేశంలోని ప్రధాన నగరాల్లో జనంపై పలు ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌ల పేరిట పంజా విసిరి కాజేసిన మొత్తం ఇది.. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సైబర్ విభాగం ఈ వివరాలను వెల్లడించింది. దేశంలోని ప్రధాన నగరాలు హైదరాబాద్, బెంగళూరు, దేశ రాజధాని ప్రాంతాలలోనే ఈ సైబర్ మోసాల్లో అధికంగా దాదాపు 65 శాతం కేసులు నమోదవడం గమనార్హం. భారత సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) విడుదల చేసిన నివేదిక ప్రకారం బెంగళూరు నగరంలో అత్యధికంగా(26.38 శాతం) ఈ మోసాలు చోటు చేసుకున్నాయి. ఈ నేరాలను విశ్లేషించిన తర్వాత పనిచేసే వయస్సులోని 30-60ఏళ్ల వారినే సైబర్ నేరగాళ్లు ప్రధానంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని తేలింది. బాధితుల్లో 76% మంది ఈ వయస్సు వారే.


ఝార్ఖండ్‌లో ఏసీ బస్సులో మంటలు

- 45 మంది ప్రయాణికులు సురక్షితం

రాంచీ, అక్టోబరు 25: ఝార్ఖండ్ రాజధాని రాంచీ సమీపంలో శనివారం పెను ప్రమాదం తప్పింది. రాంచీ నుంచి చాత్రా వెళ్తున్న ఏసీ బస్సులో ఆకస్మికంగా మంటలు వ్యాపించాయి. బ్యాటరీ బాక్సు వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు ప్రారంభం కాగా, బస్సులో ఉన్న రసాయనాల కారణంగా వెంటనే వ్యాపించాయి. దాంతో బస్సును నిలుపుదల చేసి అందులోని మొత్తం 45 మంది ప్రయాణికులను కిందికి దించడంతో అందరూ సురక్షితంగా బయటపడ్డారు.

జంక్‌తో ఏఐ బుర్రలోనూ మట్టే!

- ఇంటర్నెట్‌లోని చెత్త కంటెంట్‌తో ఏఐల్లో బ్రెయిన్ రాట్
- పడిపోతున్న విశ్లేషణ సామర్థ్యం



న్యూఢిల్లీ, అక్టోబరు 25 : జంక్ ఫుడ్ అతిగా తింటే అది క్రమంగా మనిషి ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తుంది. అదే విధంగా ఆన్‌లైన్‌లో జంక్ కంటెంట్.. పిచ్చిపిచ్చి థంబ్ నైల్స్‌తో యూట్యూబ్‌లో ఉండే నాణ్యమైన సమాచారం లేని వీడియోలు, మొబైల్ స్క్రీన్‌ను స్క్రోల్ చేస్తూ ఎవరో సరదా కోసం చేసిన రీల్స్, షార్ట్స్ చూడడం వల్ల మనిషి ఆలోచన సామర్థ్యం కూడా క్రమంగా తగ్గుతుంది. ఆన్‌లైన్‌లో సులువుగా దొరికే, ఆకట్టుకునేలా కనిపించే సమాచారంతో ఆ.. చాల్లే అని సరిపెట్టుకుంటే.. ఆలోచన పరిధి, కొత్తగా ఏదైనా తెలుసుకోవాలనే ఆసక్తి, లోతైన అధ్యయనం, విశ్లేషణ చేసే సామర్థ్యం, ఓపిక తగ్గి మెదడు మొద్దు బారిపోతుంది. ఉన్న మతి కూడా పోతుంది. ఇలాంటి స్థితినే బ్రెయిన్ రాట్ అంటారు. ఈ పరిస్థితి మనుషులకు మాత్రమే పరిమితం కాలేదట. ఏదో ఒక రోజు మనిషిని శాసిస్తుందని అనుకుంటున్న ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కు కూడా తప్పడం లేదట. ఇంటర్నెట్‌లోని జంక్ కంటెంట్(నాణ్యత లేని సమాచారం) ఏఐలను బ్రెయిన్ రాట్‌కు గురి చేసి వాటి సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందట. టెక్సస్ ఏ అండ్ ఎం యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ టెక్సస్, పర్ద్యూ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఆన్‌లైన్‌లోని జంక్ కంటెంట్ చాట్ జీపీటీ4, జెమినీ1.5 వంటి ఎల్ఎల్ఎం(లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్) మోడల్ చాట్‌బాట్‌లను బ్రెయిన్ రాట్‌కు గురి చేస్తోందని ఆ అధ్యయనంలో తేలింది. ఏఐ చాట్‌బాట్‌లకు సోషల్ మీడియాలో వైరల్ అయిన సమాచారం, తక్కువ నాణ్యత కలిగిన ఎక్స్(ట్విటర్)లోని పోస్టులను నిత్యం ఫీడ్ చేస్తే.. ఏదైనా సమాచారం కోరినప్పుడు ఆయా చాట్‌బాట్‌లు ఇచ్చే ఫలితాలు అంతే తక్కువ స్థాయిలో ఉండడాన్ని పరిశోధకులు గుర్తించారు. ఏఐలు పూర్తి సామర్థ్యం మేరకు పని చేయకుండా మొద్దుబారిపోతున్నట్టు కనుగొన్నారు. ఏఐ మోడల్స్ విశ్లేషణ సామర్థ్యానికి కొలమానంగా భావించే ఏఆర్‌సీ(అబ్‌స్ట్రాక్షన్ అండ్ రీజనింగ్ కార్పస్) బెంచ్‌మార్క్ స్కోరు బ్రెయిన్ రాట్‌కు గురైన ఏఐ మోడల్స్‌లో 74.9 నుంచి 57.2కు పడిపోవడాన్ని పరిశోధకులు గుర్తించారు. అలాగే, ఎక్కువ సమాచారాన్ని విశ్లేషించే సామర్థ్యానికి సంబంధించి రూలర్ బెంచ్‌మార్క్ కూడా 84.4 నుంచి 52.3కి పడిపోయినట్టు కనుగొన్నారు. అంతేకాక, బ్రెయిన్ రాట్ ఏఐ చాట్‌బాట్‌ల సామర్థ్యాన్ని తగ్గించడమే కాక వాటి స్వభావాన్ని కూడా మార్చేస్తుందట. అసాధారణమైన ప్రవర్తన, విచిత్రంగా, విపరీత ధోరణిలో, వెటకారంగా సమాధానాలు ఇవ్వడం, నార్సిసిజం వంటి లక్షణాలు బ్రెయిన్‌రాట్‌కు గురైన ఏఐ చాట్‌బాట్‌ల్లో కనిపించినట్టు పరిశోధకులు పేర్కొన్నారు. ఇక, బ్రెయిన్‌రాట్‌కు గురైన చాట్‌బాట్‌కు మంచి, నాణ్యమైన సమాచారంతో శిక్షణ ఇచ్చినా దాని సామర్థ్యంలో పూర్తిస్థాయిలో పురోగతి కనిపించడం లేదని వాపోయారు. కాగా, ప్రస్తుతం చాట్‌జీపీటీ, జెమినీ వంటి ఎల్ఎల్ఎంలు సామాజిక మాధ్యమాల్లో లభిస్తున్న సరైన అధ్యయనం లేని నాసిరకమైన సమాచారాన్నే ఎక్కువగా తీసుకుంటున్నాయి. దాంతో ఆ చాట్‌బాట్‌లు ఇచ్చే ఫలితాల స్థాయి కూడా అందుకు తగ్గటుగానే ఉంటుంది. దీంతో ఆ చాట్‌బాట్‌లకు నాణ్యమైన సమాచారం చేరేలా చేయడంపై వాటిని అభివృద్ధి చేసే సంస్థలు దృష్టి పెట్టాలని పరిశోధకులు సూచిస్తున్నారు. చాట్‌బాట్‌లు బ్రెయిన్‌రాట్‌కు గురి కాకుండా చూసుకోవడమే ఉత్తమ మార్గమని చెబుతున్నారు.

గాంధీ హిల్‌ను చూశారా?

- చారిత్రక కొండకు కొత్త సొబగులు
- విజయవాడ వ్యూ పాయింట్‌కు మళ్లీ కళ
- కొండపై పెరిగిన పర్యాటకుల సందడి
- దేశంలోనే తొలి గాంధీ స్మారక కేంద్రం

(విజయవాడ- ఆంధ్రజ్యోతి)


ఎప్పుడైనా విజయవాడ వస్తే కనకదుర్గ గుడిని చూసుంటారు.. ప్రకాశం బ్యారేజీని చూసుంటారు.. కానీ రైల్వే స్టేషన్ పక్కనే ఉన్న గాంధీ హిల్‌ను ఎప్పుడైనా చూశారా? ఒకప్పుడు పర్యాటక కేంద్రంగా వెలుగొందిన గాంధీ హిల్.. కాలక్రమంలో ఆదరణ కోల్పోయింది. సిటీ వ్యూపాయింట్‌గా ఉన్న ఆ కొండపై ఉన్న స్మారక స్థూపం వద్దకు వెళ్లాలంటే మెట్లు ఎక్కాల్సిరావడమే దానికి కారణం. అయితే అక్కడకు చేరుకోవడానికి ఇటీవల జంబో లిఫ్ట్ ఏర్పాటు చేశారు. అంతేగాక కొండ మొత్తానికి సరికొత్త సొబగులు అద్దారు. ఈ ముస్తాబుతో గాంధీ హిల్ మునుపటి కళ సంతరించుకుంది. పెద్దసంఖ్యలో పర్యాటకులు వచ్చి నగర అందాలను వీక్షిస్తున్నారు. మిడ్‌హిల్ వ్యాలీలో మినీ ట్రెయిన్‌పై చక్కెర్లు కొడుతూ పరిసరప్రాంతాల సొగసులను ఆస్వాదిస్తున్నారు. ఇదంతా రీ డెవలప్‌మెంట్ పనులతో సాధ్యమైంది. రానున్న రోజుల్లో గాంధీహిల్ గురించి ప్రపంచం చర్చించుకునేలా 'గాంధీ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్' మాస్టర్ ప్లాన్‌కు కూడా అడుగులు పడుతున్నాయి. గాంధీహిల్ సొసైటీ చైర్మన్ కేపీసీ గాంధీ ఇటీవల


అందుబాటులోకి వచ్చిన మినీ ట్రైన్

ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి ఆ మాస్టర్ ప్లాన్ గురించి వివరించారు. గాంధీ చరిత్రను తెలియజెప్పటంతో పాటు ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేలా డిజైన్ చేశారు. అలాగే భారీ మ్యూజియం, కన్వెన్షన్ సెంటర్, అతిథి గృహాలను నిర్మించనున్నారు.

స్మారకస్థూపం అద్భుతం..


కొండపైన గాంధీ స్మారక స్థూపం ప్రాంతం నుంచి విజయవాడ అద్భుతంగా కనిపిస్తుంది. ఇక్కడి నుంచి సిటీ మొత్తాన్ని 360 డిగ్రీల కోణంలో చూడటానికి అవకాశం ఉంటుంది. పునరుద్ధరణ పనులు జరగక ముందు గాంధీ స్మారక స్థూపం దగ్గరకు చేరుకోవాలంటే 230కు పైగా మెట్లను ఎక్కాల్సి వచ్చేది. ఈ కారణంగా చాలామంది ఆసక్తి కనబర్చేవారు కాదు. అద్భుతమైన ఆ వ్యూ పాయింట్‌ను పర్యాటకులు చూడలేకపోతున్నారన్న ఉద్దేశంతో గాంధీహిల్ సొసైటీ రూ. కోటి ఖర్చు చేసి మధ్య ప్రాంతం నుంచి పైకి వెళ్లడానికి జంబోలిఫ్ట్‌ను ఏర్పాటు చేసింది. లిఫ్ట్ నుంచి నేరుగా స్మారక స్థూపం వరకు ర్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ ర్యాంప్‌పై నుంచి నడుస్తుంటే ఇంద్రకీలాద్రి, కృష్ణానది మొదలు.. యనమలకుదురు శివాలయం వరకు నలువైపులా నగర


గాంధీ స్మారక స్థూపం

అందాలన్నీ కనిపిస్తున్నాయి. మధ్య ప్రాంతంలో కొండ చుట్టూ ట్రాక్‌ను పునరుద్ధరించి మళ్లీ మినీ ట్రైన్‌ను తిప్పుతున్నారు. పచ్చటి లాన్లను అభివృద్ధి చేసి, బ్యూటిఫికేషన్ పనులు చేపట్టారు. దిగువన ప్లానిటోరియాన్ని కూడా ఆధునికీకరించి అందుబాటులోకి తెచ్చారు.

సముద్ర మట్టానికి 500 అడుగుల ఎత్తులో..

దేశంలో మొత్తం ఆరు గాంధీ స్మారక కేంద్రాలు ఉండగా, విజయవాడలోని గాంధీ హిల్ మొట్టమొదటి కేంద్రంగా గుర్తింపు పొందింది. ఈ కొండ సముద్ర మట్టానికి 500 అడుగుల ఎత్తులో ఉంది. ఈ హిల్‌ను మొదట్లో ఓర్ కొండగా పిలిచేవారు. 1852లో కృష్ణానదిపై విజయవాడలో మొదటి ఆనకట్ట కట్టిన బ్రిటీష్ ఇంజనీర్ కెప్టెన్ చార్లెస్ ఓర్ పేరు దానికి పెట్టారు. మహాత్మాగాంధీ 1919 నుంచి 1946 మధ్య కాలంలో విజయవాడకు ఆరుసార్లు వచ్చారు. ఈ కొండ దగ్గరే అఖిలభారత


గాంధీ హిల్‌పై నుంచి విజయవాడ నగర దృశ్యం

కాంగ్రెస్ కమిటీ సమావేశాలు జరిగాయి. 1921లో ఇక్కడ జరిగిన సమావేశంలో పింగళి వెంకయ్య తయారుచేసిన మూడు రంగుల పతాకాన్ని ప్రదర్శించారు. ఈ నేపథ్యంలోనే ఈ కొండ గాంధీ స్మారక కేంద్రంగా మారింది. 1964 నవంబరు 9న నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి గాంధీ స్మారక స్థూపానికి శంకుస్థాపన చేశారు. 1968 అక్టోబరు 6న అప్పటి రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ 55 అడుగుల ఎత్తైన స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు. 1969లో కొండ చుట్టూ తిరిగేలా మినీ ట్రెయిన్ ట్రాక్ ఏర్పాటు చేశారు. గాంధీజీ జీవిత విశేషాలతో కూడిన పుస్తకాలతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అలాగే ప్లానిటోరియాన్ని కూడా నెలకొల్పారు. చాలాకాలంగా మరుగున పడిపోయిన వీటికి మళ్లీ కళవచ్చింది.


సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ సుబ్బారెడ్డి

న్యాయ సాధనలో న్యాయవాదుల పాత్ర కీలకం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కక్షిదారులకు న్యాయాన్ని అందించడంలో న్యాయవాదుల పాత్ర కీలకమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి అన్నారు. శనివారం శ్రీకాకుళంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో హైకోర్టు మరో న్యాయమూర్తి జస్టిస్ తుహిన్ కుమార్‌తో కలిసి జిల్లా 7వ అదనపు న్యాయస్థానాన్ని ఆయన ప్రారంభించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మాజీ నక్సలైట్ దున్న కేశవరావు అలియాస్ ఆజాద్‌పై ఉన్న కేసులు త్వరితగతిన విచారణ నిమిత్తం ఈ కోర్టును ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని జస్టిస్ సుబ్బారెడ్డి తెలిపారు. జస్టిస్ తుహిన్ కుమార్ మాట్లాడుతూ.. 'జూనియర్ న్యాయవాదులు సీనియర్ల నుంచి ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా నేర్చుకోవాలి. వృత్తిలో నైపుణ్యం సాధించాలి. ఏ కేసుకైనా కింద కోర్టు విచారణే ముఖ్యం' అని తెలిపారు.

రెండు ఇండిగో విమానాల అత్యవసర ల్యాండింగ్

గన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ల్యాండింగ్ అవ్వాల్సిన రెండు ఇండిగో విమానాలు ప్రతికూల వాతావరణం కారణంగా గన్నవరంలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యాయి. బెంగళూరు నుంచి 214 మంది ప్రయాణికులతో హైదరాబాద్ బయలుదేరిన ఇండిగో విమానం హైదరాబాద్ వెళ్లేసరికి అక్కడ ల్యాండ్ అయ్యేందుకు విజిబిలిటీ సరిలేకపోవటంతో శనివారం మధ్యాహ్నం 2.16 గంటలకు గన్నవరంలో ల్యాండ్ అయింది. తర్వాత అక్కడ వాతావరణం అనుకూలంగా ఉండటంతో 3.15 గంటలకు బయలుదేరి వెళ్లింది. అలాగే అసోం రాష్ట్రంలోని చిలువూరి విమానాశ్రయం నుంచి బయలుదేరిన మరో ఇండిగో విమానం కూడా హైదరాబాద్‌లో చక్కర్లు కొట్టి గన్నవరం విమానాశ్రయానికి మధ్యాహ్నం 2.25కు వచ్చింది. తిరిగి 3.32కు హైదరాబాద్ వెళ్లింది.

లోక్ అదాలత్‌లో కేసుల రాజీపై మార్గదర్శకాలు రూపొందించండి

- పరకామణి చోరీ కేసు నిందితుడితో సతీశ్‌కుమార్ రాజీ చట్టవిరుద్ధం
- ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోండి
- ఈ కేసులో మా వాదనలు కూడా వినండి
- హైకోర్టులో ఏపీ సాధు పరిషత్ ఇంప్లీడ్ పిటిషన్



అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అక్రమాలను అరికట్టేందుకువీలుగా రాష్ట్రవ్యాప్తంగా లోక్ అదాలత్‌లో రాజీ అయ్యే కేసుల విషయంలో సమగ్ర మార్గదర్శకాలు రూపొందించాలని కోరుతూ ఏపీ సాధు పరిషత్ హైకోర్టును ఆశ్రయించింది. రాజీ చేసుకోవాలనుకుంటున్న వ్యక్తికున్న అధికారం, కేసు విచారణార్హత, చట్టబద్ధత తదితర విషయాలను క్షుణంగా పరిశీలించేలా మార్గదర్శకాలు ఉండేలా చూడాలని కోరారు. టీటీడీ పరకామణిలో జరిగిన అక్రమాలపై సీఐడీతో దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ జర్నలిస్ట్ ఎం.శ్రీనివాసులు వేసిన పిటిషన్‌లో భాగం చేసుకుని, తమ వాదనలు కూడా వినాలని పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు, టీటీడీ పట్ల మోసపూరితంగా లోక్ అదాలత్‌లో కేసును రాజీ చేసుకున్న అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి(ఏవీఎస్‌వో) వై.సతీశ్‌కుమార్‌పై క్రిమినల్ చర్యలకు ఆదేశించాలని, ఇందుకు వీలుగా అంతర్గత విచారణకు ఆదేశించాలని కోరారు. 'సతీశ్‌కుమార్‌కు టీటీడీ ఆస్తులపై ఎలాంటి హక్కులేదు. ఆయన ఉద్యోగి మాత్రమే. వ్యక్తిగత హోదాలో కేసును రాజీ చేసుకోవడానికి వీల్లేదు. పరకామణిలో చోరీకి పాల్పడిన రవికుమార్‌తో రాజీ చేసుకోవడం వెనుక పెద్ద రాకెట్ ఉన్నట్లు కనపడుతోంది. దీనివెనుక ఉన్న వ్యక్తుల ముసుగులు తొలగించకుండా ఇలాంటి చోరీలను నిలువరించలేం' అని పేర్కొన్నారు.

కేసు రాజీ వెనుక దురుద్దేశం లేదు: సతీశ్‌కుమార్ కౌంటర్

పరకామణిలో చోరీ కేసులో రాజీ చేసుకోవడం వెనుక ఎలాంటి దురుద్దేశాలు లేవని టీటీడీ పరకామణి అప్పటి ఏవీఎస్‌వో సతీశ్‌కుమార్ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. చట్టప్రకారం రాజీ చేసుకోదగిన కేసు అయినందనే లోక్ అదాలత్‌లో ఆ ప్రక్రియను పూర్తిచేశామన్నారు. రవికుమార్ పరకామణిలో దొంగతనం చేస్తుండగా పట్టుకొని తానే ఫిర్యాదు చేశానని తెలిపారు. ఫిర్యాదుదారును తానే అయినందున కేసు రాజీ అయిందన్నారు. సీఆర్‌పీసీ, ఐపీసీలో కేసు రాజీ పై ఎలాంటి నిషేధం లేదని పేర్కొన్నారు. టీటీడీ నిబంధనల ప్రకారం ఫిర్యాదు చేయడానికి, రాజీ చేసుకోవడానికి సంబంధిత శాఖాధిపతులకు అధికారం ఉందని, ఇందుకు పాలకమండలి అనుమతి అవసరం లేదని తెలిపారు. ఊహాజనిత, నిరాధార ఆరోపణలతో వేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని సతీశ్‌కుమార్ కోరారు.

రేపు జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ ప్రమాణం



అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సి.మానవేంద్రనాథ్ రాయ్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. హైకోర్టులోని మొదటి కోర్టుహాల్‌లో సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఉదయం 10.35గంటలకు జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌తో ప్రమాణం చేయించనున్నారు. గుజరాత్ హైకోర్టు నుంచి బదిలీపై మాతృ హైకోర్టు అయిన ఏపీ హైకోర్టుకు తిరిగి వస్తున్నారు. ఆయన ఇక్కడ రెండోస్థానంలో కొనసాగుతారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు మేరకు ఆయన బదిలీకి రాష్ట్రపతి ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే. మరోవైపు కోల్‌కతా హైకోర్టు నుంచి ఏపీ హైకోర్టుకు బదిలీపై వస్తున్న జస్టిస్ సుభేందు సమంత ఈనెల 29న ప్రమాణం చేయనున్నారు.

పాఠశాలల్లో 'ప్యూర్ ఫెమ్' అమలు

- 'ప్యూర్' సంస్థతో సమగ్ర శిక్ష ఒప్పందం

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కేజీబీవీలతో సహా సుమారు 8 వేల మాధ్యమిక పాఠశాలల్లో 'ప్యూర్ ఫెమ్' కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్ (ప్యూర్) సంస్థతో, సమగ్ర శిక్ష అధికారులు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈమేరకు శనివారం విజయవాడలోని సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో ప్యూర్ సంస్థ వ్యవస్థాపకురాలు, సీఈవో డాక్టర్ శైల తల్లూరి, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. 'ప్యూర్ ఫెమ్' కార్యక్రమం ద్వారా దాదాపు 8 లక్షల మంది కౌమార బాలికలు లబ్ధి పొందనున్నట్లు సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బాలికలకు రుతుస్రావ పరిశుభ్రత నిర్వహణ, ఆరోగ్యం, శ్రేయస్సు, వ్యక్తిగత భద్రతపై నిర్మాణాత్మక వర్క్‌షాపులు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. మధ్యాహ్న భోజన పథకం విభాగం డైరెక్టర్ ఆర్.ఎస్.గంగా భవాని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంపద సృష్టితోనే నిరుద్యోగ రహిత భారత్

- ఆత్మనిర్భర్ భారత్‌పై అవగాహన పెంచుకోవాలి
- సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు మంత్రి సత్యకుమార్ సూచన



అనంతపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సంపద సృష్టితోనే నిరుద్యోగంలేని భారతావని సాధ్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సంపద సృష్టి జరిగితే మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమౌతుందని, పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు వస్తాయని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అనంతపురం నగర శివారులోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన 'ఆత్మనిర్భర్ భారత్' అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆత్మనిర్భర్ భారత్‌కు స్వదేశీ, స్వభాష, స్వభూష మూడు స్తంభాలని స్పష్టంచేశారు. ఈ మూడు అంశాల గురించి విద్యార్థులకు ఆయన సుదీర్ఘంగా వివరించారు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం, మాతృభాషపై గర్వం కలిగివుండటం, సంస్కృతి, వారసత్వాన్ని విలువైనదిగా భావించడమే ఆ మూడింటి లక్ష్యమని తెలిపారు. దేశం చారిత్రకంగా స్వయం సమృద్ధి కలిగి ఉందని చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం ప్రపంచంలో మూడు అగ్ర ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదుగుతోందని వెల్లడించారు. కొవిడ్ సమయంలో దేశం తన అసలైన సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. అప్పటినుంచి ప్రధాని నరేంద్రమోదీ ఆత్మనిర్భర్ భారత్‌ను కేవలం సిద్ధాంతంగా కాకుండా ఆచరణలో చూపారని కొనియాడారు. రాష్ట్రంలోనూ కేంద్ర ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా అడుగులు వేసిందని మంత్రి తెలిపారు. విశాఖలో 15 బిలియన్ డాలర్లతో గూగుల్ సంస్థ ఏఐ సెంటర్ ఏర్పాటు చేస్తోందని ఇటీవల చేసిన ప్రకటన ఇందుకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఇతర దేశాల ఉత్పత్తులపై ఆధారపడకుండా, స్వదేశీ ఉత్పత్తులు, సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలతో స్వదేశీ అవసరాలు తీర్చుకున్నప్పుడే ప్రగతి సాధ్యమౌతుందని తెలిపారు. దీనికితోడు ఎగుమతులను పెంచాల్సి ఉంటుందని తద్వారా సుస్థిర ఆర్థిక వ్యవస్థ ఏర్పాటు సాధ్యమౌతుందని చెప్పారు. అనంతరం వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరితో కలిసి వర్సిటీలోని అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలను మంత్రి సత్యకుమార్ యాదవ్ సందర్శించారు.

డిసెంబరు 6 లోపు వక్ఫ్ ఆస్తుల నమోదు తప్పనిసరి

- వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నూతనంగా అమల్లోకి వచ్చిన ఉమీద్ చట్టం ప్రకారం, రాష్ట్రంలోని అన్ని వక్ఫ్ ఆస్తులు, మసీదులు, దర్గాలు, మదరసాలు డిసెంబరు 6లోపు తప్పనిసరిగా డిజిటల్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వక్ఫ్ సంస్థల నిర్వాహకులు, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పిలుపునిచ్చారు. దీనికోసం ప్రతి వక్ఫ్ సంస్థ తమ జిల్లాలోని ఇన్స్పెక్టర్ ఆడిటర్ ఆఫ్ వక్ఫ్ కార్యాలయాన్ని సంప్రదించాలని శనివారం ఓ ప్రకటనలో సూచించారు. ఈ పోర్టల్‌లో నమోదు చేయబడిన ఆస్తుల వివరాలు ప్రభుత్వ డేటాబేస్‌లో భద్రపరచబడతాయని తెలిపారు. నమోదు కాని వక్ఫ్ ఆస్తులు చట్టపరంగా వివాదాస్పద భూములుగా పరిగణించబడతాయని, వాటికి వక్ఫ్ బోర్డు నుంచి రక్షణ, సహాయం లభించదని ఆయన పేర్కొన్నారు. సందేహాలుంటే రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయంలో హెల్ప్‌లైన్ నంబరు 9490044933ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రాణం తీసిన సెల్ఫీ వీడియో

- బీటీపీ రిజర్వాయర్ వద్ద నీట మునిగిన యువకుడు


మహమ్మద్ ఫైజ్

గుమ్మఘట్ట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుమ్మఘట్ట మండలంలోని భైరవాన్‌తిప్ప ప్రాజెక్టు వద్ద సెల్ఫీ వీడియో తీసుకుంటూ నీట మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. మరో యువకుడు త్రుటిలో తప్పించుకున్నాడు. రిజర్వాయర్ ఆరో గేటు నుంచి శనివారం నీటిని విడుదల చేస్తారని తెలుసుకుని చుట్టుపక్క ప్రాంతాల యువకులు చూసేందుకు వెళ్లారు. సెల్ఫీలు, ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. ఈ క్రమంలో రాయదుర్గం పట్టణానికి చెందిన మహమ్మద్ ఫైజ్ (20) గేటు ఎత్తగానే డ్యాం దిగువ భాగాన పారుతున్న నీటిలోకి దిగి వెనక్కు నడుస్తూ సెల్ఫీ వీడియో తీసుకోవడం ప్రారంభించాడు. ఈ క్రమంలో వెనుక ఉన్న గుంతను గమనించకుండా అడుగువేసి మునిగిపోయాడు. అతని వెంట వెళ్లిన నోమన్.. ప్రమాదాన్ని పసిగట్టి బయటకు వచ్చేశాడు. విషయం తెలియగానే జలవనరుల శాఖ అధికారులు డ్యాం గేటు దించి మత్స్యకారుల సాయంతో గాలించి యువకుడి మృతదేహాన్ని వెలికి తీసి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుమ్మఘట్ట ఎస్ఐ ఈశ్వరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పేదింటి చిన్నారికి అరుదైన వ్యాధి

- వైద్యం కోసం రూ.20 లక్షలకు పైగా అప్పు
- పూర్తి కాని చికిత్స.. దాతల సాయానికి తల్లిదండ్రుల వినతి


అక్షయ గ్రేస్

గార్లదిన్నె, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కేశవాపురం గ్రామానికి చెందిన బి.అంజనేయులు, అరుణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో చిన్నారి అక్షయ గ్రేస్ (12) జన్యుపరమైన వ్యాధితో బాధపడుతోంది. ఏడో తరగతి చదువుతున్న ఈ బాలిక మూడేళ్ల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురవడంతో అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు, ఆమె అరుదైన వ్యాధితో బాధపడుతోందని గుర్తించారు. జన్యుపరమైన సమస్య కారణంగా ప్రతి ఎముక కీళ్ల వద్ద గుజ్జు బలహీనంగా మారుతోందని నిర్ధారించారు. తల్లిదండ్రులు వైద్యం కోసం ఆమెను బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇప్పటి వరకూ రూ.20 లక్షలకు పైగా అప్పులు చేసి చికిత్స చేయించారు. ఎముకలలోని గుజ్జు మార్పించేందుకు భారీగా ఖర్చు అవుతోంది. అంజనేయులు శింగనమల మండలం ఉల్లికల్లు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అక్షయ గ్రేస్ జబ్బు బారిన పడటంతో ఈ కుటుంబం దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటోంది. దొరికిన చోటల్లా అప్పు చేశామని, అయినా వైద్యం పూర్తి కాలేదని దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఎకరం భూమి తప్ప ఎలాంటి ఆస్తి లేదని, తమ బిడ్డను కాపాడుకునేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, దాతలు సాయం చేయాలని అక్షయ తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. బండెల ఆంజనేయులు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతా నంబరు 31225013888, కల్లూరు బ్రాంచి, ఐఎఫ్ఎస్సీ: ఎస్‌బిఐఎన్0002737కు కానీ, ఫోన్ పే నంబర్ 9985673403కు కానీ దాతలు ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు.

తండ్రి కాదు.. కామాంధుడు!

- 11 ఏళ్ల కన్న కూతురిపైనే అత్యాచారం.. పాతపట్నంలో దారుణం
- అబార్షన్ వికటించి బాధితురాలి మృతి.. పోక్సో కేసు నమోదు

పాతపట్నం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కన్న తండ్రే ఆ బాలిక పాలిట కామాంధుడై.. కాలయముడయ్యాడు. వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళికి చెందిన ఓ వ్యక్తి పాతపట్నం మండలానికి చెందిన మహిళను కొన్నేళ్ల కిందట రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి 12 ఏళ్ల కుమారుడు, 11 ఏళ్ల కుమార్తె ఉన్నారు. వీరంతా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. తండ్రి వాచ్‌మెన్‌గా పనిచేస్తుండగా.. అతడి భార్య కూలి పనులకు వెళ్లేది. ఈ క్రమంలో వావివరసలు మరచి కూతురిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చడంతో ఈనెల 16న శ్రీకాకుళం తీసుకొచ్చి ఓ ఆస్పత్రిలో గర్భం తొలగించే శస్త్రచికిత్స నిర్వహించగా.. వికటించింది. వెంటనే మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అప్పటికే ఆమె మృతి చెందింది. కేజీహెచ్ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో పాతపట్నం పోలీసులు నిందితుడ్ని అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేశారు. శనివారం కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించారు.

డిగ్రీ పెండింగ్ అడ్మిషన్లకు షెడ్యూలు

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ పెండింగ్ అడ్మిషన్లకు షెడ్యూలు విడుదలైంది. శని, ఆదివారాల్లో అభ్యర్థుల పేర్ల రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. శనివారం నుంచి ఈ నెల 27 వరకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్, 28, 29 తేదీల్లో వెబ్ ఆప్షన్ల నమోదు, 30న వెబ్ ఆప్షన్స్ మార్పులకు అవకాశం కల్పించారు. నవంబరు ఒకటో తేదీన అర్హులైన అభ్యర్థులకు సీట్లు కేటాయిస్తారు. సీట్లు పొందిన అభ్యర్థులు 4వ తేదీ లోగా కాలేజీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

పుట్టిన రోజు మిగిల్చిన విషాదం

- ఒకే కుటుంబంలో పిల్లలిద్దరూ మృతి
- సరదాగా స్వర్ణముఖికి వెళ్లిన స్నేహితుల బృందం
- హఠాత్తుగా పెరిగిన ప్రవాహం... నలుగురు గల్లంతు
- శుక్రవారం ఘటన... నిన్న నాలుగు మృతదేహాలు లభ్యం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి సమీపంలోని స్వర్ణముఖి నదిలో శుక్రవారం సాయంత్రం గల్లంతైన నలుగురు విద్యార్థుల మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ రామదాసుకాలనీకి చెందిన మునస్వామిరెడ్డికి ఇద్దరు కుమారులు. బాలు


తేజ


మునిచంద్ర


ప్రకాష్


బాలు

పెద్దకొడుకు కాగా, చిన్నవాడు తేజ. శుక్రవారం బాలు పుట్టిన రోజు. దీంతో పాఠశాలకు వెళ్లకుండా తమ్ముడు తేజ, గ్రామానికి చెందిన ముత్తల శీను కుమారుడు ప్రకాశ్(17), మునిశేఖర రెడ్డి కుమారుడు మునిచంద్ర, మరో ముగ్గురు స్నేహితులు... కలసి స్వర్ణముఖి నదీ తీరానికి వెళ్లారు. సాయంత్రం 4.15 గంటల ప్రాంతంలో నదిలోని ఇసుక దిబ్బలపై ఆడుతూ, స్నానం చేస్తున్న సమయంలో నదిలో నీటి ప్రవాహం ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. అన్నదమ్ములతోపాటు, స్నేహితులు ప్రకాశ్, మునిచంద్ర నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఇదే ఘటనలో కృష్ణ, విష్ణు, మునికృష్ణ బయటపడ్డారు. సమాచారం తెలిసిన వెంటనే... శుక్రవారం సాయంత్రం నుంచి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, పోలీసులు, ఫైర్ సిబ్బంది మూడు బోట్లతో మృతదేహాల కోసం ముమ్మరంగా గాలించారు. దాదాపు మూడు గంటల తర్వాత బాలు మృతదేహం లభ్యమైంది. భారీ వర్షం కురుస్తుండటం, చీకట్లు కమ్ముకోవడంతో గాలింపు చర్యలను ఆపేశారు. శనివారం తెల్లవారుజామున మళ్లీ గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం 8 గంటల ప్రాంతంలో ప్రకాశ్ మృతదేహం లభించింది. ఉదయం 10.23 గంటలకు తేజ మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. 12 గంటల పాటు శ్రమించిన ప్రత్యేక బృందాలు... సాయంత్రం 5.20 గంటలకు మునిచంద్ర మృతదేహాన్ని వెలికితీశాయి. మృతదేహాలకు తిరుపతి రుయాలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి తన పోకడలను కొంత మార్చుకోవాలి. ప్రభుత్వ పరంగా ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే ముందు అనుభవం, అవగాహన ఉండే మంత్రులు, శాసనసభ్యులతో చర్చలు జరపాలి. ప్రతిపక్షాల నుంచి తనకు రక్షణ కవచంలా నిలబడే వారితో ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. రాజకీయాల్లో వర్గాలు సహజం. ముఖ్యమంత్రికి కూడా వర్గం ఉంటుంది. ఎన్నికల ఫలితాల తర్వాత మెజారిటీ శాసనసభ్యులు మద్దతు పలికినందునే కదా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయింది? ముఖ్యమంత్రిగా తన స్థానం పదిలం చేసుకున్న తర్వాత అందరూ ఆయన వర్గమే అవుతారు. గతంలో రాజశేఖర రెడ్డి హయాంలో ఇదే జరిగింది. అప్పటిలా ఇప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం బలంగా కూడా లేదు. ముఖ్యమంత్రికి మార్గదర్శకత్వం వహించేవారు కూడా అధిష్ఠానంలో లేరు. అందుచేత రేవంత్‌రెడ్డి తనకు నమ్మకమైన వారితో థింక్ ట్యాంక్ ఏర్పాటు చేసుకోవాలి.

తలంటిన రేవంత్.. మంత్రులు షాక్!

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మండుతోంది. గురువారంనాడు జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి తనలోని ఆవేదనను, ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. సమావేశం ముగిశాక అధికారులను బయటకు పంపించి... గంటకు పైగా మంత్రులకు ఆయన తలంటారు. దాదాపు రెండేళ్ల క్రితం కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి తాను ఎంత శ్రమించిందీ, ఎంత రిస్కు తీసుకున్నదీ వివరిస్తూ ఇటీవల పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరినీ కలుపుకొని వెళ్లాలన్న ఉద్దేశంతో మంత్రులందరికీ పూర్తి స్వేచ్ఛ ఇచ్చినప్పటికీ బాధ్యత తీసుకోవడానికి ఒక్కరు కూడా ముందుకు రావడంలేదని ఆక్షేపించారు. రాజకీయ ప్రత్యర్థుల విమర్శలను దీటుగా ఎదుర్కోడానికి చొరవ తీసుకోకపోగా, ముఖ్యమంత్రిగా తనను ఫెయిల్యూర్‌గా ముద్రవేయడానికి ప్రయత్నాలు చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో మంత్రిని పేరు పెట్టి పిలిచి 'మీకు ఏం తక్కువ చేశానని ఇలా ప్రవర్తిస్తున్నారు?' అని నిలదీశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని, అనుభవరాహిత్యంతో పార్టీని రేవంత్‌రెడ్డి నాశనం చేస్తున్నారని, పార్టీకి అనాదిగా ఓటు బ్యాంకుగా ఉన్న రెడ్డి, దళితులను దూరం చేసుకున్నారని, బీసీ రిజర్వేషన్లు అంటూ పార్టీకి నష్టం చేశారని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించినట్టుగా చేస్తున్న ప్రచారంపై రేవంత్ మండిపడ్డారు. ఈ విషయమై తాను ఆరా తీయగా ఖర్గే అలాంటి వ్యాఖ్యలు చేయలేదని రూఢీ అయిందని, అయినా తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ చిరాకు పడ్డారు. "నా రెక్కల కష్టంతో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చాను. ఆ క్రమంలో ఎన్నో కష్టాలు పడ్డాను. ఎన్నికల సందర్భంగా ఎంతో రిస్కు తీసుకొని కోట్లు అప్పు చేసి పార్టీ అభ్యర్థులకు ఆర్థిక సహాయం చేశాను. ప్రస్తుత ఎమ్మెల్యేల గెలుపుకోసం కాలికి బలపం కట్టుకొని తిరిగాను. కాంగ్రెస్ గెలుపుకోసం నా అంతగా కష్టపడిన మరొకరి పేరు చెప్పండి?" అని రేవంత్‌రెడ్డి సహచర మంత్రులను నిలదీశారు. మంత్రులు తరచుగా కీచులాడుకోవడం వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇప్పుడు నాలో సహనం నశించింది. ఏదైతే అదవుతుంది. ఇకపై నేను తెగింపుతో వ్యవహరిస్తాను. పార్టీలో క్రమశిక్షణ ముఖ్యం. హద్దు మీరిపోతున్న మంత్రులపై చర్య తీసుకోవడానికి కూడా వెనుకాడను" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. "ఖర్గే నన్ను ఉద్దేశించి అనని మాటలను కూడా అన్నట్టుగా ప్రచారం జరుగుతున్నా మంత్రులు మౌనంగా ఉండటం ఏమిటి? నా ప్రతిష్ఠ దెబ్బతింటే ఆ ప్రభావం పార్టీపై పడదా? నేను ఒక ముఖ్యమంత్రిని అని విస్మరించి ఇష్టారీతిన మాట్లాడటం ఏమిటి? నా సహనానికి కూడా హద్దుంటుంది. బద్నాం చేస్తుంటే చూస్తూ ఊరుకోలేను. నేనేమిటో రుజువు చేసుకొనే సమయం ఆసన్నమైంది. మీ అందరికీ చెప్పాల్సింది చెప్పాను. ఇకపై నేను ఏ నిర్ణయం తీసుకున్నా మీరు బాధపడి ప్రయోజనం ఉండదు. జరుగుతున్నదంతా పార్టీ అధిష్ఠానానికి నివేదిస్తా" అని రేవంత్ స్పష్టం చేశారు. "నన్ను ఫెయిల్యూర్ ముఖ్యమంత్రిగా చిత్రీకరించడానికి జరుగుతున్న కుట్రను ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు. త్వరలోనే అన్నింటికీ ముగింపు పలికిస్తా" అని కూడా హెచ్చరించారు. "పీసీసీ అధ్యక్షుడు కూడా ముఖ్యమంత్రితో సంబంధం లేదన్నట్టుగా వ్యవహరించడం ఏమిటి? ఎవరికి వారు సొంతంగా ప్రకటనలు చేసుకుంటూ పోతే ముఖ్యమంత్రిగా నా పరిస్థితి ఏమిటి? వివిధ స్థాయిలలో సమన్వయం లేకపోతే ఎలా?" అని కూడా రేవంత్ నిలదీసినట్టు తెలిసింది.

ఆవేదన, ఆవేశం...

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ స్థాయిలో తలంటుతారని ఊహించని మంత్రులు ఒకింత షాక్‌కు గురయ్యారు. ఆయన ఆగ్రహంగా ఉన్నారని గ్రహించిన కొండా సురేఖ విలేకరుల సమావేశంలో తన కుమార్తె వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పారు. మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డిలను ఉద్దేశించి.. "సీనియర్లుగా మిమ్మల్ని ఎంతో గౌరవించాను. నాతో

చేసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్లకు కూడా నేరుగా ఫోన్లు చేస్తూ కనీస మర్యాద ఇవ్వకుండా ఇతర శాఖలకు సంబంధించిన అంశాలలో ఆదేశాలు జారీచేస్తున్నారు. కొంతమంది మంత్రులు మహిళా అధికారులను ఇళ్లకు పిలిపించుకుంటున్నారు. రాష్ట్రానికి ఒక్కరే ముఖ్యమంత్రిగా ఉంటారన్న వాస్తవాన్ని విస్మరించి ఎవరికి వారు ముఖ్యమంత్రులుగా భావించుకోవడాన్ని అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. కనీస ప్రజాదరణ లేని వాళ్లు సైతం తాము కాంగ్రెస్ పార్టీలో సీనియర్లం అని డాంబికాలు పోతూ రేవంత్‌రెడ్డిని జూనియర్ అని కించపరుస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రతిష్ఠను ఇనుమడింపజేయడానికి ప్రయత్నించినప్పుడే పార్టీ ప్రతిష్ఠ, ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుందన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించి వ్యవహరిస్తున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వంలో వివిధ

> **నిజానికి రేవంత్‌రెడ్డి అత్యంత రిస్కు తీసుకొని సాధించుకున్న ముఖ్యమంత్రి పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు వంటిది కాదు. రాష్ట్రంలో నాయకత్వ మార్పిడికి అధిష్ఠానం కూడా సాహసించలేని పరిస్థితి. ఒక ముఖ్యమంత్రికి ఇంతకంటే అనువైన వాతావరణం ఇంకేముంటుంది?**

స్థాయిలలో అవినీతి పెరిగిపోయింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులను కట్టడి చేయలేకపోతున్నారన్న అభిప్రాయం ఏర్పడింది. మరోవైపు ప్రభుత్వం వద్ద నిధుల కొరత కారణంగా చిన్న చిన్న పనులు కూడా మంజూరు చేయించలేని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ పరిణామాలతో వారిలో అసంతృప్తి చోటుచేసుకుంటోంది.

కలిసిరాని నిర్ణయాలు...

ప్రభుత్వపరంగా తీసుకుంటున్న నిర్ణయాలు కూడా కలిసి రావడంలేదు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలన్న నిర్ణయం ఈ కోవలోకే వస్తుంది. ముందూ వెనుకా ఆలోచించకుండా, చట్టపరమైన చిక్కులను లోతుగా అధ్యయనం చేయకుండా ఈ నిర్ణయం తీసుకోవడంతో ఉభయ భ్రష్టత్వం ప్రాప్తించింది. 42 శాతం రిజర్వేషన్లు ఇప్పించే

చల్లినట్టయింది. రిజర్వేషన్లు పెంచడానికి అసెంబ్లీలో మద్దతు ప్రకటించిన రాజకీయ పార్టీలు ఇప్పుడు బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వంపైకి నెట్టి తప్పుకొన్నాయి. ఫలితంగా ఈ సమస్య పరిష్కార బాధ్యత ప్రభుత్వంపై పడింది. రాజకీయాలు రంగ ప్రవేశం చేయడంతో ప్రభుత్వం ఆత్మరక్షణలో పడింది. మొత్తంగా చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి దశా దిశా లేకుండా పోయిందన్న అభిప్రాయం ప్రజల్లో బలపడింది. ఈ దశలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతోంది. గత ఎన్నికల్లో ఇక్కడ గెలుపొందిన భారత రాష్ట్ర సమితి ఈ స్థానాన్ని తిరిగి కైవసం చేసుకోవడానికి సర్వశక్తులూ ఒడ్డుతోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున ఈ స్థానాన్ని గెలుచుకోవలసిన ఆవశ్యకత కాంగ్రెస్ పార్టీకి ఏర్పడింది. ఈ స్థానాన్ని గెలుచుకోగలిగితే కాంగ్రెస్ ప్రభుత్వం కొంతలో కొంత కుదుటపడుతుంది. ఫలితం అందుకు విరుద్ధంగా ఉంటే మాత్రం ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం మరింత బలపడుతుంది. ఇలాంటి సవాళ్లను ఎదురుగా పెట్టుకొని మంత్రులు, నాయకులు క్రమశిక్షణను ఉల్లంఘించి వ్యవహరించడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిర్రెత్తుకొచ్చి ఉంటుంది. అందుకే ఆయన ఈ రెండేళ్లలో ఎన్నడూ లేని విధంగా సీనియర్లు, జూనియర్లు అన్న తేడా లేకుండా మంత్రులందరికీ క్లాస్ పీకారు.

అధిష్ఠానం ఏం చేస్తున్నట్లు?

తెలంగాణలో కాంగ్రెస్ ప్రస్తుత పరిస్థితికి ఆ పార్టీ అధిష్ఠానం కూడా బాధ్యత వహించాలి. రాజశేఖరరెడ్డి హయాంలో వలె ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి స్వేచ్ఛ ఇవ్వడంలేదు. కాంగ్రెస్ పార్టీలో అందరినీ కలుపుకొనిపోవడం అంటే ఆషామాషీ

మంత్రులను హెచ్చరించారు. ఇకపై తాను కఠినంగా ఉండబోతున్నానన్న సంకేతాన్ని ఆయన మంత్రులు, నాయకులతో పాటు పార్టీ అధిష్ఠానానికి కూడా పంపాలని నిర్ణయించుకున్నారని చెబుతున్నారు. కొండా సురేఖ విషయమే తీసుకుందాం! ఆమె కుమార్తె అన్న మాటలకు సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసి ఉండాలి. రేవంత్‌రెడ్డి కూడా ఒక దశలో ఇదే నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. అయితే పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవ తీసుకొని కొండా సురేఖను ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లారు. దీంతో ఆయన అప్పటికి శాంతించారు. అయితే, గురువారం మంత్రివర్గ సమావేశంలో అధికారులు వెళ్లిపోయిన తర్వాత జరిగిన దానికి క్షమాపణ చెప్పాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారట. ఫలితంగానే తన కుమార్తె వ్యవహార శైలికి కొండా సురేఖ క్షమాపణ చెప్పుకొన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితం ఎలా ఉంటుందన్న విషయం పక్కన పెడితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి కాయకల్ప చికిత్స చేయాల్సిన సమయం ఆసన్నమైంది. అధికారం శాశ్వతం కాదు. అధికారంలో ఉన్నంత కాలం పదవికి వన్నె తేవాలన్న లక్ష్యంతో మాత్రమే రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తే పరిస్థితుల్లో మార్పు రావొచ్చు. నిజానికి కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం రేవంత్‌రెడ్డికి ప్రత్యామ్నాయం లేదు. రేవంత్‌రెడ్డి కాని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కూలిపోవచ్చు. పార్టీ అధిష్ఠానం కూడా ఈ వాస్తవాన్ని గుర్తించాలి. 2004 తర్వాత రాజశేఖరరెడ్డి పార్టీలో, ప్రభుత్వంలో పట్టు పెంచుకున్నట్టుగానే ఇప్పుడు రేవంత్‌రెడ్డి కూడా పట్టు సాధించడానికి ప్రయత్నించాలి. హద్దు మీరుతున్న మంత్రులపై చర్యలు తీసుకొనే విషయంలో చొరవ తీసుకోవాలి. అప్పుడే ఆయన నాయకత్వం పట్ల భయంతో పాటు భక్తి ఏర్పడుతుంది. ముఖ్యమంత్రిగా బాగా

సమానంగా గుర్తించి ప్రభుత్వంలో పెద్దపీట వేశాను. ఇంకేం చేయాలి?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. సీనియర్లు, జూనియర్లు అన్న తేడా లేకుండా అందరికీ ఆయన క్లాస్ తీసుకున్నారు. రేవంత్‌రెడ్డిలో ఈ మార్పు చూసి మంత్రులు అవాక్కయ్యారు. ఆయనలో ఆవేదన, ఆవేశం కట్టలు తెంచుకోవడానికి కారణం లేకపోలేదు. పార్టీ పైన, ప్రభుత్వం పైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పట్టులేదని ప్రజలు అభిప్రాయపడేలా ఇటీవలి కాలంలో కొన్ని సంఘటనలు చోటుచేసుకున్నాయి. అదే సమయంలో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఫెయిల్యూర్ అన్న ప్రచారం చాప కింద నీరులా సాగుతోంది. ప్రభుత్వపరంగా తీసుకుంటున్న నిర్ణయాల విషయంలో కూడా మంత్రులు తమకు సంబంధం లేదన్నట్టుగా ప్రచారం చేస్తున్నారు. అనుభవరాహిత్యంతో రేవంత్‌రెడ్డి నిర్ణయాలు తీసుకుంటున్నారని కూడా ప్రచారం చేస్తున్నారట! కొంత మంది మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ విధంగా ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం మొదలెట్టారు. అదే సందర్భంలో మంత్రుల మధ్య కీచులాటలు బహిర్గతం అయ్యాయి. మంత్రులు బాహాటంగా విమర్శించుకున్నారు. ఈ దశలోనే మంత్రి కొండా సురేఖ కుమార్తె ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దారుణంగా దూషించారు. ముఖ్యమంత్రి అన్న గౌరవం కూడా లేకుండా ఆ అమ్మాయి అలా మాట్లాడటంతో రేవంత్‌రెడ్డికి సహజంగానే బాధ కలిగింది.

'మునుపటి' కాంగ్రెస్

కాంగ్రెస్ రాజకీయాలు ఒకప్పుడు ఇలాగే ఉండేవి. కాంగ్రెస్ మార్కు రాజకీయాలను ప్రజలు మరచిపోయి దాదాపు మూడు దశాబ్దాలు అవుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో 2004లో ముఖ్యమంత్రి అయిన రాజశేఖరరెడ్డి పార్టీ పైన, ప్రభుత్వం పైన పూర్తి పట్టు సాధించారు. దీంతో కాంగ్రెస్‌లో అసంతృప్త స్వరాలు మూగబోయాయి. తెలుగునాట ప్రాంతీయ పార్టీలు బలపడటంతో ప్రజలు కూడా కాంగ్రెస్ మార్కు రాజకీయాలను మరచిపోయారు. రాజశేఖరరెడ్డి కూడా కాంగ్రెస్‌ను ప్రాంతీయ పార్టీ స్థాయిలోనే నడిపారు. ఏక వ్యక్తి పాలనకు, ప్రాంతీయ పార్టీల కల్చర్‌కు అలవాటుపడిన తెలుగు ప్రజలకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు రుచించడం లేదు. ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో దశా దిశా లేకుండా పోయిందన్న అభిప్రాయం ప్రజల్లో ఏర్పడుతోంది. ప్రభుత్వంలోనే కాదు, పార్టీలోనూ రేవంత్‌రెడ్డికి పట్టు లేదన్న అభిప్రాయం వ్యాప్తిచెందుతోంది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అన్న వాస్తవాన్ని విస్మరించి ఎవరు పడితే వారు ఏది పడితే అది మాట్లాడుతుండటంతో జనంలో ఆయన పలుచన అవుతున్నారు. దీని ప్రభావం సహజంగానే పార్టీపై కూడా పడుతోంది. 1995 నుంచి నేటి వరకు ఒంటి చేత్తో పార్టీని, ప్రభుత్వాన్ని నడిపిన, నడుపుతున్న చంద్రబాబు... ఇంకా కేసీఆర్, జగన్‌రెడ్డి, దివంగత రాజశేఖరరెడ్డిని చూసిన ప్రజలు రేవంత్‌రెడ్డి కూడా అలాగే వ్యవహరిస్తారనీ వ్యవహరించాలనీ ఆశించారు. అయితే, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోంది. ముఖ్యమంత్రిని దూషించిన వారిపై కూడా చర్య తీసుకోలేని పరిస్థితి ఉండటం ఏమిటి? అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది. చర్య తీసుకోకపోగా మంత్రి కొండా సురేఖ దంపతులను ముఖ్యమంత్రి నివాసానికి తీసుకెళ్లి చర్చలు జరపడం ఏమిటి? దీనివల్ల ప్రజలకు ఏమి సందేశం ఇస్తున్నారు? సురేఖ దంపతులతో రేవంత్‌రెడ్డి రాజీ కుదుర్చుకున్నారన్న అభిప్రాయం ప్రజల్లో సహజంగానే ఏర్పడింది. మరో వైపు మంత్రులు ఎవరికి వారు సర్వ స్వతంత్రులుగా వ్యవహరిస్తున్నారు. ఆ శాఖ, ఈ శాఖ అని లేకుండా అన్ని శాఖల్లో జోక్యం



బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని బీసీలు భావిస్తుండగా... పార్టీకి అండగా ఉన్న రెడ్లు ఈ నిర్ణయం పట్ల కినుక వహించారు. దళితులు కూడా అసంతృప్తితో ఉన్నారు. నిజానికి బీసీలకు రిజర్వేషన్ల అంశంపై గతంలో పలువురు నాయకులు చేతులు కాల్చుకున్నారు. ఇందిరాగాంధీ వంటి శక్తిమంతమైన నాయకురాలు కూడా మండల్ కమిషన్ నివేదిక అమలు చేయడానికి సాహసించలేకపోయారని దివంగత కేంద్ర మాజీ మంత్రి పి.శివశంకర్ తన పుస్తకంలో ప్రస్తావించారు. వీపీ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మండల్ కమిషన్ నివేదిక

కాదు. నాయకుడికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చినప్పుడే అది సాధ్యం. భయంతో కొందరు, భక్తితో మరికొందరు ముఖ్యమంత్రి పట్ల వినయ విధేయతలు ప్రదర్శిస్తారు. అయితే రేవంత్ విషయంలో ఇప్పుడా పరిస్థితి ఉందా? అంటే లేదనే చెప్పవచ్చు. పార్టీ అధికారంలోకి రావడానికి తన కృషి ప్రధాన కారణమని తెలిసినప్పటికీ... పార్టీలో తాను జూనియర్ అన్న భావన ఉన్నందున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభం నుంచి అణకువతోనే ఉంటూ వచ్చారు. చివరికి అది అందరికీ అలుసుగా మారింది. కొంతమంది మంత్రులైతే ఆయనను ముఖ్యమంత్రిగా కూడా

> **భయంతో కొందరు, భక్తితో మరికొందరు ముఖ్యమంత్రి పట్ల వినయ విధేయతలు ప్రదర్శిస్తారు. అయితే రేవంత్ విషయంలో ఇప్పుడా పరిస్థితి ఉందా? అంటే లేదనే చెప్పవచ్చు. పార్టీ అధికారంలోకి రావడానికి తన కృషి ప్రధాన కారణమని తెలిసినప్పటికీ... పార్టీలో తాను జూనియర్ అన్న భావన ఉన్నందున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభం నుంచి అణకువతోనే ఉంటూ వచ్చారు. చివరికి అది అందరికీ అలుసుగా మారింది. కొంతమంది మంత్రులైతే ఆయనను ముఖ్యమంత్రిగా కూడా గుర్తించడానికి ఇష్టపడటం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీ పుట్టి మునగడంతోపాటు తాను కూడా మునిగిపోతానని ముఖ్యమంత్రి అభిప్రాయపడుతున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా, ముఖ్యమంత్రిగా తాను ఫెయిల్యూర్ అన్న ముద్ర వేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను రేవంత్‌రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ కారణంగానే తనకు రాజకీయం తెలియక మెతకగా ఉంటున్నానని భావించవద్దు అని ఆయన తాజాగా మంత్రులను హెచ్చరించారు. ఇకపై తాను కఠినంగా ఉండబోతున్నానన్న సంకేతాన్ని ఆయన మంత్రులు, నాయకులతోపాటు పార్టీ అధిష్ఠానానికి కూడా పంపాలని నిర్ణయించుకున్నారని చెబుతున్నారు.**

అమలుకు పూనుకోగా దేశ వ్యాప్తంగా ఆందోళనలు చెలరేగాయి. మండల్ కమిషన్ మంటలు మిన్నంటడంతో వీపీ సింగ్ రాజకీయంగా మూల్యం చెల్లించుకున్నారు. ఈ నేపథ్యంలో పూర్వాపరాలు ఆలోచించకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని నిర్ణయం తీసుకుంది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సుప్రీం కోర్టు తీర్పు అమలులో ఉన్నందున ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టులు కొట్టిపారేశాయి. దీంతో బీసీల ఆశలపై నీళ్లు

గుర్తించడానికి ఇష్టపడటం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీ పుట్టి మునగడంతోపాటు తాను కూడా మునిగిపోతానని ముఖ్యమంత్రి అభిప్రాయపడుతున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా, ముఖ్యమంత్రిగా తాను ఫెయిల్యూర్ అన్న ముద్ర వేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను రేవంత్‌రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ కారణంగానే తనకు రాజకీయం తెలియక మెతకగా ఉంటున్నానని భావించవద్దు అని ఆయన తాజాగా

పనిచేశారని రుజువు చేసుకోగలిగినప్పుడే భవిష్యత్తులో మళ్లీ మళ్లీ అవకాశాలు వస్తాయి. అలా కాకుండా ఫెయిల్యూర్‌గా ముద్రపడితే భవిష్యత్తులో మళ్లీ అవకాశం రావడం కష్టం. ఏ ఒక్కరూ అధికారంలో శాశ్వతంగా ఉండరు అన్న సత్యాన్ని గ్రహించి మెలగాలి. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి కూడా తన పోకడలను కొంత మార్చుకోవాలి. ప్రభుత్వ పరంగా ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే ముందు అనుభవం, అవగాహన ఉండే మంత్రులు, శాసనసభ్యులతో చర్చలు జరపాలి. ప్రతిపక్షాల నుంచి తనకు రక్షణ కవచంలా నిలబడే వారితో ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. రాజకీయాల్లో వర్గాలు సహజం. ముఖ్యమంత్రికి కూడా వర్గం ఉంటుంది. ఎన్నికల ఫలితాల తర్వాత మెజారిటీ శాసనసభ్యులు మద్దతు పలికినందునే కదా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయింది? ముఖ్యమంత్రిగా తన స్థానం పదిలం చేసుకున్న తర్వాత అందరూ ఆయన వర్గమే అవుతారు. గతంలో రాజశేఖరరెడ్డి హయాంలో ఇదే జరిగింది. అప్పటిలా ఇప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం బలంగా కూడా లేదు. ముఖ్యమంత్రికి మార్గదర్శకత్వం వహించేవారు కూడా అధిష్ఠానంలో లేరు. అందుచేత రేవంత్‌రెడ్డి తనకు నమ్మకమైన వారితో థింక్ ట్యాంక్ ఏర్పాటు చేసుకోవాలి. ప్రస్తుతం ముఖ్యమంత్రి చుట్టూ ఉన్న కొంతమంది వల్ల ఆయన గౌరవం తగ్గుతోంది. అధికారంలో లేనప్పుడు మీ పక్కన ఎవరున్నారన్నది ఎవరూ పట్టించుకోరు. అధికారంలోకి వచ్చిన తర్వాత, అది కూడా ముఖ్యమంత్రి వంటి అత్యున్నత పదవిలో ఉన్నప్పుడు ఆయన చుట్టుపక్కల ఎవరు ఉన్నారన్నది ప్రజలు గమనిస్తుంటారు. నాయకుడికి ఆత్మవిశ్వాసం ముఖ్యం. ఆత్మవిశ్వాసంతో అడుగులు ముందుకు వేసినప్పుడే పరిస్థితులు అనుకూలంగా మారతాయి. రాజకీయాలలో రిస్కు తీసుకున్నప్పుడే ఫలితాలు వస్తాయి. రేవంత్‌రెడ్డి గతంలో రిస్కు తీసుకొని తెలుగుదేశం పార్టీని వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఢీకొని ఉండకపోతే ఇప్పుడు ముఖ్యమంత్రి కాగలిగేవారా? తనను చులకన చేయడానికి ప్రయత్నిస్తున్న వారికి చెక్ పెట్టే కార్యక్రమాన్ని ఆయన వెంటనే ప్రారంభించాలి. రేవంత్‌రెడ్డి తనను తాను సంస్కరించుకోవడంతో పాటు పార్టీని, ప్రభుత్వాన్ని సంస్కరించడానికీ నడుం బిగించాలి. నిజానికి రేవంత్‌రెడ్డి అత్యంత రిస్కు తీసుకొని సాధించుకున్న ముఖ్యమంత్రి పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు వంటిది కాదు. రాష్ట్రంలో నాయకత్వ మార్పిడికి అధిష్ఠానం కూడా సాహసించలేని పరిస్థితి. ఒక ముఖ్యమంత్రికి ఇంతకంటే అనువైన వాతావరణం ఇంకేముంటుంది? పార్టీలో, ప్రభుత్వంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను తన నాయకత్వ ప్రతిభను ప్రదర్శించడానికి లభించిన అవకాశాలుగా రేవంత్‌రెడ్డి పరిగణించాలి. అలా చెయ్యలేని పక్షంలో విఫల ముఖ్యమంత్రిగానే మిగిలిపోవలసి వస్తుందని తెలుసుకోవాలి. ఏ పార్టీలోనైనా తమ నాయకుడి ప్రతిష్ఠను పెంచడం వల్లనే ఆ పార్టీకి భవిష్యత్తు ఉంటుంది. రాజశేఖరరెడ్డిని పార్టీ మొత్తం తలకెత్తుకోవడం వల్లనే ఆయన ప్రతిష్ఠ పెరిగి 2009లో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. అలా కాకుండా కాంగ్రెస్ మంత్రులు, నాయకులు ఇప్పటిలా వ్యవహరించి ఉంటే 2009లో పార్టీ ఓడిపోయి ఉండేది. భారత రాష్ట్ర సమితి నాయకులు ఇప్పటికే తాము అధికారంలోకి వచ్చినట్టేనని భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్ లేదా బీజేపీకి అవకాశం ఇవ్వడమా? లేక కాంగ్రెస్ ప్రతిష్ఠను, ప్రభుత్వ ప్రతిష్ఠను పునరుజ్జీవింపజేయడమా? అన్నది కాంగ్రెస్ ముఖ్యులే తేల్చుకోవాలి. ప్రజలు మరచిపోయిన కాంగ్రెస్ సంస్కృతిని మళ్లీ గుర్తుకు తెచ్చే విధంగా ప్రవర్తిస్తే అధికారం కోల్పోవడానికి సిద్ధపడక తప్పదు. తస్మాత్ జాగ్రత్త!

రాజవంశీకుల శాసనం అబద్ధమా?


కొత్త శాసనాలు బయటపడితే పాతవి మూలకు పడేయాలా? ఇదేం వాదన! సామంతుడో, మరెవరో వేసిన తామ్ర శాసనాలకు ఉన్న విలువ స్వయానా రాజవంశీకులే వేసిన బయ్యారం శాసనానికి లేదా? ఇదేం శాస్త్రీయత?! (కాకతీయులపై కొత్త వెలుగులు- సెప్టెంబర్ 28). అది పవర్ పాయింట్ ప్రదర్శన అయినా, ఐమాక్స్ తెర మీద ప్రదర్శన అయినా నిజాలు తారుమారవుతాయా?

క్రీ.శ 956 నాటి దానార్ణవుని 'మాంగల్లు దాన శాసనం' కాకర్త్య గుండన వంశక్రమాన్ని వెనుకకు మూడు తరాల వరకు ప్రస్తావించింది. కాకతీయ వంశం, గుండియ రాష్ట్రకూట, ఎఱ్రియ రాష్ట్ర కూట (భార్య వంద్యనాంబ), కాకర్త్య గుండన... ఈ శాసనంతో హనుమకొండకు చెందిన మొదటి తరం కాకతీయులను కలపడంలో నాటి చరిత్రకారులు విఫలమైన సందర్భంలో, 1966లో ఆవిష్కరించిన బయ్యారం చెరువు శాసనం కాకతీయ వంశక్రమాన్ని సంపూర్ణంగా వివరించింది. దీంతో కాకతీయ వంశక్రమంపై అప్పటివరకు ఉన్న సందేహాలన్నీ పటాపంచలు అయ్యాయి! మాంగల్లు శాసనంలో 4 నుంచి 9 తరాలు వర్ణనతో, రుద్రదేవుడి అనుమకొండ శాసనంలో 12, 13 తరాల వర్ణనతో, బయ్యారం శాసనంలోని 14 తరాల వరకు పోల్చి చూస్తే, ఎట్టి భేదం లేకుండా బయ్యారం శాసనం కాకతీయుల వంశవృక్ష నిరూపణకు ప్రబల సాక్ష్యంగా నిలిచింది.

దుర్జయ వంశం- వెన్నయ- మొదటి గుండన- రెండవ గుండన- మూడవ గుండన- ఎఱ్రియ-పిండి గుండన(కాకర్త్య గుండన)- ఇలా గణపతి దేవుడి వరకు 14 తరాల వరకు సాగుతుంది. ఈ విధంగా కాకతీయ వంశక్రమంపై బయ్యారం చెరువు శాసనం మనకు ఒక స్పష్టత ఇస్తుంది. ఎందుకంటే ఇది స్వయానా కాకతీయ వంశస్థులే వేయించారు కాబట్టి! (ఈ శాసనాన్ని వేయించింది గణపతి దేవుడి చెల్లెలైన మైలమాంబ- ఈమె నతవాటి వక్కటి మల్లరుద్రుని భార్య.) కాకతీయ వంశస్థాపకుడు అయిన వెన్ననృపుడు పృథ్వీని కాకతీ పట్టణం నుంచి పాలించాడని స్పష్టంగా చెబుతున్నది (గణపతి దేవుడి గారవపాడు దాన శాసనం కూడా ఇదే విషయాన్ని తెలుపుతున్నది). ఈ వెన్నయ్య, ఆయన సైన్యంతో కలిసే, రాష్ట్రకూట రాజైన దంతిదుర్గుడు... బాదామి చాళుక్యులపై విజయాన్ని సాధించి, ఆ రాజ్య భాగాలను కలుపుకున్న తరువాతే రాష్ట్రకూట రాజ్యాన్ని స్థాపించాడు!

కాకతీయుల వంశానికే గాక వారి చరిత్రకు సంబంధించి కూడా బయ్యారం శాసనం ఆయువుపట్టు లాంటిది, అటు తర్వాత ఎక్కడ ఏ శాసనాలు దొరికినా

> **స్థానిక చారిత్రక అస్తిత్వం నిలుపుకోవడానికి ఆరాటపడే మాలాంటి వాళ్ళమంతా అడిగే ప్రశ్న ఒక్కటే! ఎక్కడో ఏదో ఒక శాసనం బయలుపడినంత మాత్రాన ఆ ఒక్క శాసనమే కాకతీయ చరిత్రను మొత్తం తిరగరాయగలదా? అలాంటప్పుడు అంతకు ముందున్న వేల శాసనాల అస్తిత్వం మాటేమిటి?**



(అవి శిలాశాసనాలైనా, రాగిరేకుల శాసనాలైనా, సాహిత్యాధారాలైనా) ఇప్పటివరకు బయల్పడిన అతిపెద్ద పూదండ లాంటి వేల కాకతీయ శాసనాలలో (వాటిలో ఏదైనా అదనపు సమాచారం ఉంటే) అవి ఒక పుష్పంలా ఒదిగిపోగలవే తప్ప, వాటికవే చరిత్రను తిరగరాయలేవు! అలా రాయాలని అభిలషించేవారు స్వయానా కాకతీయ రాజవంశీకులు వేసిన తమ వంశవృక్ష శాసనాన్ని చరిత్రలో కనుమరుగు చేయాల్సి ఉంటుంది!!

మొదటి తరం కాకతీయులు బయలుదేరిన కాకతీపురం విషయానికొస్తే... ఊహలే సిద్ధాంతాలకు దారితీస్తాయి, సిద్ధాంతాలు పరికల్పనలకు... అంటే ప్రయోగాలకు దారితీస్తాయి. మొహంజోదారో నగరం బయలు పడకముందు 1920లో జాన్ మార్షల్ మదిలో ఊహలే ఉన్నాయి, అక్కడ ఎందుకు ప్రాచీన అవశేషాలు దొరుకుతున్నాయని! ఆ తర్వాత ఆయన ఒక సిద్ధాంతాన్ని నిర్మించుకుని, నిరూపణ కోసం అక్కడ తవ్వకాలు చేశాడు. మొహంజోదారో నగరాన్ని ప్రపంచం ముందు నిలబెట్టాడు! ప్రాచీన కాకతీపురానికి సంబంధించి హన్మకొండకు దగ్గరలోని కక్కిరాలపల్లి, క్షత్రియాల గ్రామ పేర్లలో కాకతీయ నామ సామ్యం ఉంది. పంథిని, క్షత్రియాల, కక్కిరాలపల్లిని కలుపుతూ ఒక త్రిభుజాన్ని గీస్తే ఆ మధ్యలో ప్రాచీన విశేషాలు ఇబ్బడి ముబ్బడిగా దొరికాయి. ఆ ప్రాచీన అవశేషాల్ని ఆయా గ్రామాల్లో నేటికీ చూడవచ్చు. పంథిని గ్రామశివారులో రెండు పురాతన గుళ్లు ఉన్నాయి. వాటిలో విగ్రహాలు లేవు, ఆ గుళ్లకు ఓ పేరంటూ లేదు. అయితే అవి సకలేశ్వరాలయం, గుండేశ్వర భట్టారక ఆలయం ఎందుకు కాకూడదు?

ప్రాచీన కాలంలో ప్లేగు, కలరా లాంటి వ్యాధులు వచ్చినప్పుడు ఊళ్లకు ఊళ్లే నిర్మానుష్యమయ్యేవి. చావగా మిగిలిన వాళ్ళు కట్టుబట్టలతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి, అక్కడ మళ్లీ గ్రామాలను నెలకొల్పుకునేవారు! అలా ఆ కాకతీపురం నుంచి ఇరువైపులా వెళ్లిపోయిన ప్రజా సమూహాలే ఈ క్షత్రియాల, కక్కిరాలపల్లి లాంటి గ్రామాలను నిర్మించుకున్నాయని శాస్త్రీయంగా ఊహించవచ్చు! అందుకే ఈ రెండు గ్రామాల పేర్లలో కాకతీపుర నామ సామ్యం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఇక్కడ తవ్వకాలు సాగించి, ఏ ఆధారం దొరకక, ప్రయత్నం విఫలమైనప్పుడు మాత్రమే... సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలోని కాగిత (కాకతీయ) రామచంద్రపురం కాకతీపురమా? లేక అదే జిల్లాలో కోదాడ మండలంలో దొండపాడు గ్రామంలో గల 'కాకతమ్మ బీడు'ను తవ్వితే కాకతీపురం బయలుపడుతుందా? లేక కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాం పట్టణానికి 12 మైళ్ళ దూరంలో కాకతీయ అనే గ్రామం ఉందని కర్ణాటక చరిత్రలో ఉంది, మరి అదా? అదీ కాకపోతే నేటి మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలోని కాందారపురము నుంచి కాకతీయులు బయలుదేరినట్టుగా ప్రతాప చరిత్ర తెలుపుతున్నది, మరి ఇది నిజమా? ఇవన్నీ మనం శాస్త్రీయంగా తేల్చుకున్నాక మాట్లాడుకోవల్సి ఉన్నది! స్వస్తివాక్యం ఏమంటే- స్థానిక చారిత్రక అస్తిత్వం నిలుపుకోవడానికి ఆరాటపడే మాలాంటి వాళ్ళమంతా అడిగే ప్రశ్న ఒక్కటే! ఎక్కడో ఏదో ఒక శాసనం బయలు పడినంత మాత్రాన ఆ ఒక్క శాసనమే కాకతీయ చరిత్రను మొత్తం తిరగ రాయగలదా? అలాంటప్పుడు అంతకు ముందున్న వేల శాసనాల అస్తిత్వం మాటేమిటి?

▪ డా. అంబటి శ్రీనివాస్‌రాజు
'మన కాకతీయులు' గ్రంథకర్త





మొంథా ముప్పు

జిల్లాపై తుఫాను ప్రభావం

27, 28, 29 తేదీల్లో అతి భారీ వర్షాలు, ఈదురుగాలులు

- 28న మచిలీపట్నం-కాకినాడ మధ్య తీరం దాటే అవకాశం
- జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు మూడు రోజుల సెలవులు
- పట్టణ, గ్రామస్థాయిలో ప్రత్యేక బృందాల ఏర్పాటు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ లక్ష్మీశ
- అధికారులతో టెలీ కాన్ఫరెన్స్, కీలక సూచనలు



అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ టెలీ కాన్ఫరెన్స్

మొంథా తుఫాను ముంచుకొస్తోంది. దీని ప్రభావానికి ఈనెల 27, 28, 29 తేదీల్లో భారీ వర్షాలతో పాటు ఈదురుగాలులు కూడా వీస్తాయని, 28న మచిలీపట్నం-కాకినాడ మధ్య తీరం దాటుతుందని వాతావరణ శాఖ అంచనా వేయడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మూడు రోజుల పాటు పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో పాటు వసతి గృహాల్లోని పిల్లలను స్వస్థలాలకు పంపిస్తున్నారు. తుఫానును ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ శనివారం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు చేశారు.

ఆంధ్రజ్యోతి-విజయవాడ/కలెక్టరేట్ : మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం శనివారం హై అలర్ట్‌ను ప్రకటించింది. గ్రామ, పట్టణ స్థాయిలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు చేపట్టేలా దిశానిర్దేశం చేసింది. జిల్లా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కలెక్టరేట్‌లో 9154970454 నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. తుఫాను పరిస్థితులను అధ్యయనం చేస్తూ అప్రమత్తం కావటానికి వీలుగా కమాండ్ కంట్రోల్ రూమ్ (సీసీఆర్)ను సిద్ధం చేశారు. ఆర్డీవోలు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులతో శనివారం కలెక్టర్ లక్ష్మీశ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్‌తో పాటు డివిజన్లవారీగా మిగతా 6లో..



తుఫాను గమనాన్ని సూచిస్తూ వాతావరణ శాఖ విడుదల చేసిన చిత్రం

పాఠశాలలకు సెలవులు

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు ఈ నెల 27, 28, 29 తేదీల్లో సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులందరూ ఈ నెల 26వ తేదీ సాయంత్రంలోగా వారి ఇళ్లకు చేరేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సజావుగా అమలయ్యేలా జిల్లా విద్యాశాఖాధికారితో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

పుకార్లు నమ్మొద్దు

సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, ప్రశాంతంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు శనివారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రజలను కోరారు. అత్యవసర కమ్యూనికేషన్ కోసం మొబైల్ ఫోన్లను చార్జ్ చేసుకుంటూ ఉండాలని, వాతావరణ హెచ్చరికలు ఎప్పటికప్పుడు మెసేజ్‌ల రూపంలో వస్తుంటాయని, మొబైల్‌ను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు.

చోడవరంలోని పుట్ట వద్ద భక్తుల రద్దీ (ఇన్‌సెట్‌లో) కలెక్టరేట్‌లోని పుట్ట వద్ద చంటిబిడ్డను నాగేంద్రుడికి చూపిస్తూ..

ఘనంగా నాగుల చవితి

నాగుల చవితి వేడుకలు శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. మోపిదేవిలోని సుబ్బారాయుడి ఆలయంతో పాటు చోడవరంలోని నాగేంద్రస్వామి గుడికి భక్తులు పోటెత్తారు. అలాగే, యనమలకుదురులోని శివాలయం, ఇంద్రకీలాద్రిపై సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, కలెక్టరేట్‌లోని పుట్ట వద్ద చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు వేకువజామునే తరలివచ్చి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

రాచమార్గానికి రయ్యీరయ్యీన..

సీడ్ యాక్సెస్ రోడ్డు ఫేజ్-3 పనులకు టెండర్లు

- రూ.511.84 కోట్లతో ఆరు వరసల ఎలివేటెడ్ కారిడార్
- ఉండవల్లి పంపింగ్ హౌస్-మణిపాల్ హాస్పిటల్ వరకు
- ఇప్పటికే మొదలైన ఫేజ్-2 పనులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతికి రాచమార్గంగా ఉన్న సీడ్ యాక్సెస్ రోడ్డు (ఈ3)ను అభివృద్ధి చేసేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) శ్రీకారం చుట్టింది. ఫేజ్-2 పనులను ఇటీవలే ప్రారంభించిన మిగతా 6లో..





ఎల్-1 ఎవరు?

విజయవాడ మెట్రోకు నాలుగు కంపెనీల జాయింట్ బిడ్లు

- ఎల్అండ్‌టీ-రిత్విక్, మెగా-ఎన్‌సీసీలు జాయింట్‌గా..
- రెండు సంస్థల్లో ఎవరికి టెండర్ దక్కుతుందో..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయజవాడ మెట్రోరైల్ టెండర్లలో బిడ్లు వేసిన కాంట్రాక్టు సంస్థల్లో ఎల్-1గా నిలిచేది ఎవరు అనే అంశం ఆసక్తికరంగా మారింది. ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ పిలిచిన విజయవాడ మెట్రోరైల్ టెండర్లలో తుదిగడువు నాటికి రెండు బిడ్లు పడ్డాయి. ఎల్అండ్‌టీ-రిత్విక్ జాయింట్ వెంచర్‌గా ఒక టెండర్, మెగా-ఎన్‌సీసీ జాయింట్ వెంచర్‌గా రెండో బిడ్ పడింది. ఈ రెండు బిడ్లను ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. ఈ రెండు జాయింట్ వెంచర్లకు సంబంధించిన ఫైనాన్షియల్ బిడ్లను రెండు రోజుల్లో తెరిచే అవకాశం ఉంది. ఫైనాన్షియల్ బిడ్లను తెరిస్తే కానీ ఎల్-1గా ఏ సంస్థ నిలుస్తుందో తెలుస్తుంది. మెట్రో ప్రాజెక్టుల నిర్మాణంలో బిడ్లను సమర్పించిన సంస్థల్లో ఒక్క ఎల్అండ్‌టీకే అనుభవం ఉంది. హైదరాబాద్ మెట్రోను ఎల్అండ్‌టీ సంస్థ నిర్మించిన సంగతి తెలిసిందే. ఇది బీజేపీ నేత సీఎం రమేశ్‌కు చెందిన సంస్థ.

జాయింట్ బిడ్లు ఎందుకు?

విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టు మొదటి దశలో గన్నవరం నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా రామవరప్పాడు రింగ్, ఏలూరు మిగతా 6లో..

సమష్టిగా సమరం

స్థానిక ఎన్నికలే టార్గెట్‌గా కూటమి నేతల సమావేశం

- బలాబలాల ఆధారంగా పోటీ చేద్దామని నిర్ణయం
- నియోజకవర్గాల అపరిష్కృత అంశాలపై దృష్టి
- గ్రేటర్ విజయవాడపై సుదీర్ఘ సమయం చర్చ
- సీఎం సానుకూలంగా ఉన్నారన్న ఎంపీ కేశినేని చిన్ని
- వైసీపీ విమర్శలకు ధీటైన సమాధానం ఇవ్వాలని పిలుపు
- హాజరైన ఎమ్మెల్యేలు, మూడు పార్టీల జిల్లా అధ్యక్షులు
- కలిసికట్టుగా చంద్రబాబును కలవాలని నిర్ణయం
- ఇకపై ప్రతినెలా కూటమి నాయకుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న కూటమి ప్రజాప్రతినిధులు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు

స్థానిక సమరంలో సమష్టి వ్యూహానికి కూటమి నేతలు శ్రీకారం చుట్టారు. బలాబలాల ఆధారంగా పోటీచేయాలని నిర్ణయించారు. ఈలోపే నియోజకవర్గాల పరిధిలో సమస్యలు పరిష్కరించాలని, నిధులు రాబట్టాలని, సరికొత్త అభివృద్ధి చేసి చూపించాలని ప్రణాళిక వేసుకున్నారు. నోరుపారేసుకునే వైసీపీ నేతలకు ధీటైన సమాధానం చెప్పాలని, వారు చేసిన తప్పులను ప్రజలకు చూపించాలని నిర్ణయించడంతో పాటు కూటమి నేతలంతా కలిసికట్టుగా అడుగులు వేయాలని నగరంలో శనివారం జరిగిన సమావేశంలో నిర్ణయించారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కూటమి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల అంతరంగిక సమావేశం శనివారం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. టీడీపీ నుంచి ఎన్టీఆర్, కృష్ణాజిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురాం, కొనకళ్ల నారాయణరావుతో పాటు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, బొండా ఉమామహేశ్వరరావు, వసంత కృష్ణప్రసాద్, శ్రీరాం తాతయ్య, కాగిత కృష్ణప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, వర్ల కుమార్‌రాజా, బోడె ప్రసాద్ పాల్గొన్నారు. జనసేన తరఫున ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, బీజేపీ తరఫున ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ విచ్చేశారు. చంద్రబాబుతో మాట్లాడాకే తాను సమావేశానికి వస్తానని కొలికపూడి సమాచారం పంపారు. స్థానిక సంస్థలే ప్రధాన అజెండాగా చర్చ సాగింది. స్థానిక సంస్థల ఎన్నికలు తరుముకొస్తున్న నేపథ్యంలో, కూటమి నేతలు, ప్రజాప్రతినిధులంతా మిగతా 6లో..

జిల్లాల విభజన.. మార్పులు, చేర్పులపై..

ఉమ్మడి జిల్లాను రెండుగా విభజించిన నేపథ్యంలో ఎదురవుతున్న చిక్కుముడులపైనా చర్చ జరిగింది. గన్నవరం, పెనమలూరును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని, కైకలూరు, ముదినేపల్లిని కృష్ణాజిల్లాలో కలపాలని ఎమ్మెల్యేలు కోరారు. జిల్లా పేరు మార్పు విషయంలో చర్చ జరగ్గా, భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. చర్చించుకున్న అన్ని అంశాలను సీఎం చంద్రబాబు వద్ద ప్రస్తావించాలని అందరూ నిర్ణయించారు. అభివృద్ధి పనులకు, ప్రాజెక్టులకు నిధులు రాబట్టే అంశాలపైనా మాట్లాడాలని ప్రతిపాదించారు. ఇకపై ప్రతినెలా కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు సమావేశం కావాలని నిర్ణయించారు.



ఇంజన్ నుంచి పొగలు రావడంతో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

ఆర్టీసీ బస్సులో పొగలు

భయాందోళనలో ప్రయాణికులు

- భయంతో దూకేసిన కొందరు
- బాయినెట్ నుంచి వచ్చిన పొగలు
- విజయవాడ-కోదాడ మెట్రో బస్సులో ఘటన
- వేరొక బస్సులో ప్రయాణికుల తరలింపు

నందిగామ/బస్‌స్టేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరం నుంచి కోదాడకు వెళ్తున్న ఆర్టీసీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులో పొగలు రావటంతో ప్రయాణికులు భయాందోళన చెందారు. కొందరు ప్రయాణికులు ఒక్కసారిగా బస్సు నుంచి బయటకు దూకారు. దీంతో డ్రైవర్ బస్సును నిలుపుదల చేశాడు. ఈ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు శనివారం సాయంత్రం విజయవాడ నుంచి కోదాడ బయల్దేరింది. కంచికచర్లకు వచ్చేసరికి ఇంజన్ నుంచి వాసన వచ్చింది. ప్రయాణికులంతా కాలిన వాసన వస్తోందని అరిచారు. అక్కడి నుంచి బస్సు ఐదు మిగతా 6లో..

స్థానిక ట్రాన్స్‌పోర్టర్లకు అండగా ఉంటా
- ఎన్టీటీపీఎస్ వద్ద దీక్షలను విరమింపజేసిన ఎమ్మెల్యే వసంత 6

సురక్షిత ప్రాంతాలకు రావాలి
- కమిషనర్ ధ్యానచంద్ర 6

యువతకు క్రీడా ప్రోత్సాహంలో ప్రభుత్వ నిబద్ధత
- శాప్ చైర్మన్ రవినాయుడు

ఆకాంక్షిత బ్లాకుల అభివృద్ధికి

చర్యలు భేష్

- కేంద్ర ప్రభారీ అధికారి, జాతీయ నీటి మిషన్ డైరెక్టర్ అశోక్‌బాబు
- ఆకాంక్షిత బ్లాకులో ఏ.కొండూరును చేర్చాలి : కలెక్టర్ లక్ష్మీశ సూచన
- జిల్లాలో ముగిసిన కేంద్ర ప్రభారీ అధికారి మూడు రోజుల పర్యటన

6

ఎరువుల దుకాణాల యజమానులకు

రూ.1,03,000 జరిమానా

- జాయింట్ కలెక్టర్ ఇలక్కియా ఉత్తర్వులు

అంతకుమించి

ప్రైవేట్ స్లీపర్ బస్సుల్లో నిబంధనలకు విరుద్ధంగా సరుకు రవాణా

- నగరం నుంచి వెళ్లే ప్రతి బస్సులోనూ లోడింగ్
- పార్శిల్‌లో సరుకు ఏముందో తెలియకుండానే అనుమతి
- మత్తు పదార్థాలు, ఎన్‌డీపీఎల్ లిక్కర్ సైతం
- అదనపు ఆదాయం కోసం యాజమాన్యాల అక్రమాలు
- మామూళ్లతో మిన్నకుండిపోతున్న అధికారులు
- ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న ప్రయాణికులు



నగరంలోని నిలిపి ఉంచిన ప్రైవేట్ బస్సులు

ప్రజా రవాణాకు పర్మిట్ అంటారు.. కానీ, సరుకు రవాణా కానిచ్చేస్తారు.. రవాణా చేసే పార్శిల్‌లో ఎలాంటి సరుకు ఉందో చూడరు.. పార్శిల్ సైజు, బరువును బట్టి నిర్ణయించిన రేటు ఇచ్చారా.. లేదా? అనేది మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. సొమ్ము ఇస్తే చాలు.. ఎలాంటి సరుకైనా, ఎక్కడికైనా చేరవేసేస్తారు. విజయవాడ కేంద్రంగా ప్రైవేట్ ట్రావెల్స్ ఏసీ స్లీపర్ బస్సుల్లో రోజూ జరిగే అక్రమాల తంతు ఇదంతా..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ) : నగరం నుంచి రోజూ వెయ్యికి పైగా ప్రైవేట్ ఏసీ స్లీపర్ బస్సులు ప్రయాణం సాగిస్తాయి. 10 లక్షల జనాభా పైబడిన నగరం నుంచి రోజూ వేలమంది బస్సు, రైలు, విమాన మార్గాల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై, ముంబై, పూణె, నాగ్‌పూర్, తిరుపతి తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రజలు అత్యధికంగా బస్సు ప్రయాణాన్ని ఎంచుకుంటారు. గడిచిన ఐదేళ్లలో ప్రైవేట్ ట్రావెల్స్‌లో ప్రయాణించే వారి సంఖ్య విపరీతంగా పెరిగింది. దీన్ని గమనించిన బస్సు యజమానులు గతంలో సీటింగ్‌తో మిగతా 6లో..

బెంజిసర్కిల్ వద్ద శనివారం రాత్రి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు



తనిఖీల భయంతో ఎక్కడివక్కడే..!

అర్ధంతరంగా నిలిచిపోయిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు

- లబోదిబోమంటున్న ప్రయాణికులు
- ఆర్టీఏ తనిఖీల వ్యవహారం లీకవడంతో నిలిచిన 80 శాతం బస్సులు
- మొక్కుబడిగానే సాగిన తనిఖీలు

6



పుట్టలో పాలుపోసి పూజలు చేస్తున్న ఈవో శీనానాయక్ దంపతులు, చైర్మన్ రాధాకృష్ణ దంపతులు, మహిళలు

ఇంద్రకీలాద్రిపై నాగులచవితి వేడుకలు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ గుడి ఉపాలయమైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని పుట్ట వద్ద నాగుల చవితి వేడుకలు శనివారం భక్తి ప్రపత్తులతో జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో నాగపుట్టలో పాలు పోసి, విశేషపూజలు చేశారు. సర్పాన్ని పూజించడం వల్ల సర్పదోషాలు తొలగిపోతాయని, సుఖసంతోషాలతో జీవిస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. సంప్రదాయం ప్రకారం ఈవో శీనానాయక్ దంపతులు, చైర్మన్ బొర్రా గాంధీ దంపతులు నాగపుట్టలో పాలు పోసి స్థానాచార్యుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఎరువుల దుకాణాల యజమానులకు
రూ.1,03,000 జరిమానా

● జాయింట్ కలెక్టర్ ఇలక్కియా ఉత్తర్వులు

కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా శనివారం పౌరసరఫరాలశాఖకు సంబంధించిన 6ఏ కేసులపై కలెక్టర్ కార్యాలయంలో కోర్టు నిర్వహించారు. కేసులు నమోదైన వ్యక్తులను, కేసులు నమోదు చేసిన అధికారులను విచారించి ఎరువుల నిల్వల విషయంలో అవకతవకలకు పాల్పడిన ఎరువుల దుకాణ యజమానులకు రూ.1,03,000 జరిమానా విధించారు. 35.60 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ప్రభుత్వపరం చేసేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసేందుకు ఉపయోగించిన వాహన యజమానికి రూ.25 వేలు జరిమానా విధించారు.



బీఆర్‌టీఎస్ రోడ్డులో విజిలెన్స్ అవగాహన ర్యాలీ

అవినీతి రహిత భారత్ నిర్మాణానికి కృషి

● యూనియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ భాస్కరరావు

సత్యనారాయణపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత భారత నిర్మాణానికి అందరూ కృషి చేయాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ సివిన్ భాస్కరరావు అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ రీజన్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవం సందర్భంగా బీఆర్‌టీఎస్ రోడ్డులో జారూకత-మనందరి సమష్టి బాధ్యత అనే అంశంపైన శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. నిష్పక్షపాతత్వం, విజిలెన్స్ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతని అన్నారు. అనంతరం అవినీతి నిర్మూలన, నైతిక విలువల ప్రాధాన్యతను తెలియచేస్తూ ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్, డిప్యూటీ జోనల్ హెడ్ ఎం రామారావు, ఎంవీఎస్ రవిశంకర్, జోనల్ విజిలెన్స్ ఆఫీసర్ గోపాలకృష్ణ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



కోచ్‌లతో శాప్ చైర్మన్ రవినాయుడు, ఎండీ భరణీ

యువతకు క్రీడాప్రోత్సాహంలో ప్రభుత్వ నిబద్ధత

● శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యువత అభివృద్ధి, క్రీడా ప్రతిభా ప్రోత్సాహం పట్ల నిబద్ధతతో పనిచేస్తుందని శాప్ చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శాప్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న కోచ్‌ల ఓరియెంటేషన్, కెపాసిటి బిల్డింగ్‌ను ఆయన, శాప్ ఎండీ ఎస్ భరణీతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ 2029 నాటికి రాష్ట్రాన్ని క్రీడా రాజధానిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, అందులో కోచ్‌ల పాత్ర కీలకమైనదన్నారు. శాప్ ఎండీ భరణీ మాట్లాడుతూ శాప్ కోచ్‌లు సాంకేతిక, నైతిక, శాస్త్రీయ పరమైన దృక్పథంతో మరింత అభివృద్ధి చెందుతారన్నారు. శాప్ ఏవో రామావత్ వెంకట రమణ నాయక్, శాప్ ఇండియా రిసోర్స్ నిపుణులు, రాష్ట్రవ్యాప్తంగా 132 మంది కోచ్‌లు, 26 జిల్లాల డీఎస్‌డీవోలు, శాప్ సిబ్బంది పాల్గొన్నారు.

పత్తితీసే సమయంలో జాగ్రత్త: డీఎంఎఫ్

కంచికచర్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలు పడుతున్నందున పత్తితీత సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి డీఎంఎఫ్ విజయకుమారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పత్తిని చిత్తు చేస్తున్న వానలు శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి జిల్లా వ్యవసాయాధికారి స్పందించారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో పత్తి సాధారణ విస్తీర్ణం 36,254 హెక్టార్లకు గాను రైతులు 33,134 హెక్టార్లలో సాగు చేశారన్నారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సాధారణ వర్షపాతం కన్నా కొంత మేర అధిక వర్షపాతం నమోదైనప్పటికీ, మొత్తంగా ఖరీఫ్ సీజన్‌లో సాధారణ వర్షపాతం నమోదైందన్నారు. ఇప్పటికే మొదటితీత తీసిన దాదాపు 40 శాతం మేర విస్తీర్ణంలో ఎకరాకు మూడు నుంచి ఐదు క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చిందన్నారు. 30 శాతం చేలల్లో మొదటితీతలో ఎకరాకు కేవలం ఒకటి నుంచి ఒకటిన్నర క్వింటాళ్ల పత్తి మాత్రమే వచ్చిందన్నారు. పత్తి తీతల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. మధ్యవర్తులకు తక్కువ ధరలకు పత్తి విక్రయించవద్దని, వ్యవసాయ మార్కెట్ యార్డులో అమ్ముకోవాలని ఆమె రైతులకు విజ్ఞప్తి చేశారు.

సాగర్ ఆయకట్టు చెరువులకు జలకళ

నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల

విజయవాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముందుచూపుతో నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్‌లోని ఆయకట్టు చెరువులు ముందుగానే సాగర్ వరద జలాలతో నిండి జలకళ సంతరించుకున్నాయని నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్ చిట్టచివరి ప్రాంతమైన వేంపాడు మేజరుకు సాగర్ వరద జలాలు చేరుకున్న నేపథ్యంలో శనివారం ఉదయం బాపులపాడు మండలం, కొత్తపల్లి గ్రామంలో వేంపాడు మేజర్ 39 కి.మీ దగ్గర నుంచి పొట్లకాయకుంట చెరువుకు విడుదలవుతున్న సాగర్ వరద జలాలను మడిచర్ల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దేవినేని సత్యనారాయణ, బిళ్లనపల్లి నీటి సంఘం అధ్యక్షుడు కాకుమాను గోపి, బాపులపాడు మండలం టీడీపీ అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, కొత్తపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడు వల్లూరుపల్లి నానితో కలిసి సాగర్ జలాలకు పూలుజల్లి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆళ్ల గోపాలకృష్ణారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఎన్ఎస్‌పి ఉన్నతాధికారులతో మాట్లాడి కృషిచేయడం వలన నాగార్జునసాగర్ డ్యాం జలాలు ఇక్కడి వరకు చేరుకున్నాయన్నారు.

తనిఖీల భయంతో ఎక్కడివక్కడే..!



బస్సులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

● అర్ధాంతరంగా నిలిచిపోయిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ● లబోదిబోమంటున్న ప్రయాణికులు
● ఆర్టీఏ తనిఖీల వ్యవహారం లీకవడంతో నిలిచిన 80 శాతం బస్సులు ● మొక్కుబడిగా బస్సుల తనిఖీలు

విజయవాడ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు దహనం నేపథ్యంలో నగరవ్యాప్తంగా చేపట్టిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల తనిఖీ మొక్కుబడిగా సాగింది. శనివారం రాత్రి తనిఖీలు చేపడతామని జిల్లా ఆర్టీఏ కార్యాలయం నుంచి ముందస్తుగానే సమాచారం లీకవడంతో నిబంధనలకు విరుద్ధంగా నడిచే బస్సులు నిలిచిపోయాయి. ప్రభుత్వ ఆదేశాలతో మూడు బృందాలుగా ఏర్పడి జిల్లా రవాణా శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీలు తూతూమంత్రంగానే సాగాయి. నగరం నుంచి రోజూ కొన్ని వందల బస్సులు హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, విశాఖపట్నం, నాగ్‌పూర్, ముంబై, తిరుపతి ప్రాంతాలకు వెళ్తుంటాయి. అలాగే నగరం మీదుగా కొన్ని వందల బస్సులు నడుస్తుంటాయి. విజయవాడలో అధికారుల తనిఖీల సమాచారం ముందుగానే బస్సు యజమానులకు తెలియడంతో బస్సులను నిలిపివేశారు. దాదాపు 80 శాతం బస్సులు నిలిచిపోయాయి. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన టికెట్లను దర్దు చేశారు. కొన్ని ఆన్‌లైన్ పోర్టల్స్‌ను నిలిపివేశారు. దీంతో ప్రతి రోజూ రాత్రి 8 నుంచి రాత్రి 11 గంటల వరకు ట్రావెల్స్ బస్సులతో కిటకిటలాడే రామవరప్పాడు రింగ్, బెంజిసర్కిల్, వారధి, హనుమాన్‌పేట, ఆర్టీసీ వై జంక్షన్ ప్రాంతాలు బోసిపోయాయి. ఆయా రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. అకస్మాత్తుగా బస్సులు రద్దు కావడంతో ప్రయాణికులు లబోదిబోమంటూ ఆర్టీసీ బస్సులను, రైళ్లను ఆశ్రయించారు. జిల్లా డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) మోహన్ పర్యవేక్షణలో అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడిన బస్సులను తనిఖీలు చేశారు. వారధి వద్ద నలుగురు, రామవరప్పాడు నుంచి పొట్టిపాడు టోల్‌గేట్ వరకు ముగ్గురు, హనుమాన్‌పేట వద్ద మగ్గురు కీసర టోల్‌గేట్ వద్ద ముగ్గురు అధికారులు సిబ్బందితో కలిసి బస్సులను తనిఖీలు చేశారు.



బస్సు వద్ద తనిఖీలు చేస్తున్న ఆర్టీఏ అధికారులు

ఆకాంక్షిత బ్లాకుల అభివృద్ధికి చర్యలు భేష్

● కేంద్ర ప్రభారీ అధికారి, జాతీయ నీటి మిషన్ డైరెక్టర్ అశోక్‌బాబు
● ఆకాంక్షిత బ్లాకులో ఏ కొండూరును చేర్చాలి: కలెక్టర్
● జిల్లాలో ముగిసిన కేంద్ర ప్రభారీ అధికారి మూడు రోజుల పర్యటన

కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆకాంక్షత బ్లాకుల కార్యక్రమం (అస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం) అమలవుతున్న పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల అభివృద్ధికి జిల్లా వ్యవస్థ మంచి చర్యలు చేపట్టిందని కేంద్ర ప్రభారీ అధికారి నేలపట్ల అశోక్‌బాబు ప్రశంసించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఆకాంక్షిత బ్లాకుల సమావేశంలో కేంద్ర ప్రభారీ అధికారి నేలపట్ల అశోక్‌బాబు మాట్లాడుతూ జిల్లా వ్యవస్థ చేపట్టిన చర్యలతో పెనుగంచిప్రోలు మండలంలో 25 సూచికల్లో, ఇబ్రహీంపట్నం మండలంలో 18 సూచికల్లో 100 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు చెప్పా రు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఆకాంక్షిత బ్లాకులలో మెరుగైన ఫలితాల సాధనకు స్మార్ట్ వ్యవసాయాన్ని (స్మార్ట్ అగ్రికల్చర్) చేపడుతున్నామన్నారు. ఆకాంక్షిత బ్లాకులలో ఏ కొండూరు మండలాన్ని కూడా చేర్చాలని కోరారు. ఆర్డీవో కే చైతన్య, నందిగామ ఆర్డీవో కే బాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి ఎం లక్ష్మీ నరసింహం, ముఖ్య ప్రణాళికా అధికారి వై శ్రీలత, జెడ్పీ సీఈవో కేకే నాయుడు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోసిబాబు, డీఎంహెచ్‌వో సుహాసిని, డీఆర్‌డీఏ పీడీ నాంచారయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల తహసీల్దార్లు, ఏబీఎఫ్ (ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో స్)లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆకాంక్షిత బ్లాకుల సమావేశంలో పాల్గొన్న ప్రభారీ అధికారి అశోక్‌బాబు, కలెక్టర్ లక్ష్మీశ

లోతట్టు ప్రాంత ప్రజలు
సురక్షిత ప్రాంతాలకు రావాలి

● కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని, అధికారులు మొంథా తుఫాన్ సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం రెవెన్యూ, వీఎంసీ శాఖాధిపతులు, సిబ్బందితో ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వెలగలేరు, ప్రకాశం బ్యారేజ్ వద్ద ఎమినిటీ సెక్రటరీలను విధుల్లో ఉంచి, ప్రతి గంటకి బుడమేరు, కృష్ణానది నీటి మట్టం నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల కోసం 247 కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. పునరావాస కేంద్రాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని, కొండ, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ప్రతి సచివాలయం ఎమినిటీ, శానిటరీ, ప్లానింగ్ సెక్రటరీలు సంయుక్త పరిశీలన చేసి ప్రమాదభరితంగా ఉన్న హోర్డింగులు, ఫ్లెక్సీలు తొలగించాలన్నారు. రాపిడ్ రేపోన్స్ టీంను ఏర్పాటు చేసుకోవాలని, సమస్య వస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదకరమైన వృక్షాలను పరిశీలించి, నివేదికను సమర్పించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో కే చైతన్య, నగర పరిధిలోని తహసీల్దార్లు, వీఎంసీ శాఖాధిపతులు పాల్గొన్నారు.



దీక్షదారులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను శాశ్వతంగా విరమింజేస్తున్న మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్

స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌కు అండగా ఉంటా

● నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేసిన ఎమ్మెల్యే వసంత

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌కు ఎల్లప్పుడు అండగా ఉంటామని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. 37 రోజులుగా ఉచిత బూడిద లోడింగ్ చేయాలని, టెండర్ రద్దు చేయాలని స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్ ఎన్టీటీపీఎస్ గేటు సమీపంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలను శనివారం ఆయన విరమింపజేశారు. దీక్షాదారులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను ముగించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధానపరమైన నిర్ణయంలో భాగంగా ఎన్టీటీపీఎస్ బూడిదను అన్ని చోట్ల కేంద్రం ప్రభుత్వం అమ్మకం పెట్టిందని అందులో భాగంగా కాంట్రాక్టు సంస్థకు ఇచ్చిన టెండర్‌ను రద్దు చేయడం కుదరదన్నారు. స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌కు వారానికి 3 లారీలు ఉచితంగా బూడిద లోడింగ్ చేసేలా కాంట్రాక్టు సంస్థలో ఒప్పందం చేయించామన్నారు. మంత్రి గొట్టిపాటి రవి దృష్టికి వీరి ఇబ్బందులు తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. చెన్నుబోయిన చిట్టిబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు పెదర్ల రవి, చనమోలు నారాయణ, సొసైటీ అధ్యక్షుడు కోయ వెంకట్రావ్, మైలా సైదులు, అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ) పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో పొగలు

(5వ పేజీ తరువాయి)

కిలోమీటర్లు ప్రయాణించాక బాయ్‌నెట్ నుంచి పొగలు రావటం ప్రారంభమయ్యాయి. పొగలు చూసిన ప్రయాణికులు కొందరు బస్సులో నుంచి దూకేశారు. అయితే వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ఆ సమయంలో బస్సులో 18 మంది ప్రయాణికులు ఉన్నారు. రేడియేటర్‌లోని నీరు బాగా కాలిపోయి ఇంజన్ ఆయిల్ నిల్వ ఉండే బాక్స్ పై క్యాప్ కరిగిపోయింది. బస్సు రన్నింగ్‌లో ఉండటంతో కుదుపులకు ఇంజన్ ఆయిల్ కాస్తా ఇంజన్ మీదకు చిమ్మింది. దీనివల్ల పొగలు వచ్చాయని తేల్చారు. ఈ పొగలు బాయినెట్ లోపల నుంచి బస్సులోకి వచ్చాయి. కర్నూలు బస్సు దుర్ఘటన నేపథ్యంలో ఒక్కసారిగా అందరూ ఆందోళన చెందారు. అనంతరం తాత్కాలికంగా క్యాప్ ఏర్పాటుచేసి కోదాడ వెళ్లేందుకు ప్రయత్నించినా ప్రయాణికులు ఒప్పుకోలేదు. ఈ విషయాన్ని డ్రైవర్ రమేశ్ డిపో కంట్రోలర్ రామకృష్ణ దృష్టికి తీసుకొచ్చారు. మరో బస్సులో ప్రయాణికులను పంపించి, బస్సును గవర్నర్‌పేట-2 డిపోకు తీసుకొచ్చారు.

ఉత్తమంగా ఆర్పీఎఫ్ పనితీరు

రైల్వేస్టేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) ఈనెల 16-23 మధ్య నిర్వహించిన అనేక ప్రశంసనీయమైన కార్యకలాపాలను నిర్వహించి మంచి పనితీరు కనబరిచింది. ప్రయాణికుల భద్రత, నేరాల నివారణ, ప్రజా సేవ పట్ల తన నిబద్ధతను చాటుకుంది. ఆయా వివరాలను విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం మండ్రూపకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న రూ.4.8లక్షల విలువైన 48వేల విదేశీ బ్రాండ్ల సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు జిల్లా నుంచి ఓజీ కుప్పం అటెన్షన్ డైవర్షన్ గ్యాంగ్‌కు చెందిన నలుగురు సభ్యులను ఈనెల 18న తెనాలిలో అరెస్టు చేసి దొంగిలించబడిన రూ.6.6 లక్షల విలువైన 50 గ్రాముల బంగారు ఆభరణాలు, 8 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈనెల 16న మైలవరానికి చెందిన రావూరి నాగరాజు (25)ను 12 గంటల్లోనే పట్టుకుని దొంగిలించబడిన సొత్తును స్వాధీనం చేసుకున్నాయి. ఈనెల 18న రైళ్లలో రెండు మొబైల్ దొంగతనాలను త్వరగా గుర్తించి పల్నాడు జిల్లాకు చెందిన అచ్చి దుర్గారావు (46)ను కావలి స్టేషన్‌లో అరెస్టు చేశారు. ఈనెల 22న కానిస్టేబుల్ పీ వెంకటమ్మ తుని స్టేషన్‌లో ఒంటరిగా తిరుగుతున్న 9 ఏళ్ల బాలుడు లావాడియా ఆదిల్ నాయక్‌ను రక్షించారు. ఈనెల 23న గుడివాడలో దోపిడీ కేసులో వాంటెడ్ అయిన గొరిపర్తి శివ కోటేశ్వరరావు (37)ను అరెస్టు చేశారు. ఈనెల 21న బాపట్ల స్టేషన్‌లో కానిస్టేబుల్ కే వెంకటేష్ 16 ఏళ్ల బాలుడు అంపిల్లి గోపిచంద్ ప్లాట్‌ఫామ్ నెం.3 పై అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో విచారించి బాపట్ల జిల్లా సమన్వయకర్త కిషోర్‌కు సురక్షితంగా అప్పగించారు. ఈనెల 24న నెల్లూరులో మోనికా ఎవెబ్రిగిట్టా బంగారు ఆభరణాలున్న ట్రాలీ బ్యాగ్‌ను మర్చిపోయింది. ఏఎస్ఐ పీ రమేష్, కానిస్టేబుల్ పీవీ దివాకర్ రెడ్డి రైలుకు చేరుకున్న వెంటనే విధుల్లో ఉన్న టీటీఈ సమక్షంలో బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని తగిన గుర్తింపుతో ఫిర్యాదుదారు బంధువు సీతారామాంజనేయులుకు అప్పగించారు.

హాల్‌టికెట్స్ విడుదల

విజయవాడ: డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ మే 15న సిస్టం అడ్మినిస్ట్రేటర్, కంప్యూటర్ ఆపరేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్‌కు హాల్ టికెట్స్ వర్సిటీ వెబ్‌సైట్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని రిజిస్ట్రార్ డాక్టర్ వీ రాధికారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో అప్లైచేసిన అభ్యర్థులు https://drntr.uhsap.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

అంతకుమించి

(5వ పేజీ తరువాయి)

ఉన్న బస్సులను ఏసీ స్లీపర్ కోచ్‌లుగా తయారు చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా సరుకు రవాణా

కేవలం ప్రజల రాకపోకల కోసమే ఏసీ స్లీపర్ బస్సులకు అనుమతి ఉంటుంది. అయితే ప్రజా రవాణా ద్వారా వచ్చే నగదుతో పాటు అక్రమార్జన కోసం యజమానులు సరుకు రవాణా కానిచ్చేస్తున్నారు. దీనికోసం బస్సు అడుగు భాగంలో ముందు నుంచి వెనుక వరకు ఓ క్యాబిన్ నిర్మాణం ఉంటుంది. క్యాబిన్‌లోకి సరుకు నింపేందుకు ప్రత్యేకంగా డోర్లను అమరుస్తున్నారు. బయట నుంచి చూస్తే క్యాబిన్, డోర్లు ఉన్నట్టు కనిపించకుండా ఈ నిర్మాణం ఉంటుంది. దాదాపు రెండు టన్నుల సరుకు పట్టేంతగా ఈ క్యాబిన్ ఉంటుంది. దీంతో పాటు బస్సు పైభాగాన్ని సరుకుతో నింపేస్తున్నారు. నగరంలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్ రోడ్డులో, పాత ప్రభుత్వాసుపత్రి రోడ్డులో రోజూ బహిరంగంగానే ఈ అనధికార లోడింగ్ జరుగుతూ ఉంటుంది.

నిషేధిత సరుకు సైతం రవాణా

ధనార్జనే ధ్యేయంగా బస్సు యజమానులు, అక్రమార్జనే ధ్యేయంగా రవాణా శాఖ అధికారుల నిర్వాకం కారణంగా ఈ బస్సుల్లో నిషేధిత సరుకు సైతం యథేచ్ఛగా రవాణా అవుతుంది. కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్) ఈ బస్సుల ద్వారా రాష్ట్రంలోకి భారీగా చేరుతోంది. వీటితో పాటు పలు మత్తు పదార్థాలు సైతం ఈ బస్సుల్లో నిర్భయంగా రవాణా చేసేస్తున్నారు. చదరపు అడుగు పరిమాణంతో సుమారు 20 కేజీల బరువు ఉండే ఓ పార్శిల్ విజయవాడ నుంచి హైదరాబాద్ తీసుకెళ్లేందుకు రూ.వెయ్యికి పైగా వసూలు చేస్తున్నారు. ఆ పార్శిల్‌లో ఎలాంటి సరుకు ఉందో తెలుసుకునే ప్రయత్నం మాత్రం చేయట్లేదు.

ఎల్-1 ఎవరు?

(5వ పేజీ తరువాయి)

రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్, బస్టాండ్ వరకు మొదటి కారిడార్, పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు రెండో కారిడార్‌ను 38 కిలోమీటర్ల మేర రూ.11,498 కోట్లతో నిర్మించాల్సి ఉంది. ఇందులో సివిల్ నిర్మాణాలైన వయాడక్ట్ పనుల కోసం రూ.4,500 కోట్లతో ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ అధికారులు టెండర్లు పిలిచారు. రెండు కారిడార్లకు సంబంధించి కూడా ఒకే టెండర్‌గా పిలిచారు. బిట్ ప్యాకేజీలుగా టెండర్లు పిలిచి ఉంటే అనేక కాంట్రాక్టు సంస్థలు పాలు పంచుకునే అవకాశం ఉండేది. సింగిల్ టెండర్లుగా పిలవటం వల్ల భారీ కాంట్రాక్టు సంస్థలు, ఈ రంగంలో అనుభవం ఉన్న సంస్థలు పాలుపంచుకునే అవకాశం ఏర్పడింది. రూ.4,500 కోట్ల వ్యయం కాబట్టి జాయింట్ వెంచర్‌గా అవకాశం కల్పించాలని ఇంతకుముందు నిర్వహించిన ప్రీబిడ్ మీటింగ్‌లో కాంట్రాక్టు సంస్థలు అభ్యర్థించాయి. ఆ అభ్యర్థనను దృష్టిలో ఉంచుకుని ఏపీఎంఆర్‌సీ అధికారులు సానుకూలంగా స్పందించటంతో 4 పెద్ద కాంట్రాక్టు సంస్థలు కన్సార్టియంగా ఏర్పడి రెండు బిడ్లను వేశాయి.

రాచమార్గానికి రయ్యిరయ్యిన..

(5వ పేజీ తరువాయి)

ఏడీసీఎల్ శనివారం ఫేజ్-3 పనులకు టెండర్లు పిలిచింది. ఈ పనుల్లో భాగంగా ఆరు వరుసల ఎలివేటెడ్ కారిడార్‌కు టెండర్లు పిలిచింది. ఉండవల్లి పంపింగ్ స్టేషన్ నుంచి మణిపాల్ హాస్పిటల్ పక్కగా ఎన్‌హెచ్-16కు ఇది అనుసంధానమవుతుంది. మొత్తం నాలుగు కిలోమీటర్ల స్ట్రెచ్ ఉంటుంది. ఆరు వరసల పై ఓవర్‌తో పాటు అండర్‌పాస్‌లు కూడా ఉంటాయి. ఈ సీడ్ యాక్సెస్ రోడ్డు ఫేజ్-1లో అనంతవరం నుంచి వెంకటపాలెం వరకు నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. వెంకటపాలెం నుంచి ఉండవల్లి పంపింగ్ హౌస్ వరకు ఫేజ్-2 పనులు 6 కిలోమీటర్ల మేర ప్రస్తుతం జరుగుతున్నాయి. కొన్ని భూ ఇబ్బందులు ఉన్నప్పటికీ పనులు చేపడుతున్నారు. ఫేజ్-3లో మాత్రం కొన్నిచోట్ల ఇళ్లను తొలగించాల్సి ఉంటుంది. భూ సేకరణకు వెళ్లే అవకాశం కూడా ఉంది. ఫేజ్-3లో నాలుగు కిలోమీటర్ల మేర ఆరు వరుసల ఎలివేటెడ్ కారిడార్‌ను ప్రతిపాదించటానికి ముఖ్యమైన కారణాలు ఉన్నాయి. మూడు పెద్ద కాల్వలు, విజయవాడ మెయిన్ రైల్వేలైన్, కొండప్రాంతాలు ఉండటం వల్ల ఈ మార్గాన్ని ఎలివేటెడ్ కారిడార్‌గా నిర్మించాలని నిర్ణయించారు. రెండేళ్లలో దీని నిర్మాణ పనులు పూర్తవుతాయి.

మొంథా ముప్పు

(5వ పేజీ తరువాయి)

కంట్రోల్ రూమ్‌లు సేవలందించాలని సూచించారు. రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, వైద్య ఆరోగ్యం, అగ్నిమాపక, పౌరసరఫరాలు, మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆయన స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టిసారించి, అవసరం మేరకు పునరావాస శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. విజయవాడ అర్బన్ పరిధిలోని, కొండ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని, గర్భిణులు, వృద్ధులకు పరిస్థితిని బట్టి ముందే పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం కల్పించాలని సూచించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదమున్న ప్రాంతాల్లోని ప్రజలను ముందు జాగ్రత్తగా పునరావాస కేంద్రాల్లో ఉంచి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఇందుకు వైద్య ఆరోగ్య శాఖ, వీఎంసీ అధికారులు సమష్టిగా కృషిచేయాలన్నారు. చెరువులను కూడా పరిశీలించాలని, గండ్లు పడే ప్రమాదముంటే పటిష్ఠ రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అవాంతరాలు ఎదురైనా, స్తంభాలు పడిపోయినా యుద్ధప్రాతిపదికన పరిస్థితిని చక్కదిద్దేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసే వర్షాలతో కృష్ణానదితో పాటు వాగులు, వంకలకు వరద నీరు పోటెత్తే అవకాశమున్నందున నదికి వెళ్లే మార్గాలు, వాగులు, వంకల వద్ద వరద హెచ్చరికల బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, వాటిని ఎవరూ తొలగించకుండా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

సమష్టిగా సమరం

(5వ పేజీ తరువాయి)

కలిసికట్టుగా ఉండాల్సిన అంశాలు, వ్యూహాలపై చర్చించుకున్నారు. సమన్వయంతో బరిలోకి దిగుదామని నిర్ణయించారు. షెడ్యూల్ విడుదలయ్యే నాటికే ఎవరెక్కడ పోటీ చేయాలన్న దానిపై నిర్ణయాలు తీసుకోవాలనుకున్నారు. నియోజకవర్గాలవారీగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, అభివృద్ధి పనులు పూర్తిచేసే అంశాలపైనా చర్చించారు. నియోజకవర్గాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేలంతా ఏకరువు పెట్టారు. నియోజకవర్గాల్లోని పనులు, వాటికి కావాల్సిన నిధులకు సంబంధించి తగిన ప్రతిపాదనలు రూపొందించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని వారు నిర్ణయించుకున్నారు.

గ్రేటర్ విజయవాడకు సై

గ్రేటర్ విజయవాడ అంశంపై ఆసక్తికర చర్చ నడిచింది. నగరాన్ని గ్రేటర్ చేస్తామని గతంలో అధికారంలో ఉన్న పలు సందర్భాల్లో హామీ ఇచ్చామని, ఇప్పుడు అవకాశం ఉంది కాబట్టి గ్రేటర్ హోదా కల్పించాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని అందరూ నిర్ణయించారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ గ్రేటర్ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని, ఆయన సుముఖంగా ఉన్నారని చెప్పారు. అందరం కలిసి ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి ఈ అంశాన్ని ప్రస్తావిద్దామని సూచించారు.

పేర్ని, జోగి వ్యాఖ్యలకు ధీటుగా స్పందిద్దాం..

వైసీపీ నేతలు పేర్ని నాని, జోగి రమేశ్, ఇతర నేతలు రెచ్చిపోతున్నారని, వారికి తగిన విధంగా సమాధానం చెప్పాలని సమావేశంలో నిర్ణయించారు. వైసీపీ నాయకులు ఎవరిని తిట్టినా, ఆరోపించినా కూటమి నాయకులు సంయుక్తంగా స్పందించాలని సూచించారు. బందరులో పేర్ని నాని స్పీడు పెంచాడని, మంత్రి కొల్లు రవీంద్ర ఇంకా తగిన కౌంటర్లు ఇవ్వాలని ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ప్రాజెక్టులపైనా చర్చ

ఉమ్మడి కృష్ణాజిల్లాలో చేపట్టాల్సిన పలు ప్రాజెక్టులపైనా సమావేశంలో చర్చించారు. చోడవరం దగ్గర చెక్‌డ్యామ్‌ను కట్టాలన్న అభిప్రాయాన్ని గన్నవరం, పెనమలూరు ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్ తెలియజేశారు. బుడమేరుకు శాశ్వత పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. సాగునీటి సమస్యలను పరిష్కరించాలని పెడన ఎమ్మెల్యే కాగిత సూచించారు. పార్టీ పదవుల నియామకాలకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యేల అభిప్రాయాలను ప్రాధాన్యతగా తీసుకోవాలనే అంశాన్ని యార్లగడ్డ ప్రస్తావించారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140,149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

టీడీపీ నాయకుడు ఫిరోజ్‌కు గద్దె క్రాంతి పరామర్శ

లబ్బీపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న టీడీపీ నాయకుడు ఫిరోజ్‌ను ఆ పార్టీ యువనాయకుడు గద్దె క్రాంతి కుమార్ పరామర్శించారు. లబ్బీపేటలో ఉండే టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మైనార్టీ నాయకుడు ఎస్.ఫిరోజ్‌కు శనివారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు సమీపంలోని వైవీ రావు హాస్పటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఫిరోజ్‌ను గద్దె క్రాంతి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన తర్వగా కోలుకోవాలని అకాంక్షించారు.

అవుట్‌ఫాల్ డ్రెయిన్ త్వరితగతిన పూర్తి చేయాలి

● నగర కమిషనర్ ధ్యానచంద్ర



బెంజిసర్కిల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బెంజిసర్కిల్ సర్వీస్ రోడ్డులో వర్షపు నీటి నిల్వలు లేకుండా శాశ్వత పరిష్కారం దిశగా నిర్మిస్తున్న అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శనివారం పటమటలంక, బెంజిసర్కిల్ సర్వీస్ రోడ్డు, రాణిగారితోట పరిసర ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుట్ ఫాల్ నిర్మాణమైతే వర్షపునీటిని బందరు కాలువకు మళ్లించవచ్చన్నారు. ఈ నిర్మాణం పూర్తయ్యే వరకు మాన్సూన్ రెస్పాన్స్ టీం అప్రమత్తంగా ఉంటూ వర్షపునీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. అనంతరం రాణిగారితోట వద్ద ఉన్న అన్నక్యాంటీన్‌ను పరిశీలించారు. జోనల్ కమిషనర్ కె.షమ్మీ, ఈఈ ఈ సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నపూర్ణా దేవి అలంకారంలో భ్రమరాంబ అమ్మవారు

వన్‌టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా పాతశివాలయంలో జరుగుతున్న కార్తీకమాస నక్తదీక్ష మహోత్సవాలలో భాగంగా నాల్గో రోజు శనివారం భ్రమరాంబ అమ్మవారు అన్నపూర్ణా దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ఈవో నటరాజన్ షణ్ముగం పర్య వేక్షణలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. మల్లేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన నిర్వహించారు. ● ప్రకాశం బ్యారేజీ సమీపంలో ఉన్న శ్రీగంగాపార్వతీ సమేత విజయేశ్వరస్వామి దేవస్థానంలో ఈవో కె.వెంకటరెడ్డి పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు బి.సూర్య కుమార్ శర్మ, అర్చకులు స్వామికి అభిషేకాలు చేశారు.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి: బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నగరంలోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో నవంబరు 7న జరగనున్న మెగా జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు సూచించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో బొండా ఉమా మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఘంటా కృష్ణ మోహన్, అదనపు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి బి. కిరణ్, బెజ్జం జైపాల్, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.



ఏపీఐఐసీ కాలనీలోని రేగుల అనురాధ స్కూల్లో మెయిన్ గేటు పక్క గుబురుగా పెరిగిన పచ్చగడ్డి, బురదగా మారిన గ్రౌండ్, పటమట కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిలిచిన వర్షపు నీరు

పచ్చగడ్డి, బురదతో పాఠశాలలు

రేగుల అనురాధ కార్పొరేషన్ పాఠశాల, కేబీసీ జడ్పీ విద్యార్థుల అవస్థలు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: పాఠశాలలోని అపరిశుభ్ర పరిసరాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ఏపీఐఐసీ కాలనీలోని రేగుల అనురాధ నగరపాలకసంస్థ పాఠశాల, పటమటలోని కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లు వర్షపునీటి వలన బురదగా మారాయి. రేగుల అనురాధ నగరపాలకసంస్థ పాఠశాల స్కూల్ ప్రాంగణంలో పచ్చగడ్డి, ముళ్ళపొదలు పెరిగిపోయాయి. ఆ సమయంలో విద్యార్థులు స్కూల్‌కు రావడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులను స్కూల్‌కు పంపిస్తే ఎక్కడ బురదలో జారి పడిపోతారోనని, ముళ్లపొదల్లో విషసర్పాలు వంటివి ఉండే అవకాశం ఉందని తల్లిదండ్రులు భయపడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు.

మధురానుభూతిని మిగిల్చిన రంజని, గాయత్రి గాత్రం



రంజని, గాయత్రి గాత్రం

విజయవాడ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవ సంవత్సర విశిష్ట కార్యక్రమంగా శనివారం సిద్ధార్థ ఆడిటోరియంలో సుప్రసిద్ధ కర్ణాటక సంగీత విద్వాంసులు, సంగీత కళాశిరోమణి పురస్కార గ్రహీతలు రంజని, గాయత్రి శాస్త్రీయ గాత్రకచేరి ఆద్యంతం సంగీతాభిమానులకు మధురానుభూతి మిగిల్చింది. ముత్తుస్వామి దీక్షితార్ విరచిత మహా మహాగణపతిం అంటూ ప్రార్థనా కృతితో నాటరాగంలో ఏక తాళంలో కచేరీ భక్తిపారవశ్యంతో ప్రారంభించారు. అజ్ఞానం వీడేందుకు జ్ఞానమొసగమంటూ త్యాగరాజస్వామి తన ఆరాధ్యదైవానికి మొరపెట్టుకొంటూ ఆర్తితో రాసిన యోగ మొసగ రాదా కృతిని అంతే ఆర్ద్రతతో పూర్తికల్యాణి రాగం, రూపక తాళంలో సోదరీ ద్వయం ఆలపించారు. ఏమయ్యా రామ అంటూ భద్రాచల రామదాసు కీర్తనను కంబోజి రాగంలో ఖండచాపు తాళంలో శ్రావ్యంగా ఆలాపన చేశారు. వరము లొసగి పోవయ్యా సాకేతపురవాసా రామా అంటూ భావయుక్తంగా ఆలపించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. మృదంగంపై మనోజ్ శివ, వయోలిన్‌పై డాక్టర్ నిశాంత్ చంద్రన్, ఘటంపై శ్రీరాం శ్రీకృష్ణ సహకారం అందించారు. ఈ సందర్భంగా గాత్ర సోదరిద్వయాన్ని కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ లలితప్రసాద్, కార్యదర్శి బీవీఎస్ ప్రకాశ్ ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం సందర్భంగా ముమ్మనేని సిద్ధార్థ కళాపీఠం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ సంగీత రసఝరి శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది.

ఎన్ఎస్ఎంలో క్విజ్ పోటీలు

రామలింగేశ్వరనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బ్రదర్ జేమ్స్ మెమోరియల్ ఇంటర్ స్కూల్ క్విజ్ పోటీలు స్థానిక ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్లో శనివారం ఉదయం పాఠశాల మౌంట్‌ఫోర్ట్ ఆడిటోరియంలో ఆసక్తికరంగా జరిగాయి. ఈ పోటీలకు నగరంలో 16 పాఠశాలల నుంచి సుమారు 48 మంది విద్యార్థులు హాజరై వివిధ అంశాలలో పాల్గొనగా ఫైనల్‌కు ఆరు జట్లు మాత్రమే అర్హత సాధించాయి. ఈ పోటీల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, నలంద విద్యానికేతన్, సెయింట్ జోన్స్ హైస్కూల్ (గన్నవరం) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించాయి. ఈ సందర్భంగా బ్రదర్ రాయప్పరెడ్డి విజేతలకు వ్యక్తిగత ట్రోఫీలతో పాటు పాఠశాలలకు ట్రోఫీలు అందించి అభినందించారు. క్విజ్ పోటీలు పాఠశాల క్విజ్ క్లబ్ కో ఆర్డినేటర్ నళి పర్యవేక్షణ జరుపగా, వ్యాఖ్యాతగా పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు జెస్సీ ఫ్లారెన్స్ వ్యవహరించారు. కరెస్పాండెంట్ బ్రదర్ మౌంట్‌ఫోర్ట్, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బాలారెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలతో స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ రాయప్పరెడ్డి, పోటీ పర్యవేక్షకులు

మట్టితో వస్తువుల తయారీపై అవగాహన



మట్టితో వస్తువులను తయారుచేస్తున్న విద్యార్థులు

భారతీనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో కళావిభాగం ఆధ్వర్యంలో శనివారం మట్టిపాత్రల ప్రాముఖ్యతను తెలిపే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కుమ్మరి చక్రం ఉపయోగించి మట్టితో వివిధ వస్తువులను తయారు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్టిజో ఫైన్ ఆర్ట్స్ స్టూడియో ప్రిన్సిపాల్ స్ఫూర్తి శ్రీనివాస్ పాల్గొని, విద్యార్థులకు మట్టి పాత్రల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో కళాత్మక ఆలోచనలను, సహనాన్ని, సృజనాత్మకతను పెంపొందిస్తుందని అన్నారు. కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ జోజిరెడ్డి, విభాగాధిపతులు, కో-ఆర్డినేటర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో, అయ్యప్ప నగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి గుడి వద్ద పుట్టలో పాలు పోస్తున్న భక్తులు, స్వామివారిని దర్శించుకున్న హోంమంత్రి వంగలపూడి అనిత

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

● నాగేంద్రస్వామి పుట్టల వద్ద ప్రత్యేక పూజలు

భారతీనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి సందర్భంగా స్థానికంగా ఉన్న నాగేంద్రస్వామి పుట్టలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని, రామవరప్పాడు సెంటర్‌గ్రీనరీలో ఉన్న పుట్టలలోని నాగేంద్రస్వామికి భక్తులు కుటుంబసమేతంగా తరలివచ్చి పాలు పోసి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ● అయ్యప్ప నగర్ కాలనీలోని శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచి స్వామికి పంచామృత అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, పోలీస్ అధికారులు స్వామిని దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆదివారం నాగపంచమి సందర్భంగా ఉదయం 11గంటల నుంచి కార్తీకమాస అన్నప్రసాద వితరణ జరుగుతుందని, సోమవారం కార్తీక మొదటి సోమవారం సందర్భంగా శ్రీవల్లిసమేత సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు, రాత్రి 8.30కు స్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ధనేకుల వెంకట సత్యనారాయణ, సెక్రటరీ అట్లూరి కిషోర్, ట్రెజరర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు

పాయకాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలో గ్యార్మీ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు హాజరై పూలు, చాదర్లు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పలువురుకి భోజనం అందజేశారు. స్వామి వారిని గుర్రంపై పురవీధుల గుండా మేళ, తాళాలతో ఊరేగించారు. ఎండీ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పేషెంట్‌లు, పేషెంట్‌కు వైద్య సహాయం అందిస్తున్న ఇన్‌చార్జి డాక్టర్ శ్రుతి, సిబ్బంది

యూపీహెచ్‌సీలో సేవలు భేష్

ప్రశంసిస్తున్న 13, 14 డివిజన్‌వాసులు

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: 14వ డివిజన్ అంబేడ్కర్ నగర్‌లో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో డాక్టర్, సిబ్బంది సేవలు తమకు ఎంతగానో ఉపయోగంగా ఉన్నాయని 13, 14 డివిజన్ ప్రజలు అంటున్నారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న వ్యాధులు, ఆరోగ్య భద్రత విషయమై ఇన్‌చార్జి డాక్టర్ శ్రుతి మీడియాతో మాట్లాడుతూ ప్రాథమికంగా బీపీ, షుగర్, థైరాయిడ్, జనరల్ చెకప్‌కు రోజూ 50 మందికి పైగా పేషెంట్‌లు వస్తుంటారని, ప్రస్తుతం వైరల్ ఫీవర్‌తో వచ్చిన వారికి మూడో రోజు రక్త పరీక్షలు చేసి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా తమను సంప్రదిస్తుంటారని, తమ సేవలకు మెచ్చి చుట్టు పక్క డివిజన్ వాసులు వస్తుండడం విశేషమని తెలిపారు. ఆస్పత్రికి రాలేని పేషెంట్‌లకు తమ సిబ్బందిని ఇంటి వద్దకు పంపి సేవలందిస్తున్నామన్నారు. అత్యవసర కేసులు ఏమైనా ఉన్నా అంబులెన్స్‌లో పెద్ద హాస్పిటల్ తరలించడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. వైద్యపరంగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని డాక్టర్ తెలిపారు.

కో ఆప్షన్ సభ్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొండపల్లి మున్సిపాలిటీలో ఇద్దరు కో ఆప్షన్ సభ్యుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.రమ్య కీర్తన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బుద్ధిస్టులు, పార్సీలు అర్హులన్నారు. ఇద్దరు సభ్యుల్లో ఒకటి మహిళకు కేటాయించినట్లు తెలిపారు.

ఈ నెల 29 నుంచి నవంబరు 7 సాయంత్రం 5 గంటలలోపు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. నవంబరు 10న దరఖాస్తులు పరిశీలించి నవంబరు 13 నుంచి 29లోపు కో ఆప్షన్ సభ్యులు నియామకం చేస్తామన్నారు.

ముగిసిన పైథాన్ విత్ ఏఐ సర్టిఫికెట్ కోర్సు

మైలవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఎక్సెల్ ఆర్ సంస్థ సంయుక్తంగా ఐదు రోజులు నిర్వహించిన పైథాన్ విత్ ఏఐ సర్టిఫికెట్ కోర్సు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్లా రవి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.వెంకటాద్రి, ఎక్సెల్ ఆర్ సంస్థ ప్రతినిధులు దుర్గా ప్రసాద్, రిసోర్స్ పర్సన్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర పుటల్లోకి ఫిల్మ్ చాంబర్?

30 ఏళ్ల భవనాల కూల్చివేతకు రంగం సిద్ధం.. భారీ వాణిజ్య భవనం నిర్మాణానికి కసరత్తు

- లీజు ముగియకుండానే ఖాళీ ప్రయత్నం
- ఎలాగైనా అడ్డుకుంటామన్న మెజార్టీ సభ్యులు
- మొత్తం భవనం ఇండస్ట్రీకే వాడాలి: సురేశ్‌బాబు

(సినిమా డెస్క్)

గత మూడు దశాబ్దాలుగా జూబ్లీహిల్స్‌లోని ఫిల్మ్ చాంబర్ భవనం తెలుగు సినీ పరిశ్రమకు ఒక చిరునామాగా మారింది. అక్కడే నిర్మాతల మండలి, నిర్మాతల కోసం నిర్మించిన గదులు, రిక్రియేషన్ క్లబ్ మొదలైనవన్నీ ఉన్నాయి. ఈ ప్రాంతంలో కొందామంటే గజం భూమి దొరకదు. అలాంటిది ఎకరంపైనే విస్తీర్ణంలో ఉన్న ఫిల్మ్ చాంబర్ భవనాలపై కొందరి కన్ను పడింది. అక్కడున్న నిర్మాణాలన్నీ కూల్చేసి, బహుళ అంతస్తుల భవనం కట్టాలని వారు సంకల్పించారు. అయితే, తెలుగు సినీ పరిశ్రమకు వారసత్వంగా వస్తున్న చాంబర్ భవనాలను కూల్చొద్దని మెజారిటీ సభ్యులు కోరుకుంటున్నారు. వీరి విన్నపాలు వినకుండా ఫిల్మ్‌నగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ... ఫిల్మ్ చాంబర్ పాలక మండలిలో తమకు అనుకూలంగా ఉన్న కొందరితో కలిసి ఏకపక్షంగా భవనాలను కూల్చేందుకు రంగం సిద్ధం చేసింది. చాంబర్ పాలకమండలి గడువు ముగిసినా ఎన్నికలు జరపకుండా ఎప్పటికప్పుడు వాయిదా వేయడానికి కారణం కూడా కొత్త పాలకమండలి వస్తే బహుళ అంతస్తుల భవనం ప్రతిపాదనకు ఎక్కడ అడ్డం పడుతుందోనన్న భయంతోనే అని సభ్యులు ఆరోపిస్తున్నారు.

తొలి అడుగులు

మూడు దశాబ్దాల క్రితం తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్‌కు తరలి వస్తున్న సమయంలో సినీ పరిశ్రమలో పని చేసే వారికి ఇళ్ల స్థలాల అవసరాల కోసం ఫిల్మ్‌నగర్ సహకార హౌసింగ్ సొసైటీ ఏర్పడింది. అదే సమయంలో నిర్మాతలు, దర్శకులు, డిస్ట్రిబ్యూటర్స్ ఎగ్జిబిటర్ల వాణిజ్య అవసరాల కోసం భవంతులు అవసరమయ్యాయి. జి.హనుమంతరావు. రమేష్ ప్రసాద్, రామానాయుడు, వి.బి.రాజేంద్రప్రసాద్, డి.వి.ఎస్ రాజు, ఎం.ఎస్.రెడ్డి, సత్యచిత్ర సూర్యనారాయణ మొదలైన సినీ ప్రముఖులు ఉమ్మడిగా చేసిన విజ్ఞప్తి మేరకు హౌసింగ్ సొసైటీ రిక్రియేషన్ కోసం ఉద్దేశించిన భూమిలో కొంత చాంబర్‌కు లీజుకు ఇచ్చింది. ఇందులోనే చాంబర్ కొన్ని భవనాలు నిర్మించింది. నిర్మాణానికి సినీ ప్రముఖులు కూడా కొంత విరాళం ఇచ్చారు. అప్పట్లోనే 1.16 కోట్ల రూపాయల ఖర్చు అయిందని అంచనా. తర్వాత నాలుగేళ్లకు నిర్మాతల మండలికి, మరో 8 మంది నిర్మాతలకు హౌసింగ్ సొసైటీ మరికొంత భూమి ఇచ్చి లీజు ఒప్పందాలు కుదుర్చుకుంది. ప్రముఖ నిర్మాత వి.బి.రాజేంద్రప్రసాద్ కొండ మీద ఉన్న స్థలంలో దేవాలయాన్ని కూడా నిర్మించారు. ఇలా ఈ స్థలమంతా సినిమా ఇండస్ట్రీకి కేంద్ర బిందువుగా మారింది.

లీజు పూర్తయిందని..

ఈ భూమిని 30 సంవత్సరాలకు లీజుకు ఇచ్చారు. ఇది వచ్చే ఏడాది ముగుస్తుంది. నిర్మాతల మండలికి, నిర్మాతలకు ఇచ్చిన లీజులు మాత్రం 2030 దాకా ఉన్నాయి. ఇక్కడ భూముల ధరలు ఆకాశానికి అంటిన నేపథ్యంలో హౌసింగ్ సొసైటీ మొత్తం భూమిని స్వాధీనం చేసుకొని బహుళ అంతస్తుల భవనాన్ని కట్టాలనే ప్రతిపాదన తెచ్చింది. స్థలంలో చాంబర్, నిర్మాతల మండలి కార్యాలయాలు ఉన్నందున వారి అంగీకారం



కోసం ఏడాదిగా చాంబర్‌లో, నిర్మాతల మండలిలలో చర్చలు జరుగుతున్నాయి. అయితే, దీనిపై సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. తెలుగు సినీ పరిశ్రమకు ల్యాండ్‌మార్క్‌గా ఉన్న భవనాలను తీసేయడాన్ని మెజారిటీ సభ్యులువ్యతిరేకించటం మొదలపెట్టారు. చర్చలు కొనసాగుతుండగానే చాంబర్ పాలక వర్గంలో కొందరు హౌజింగ్ సొసైటీతో చేతులు కలిపి కూల్చివేతకు అనుకూలంగా పావులు కదిపారని వార్తలు గుప్పుమన్నాయి. చాంబర్ అద్దెకు ఇచ్చిన షాపులను, బ్యాంకును ఖాళీ చేయించడం అనుమానాలను బలపరిచింది. ఏం జరుగుతుందో తెలుసుకొనే ప్రయత్నం సభ్యులు చేస్తుంటే చాంబర్ పాలక మండలి నుంచి ఎటువంటి స్పందనా రాలేదు. '30 ఏళ్ల కిందట తరలివచ్చిన సినిమా పరిశ్రమకు ఈ భవనం సంకేతం. దీన్ని కూల్చటానికి మేము ఒప్పుకోం. అవసరమైతే కోర్టుకు వెళ్తాం" అని చాంబర్ సభ్యుడొకరు చెప్పారు.

ఆఫర్‌లు ఇస్తున్నారు

నాకు 800 చదరపు అడుగుల ఆఫీసు ఉంది. రెండేళ్ల క్రితం దీనిని 20 లక్షలు వెచ్చించి పునఃనిర్మించుకున్నాను. సొసైటీ కమిటీలో ఒక సభ్యుడు వచ్చి, మీరు ఎందుకు అభివృద్ధిని ఆపుతున్నారు? మీకేం కావాలో చెప్పండి సెటిల్ చేస్తాం అన్నారు. నాలాగే ఇతరులకు కూడా ఇలాంటి ఆఫర్స్ ఇచ్చారు. కొందరు తీసుకున్నారని విన్నాను. సినీ ప్రముఖులందరూ విరాళాలు సేకరించి కట్టుకున్న భవంతులివి. నిర్మించి 30 ఏళ్లే అయ్యింది. ఎందుకు కూల్చేయాలి? అంగీకరించం.

- చాంబర్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్

భవనం సినీ పరిశ్రమకే ఉండాలి


పరిశ్రమ ఎదగడంలో భాగంగా మారిన భవంతులను కూలగొడతామంటే బాధగా ఉంది. మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదు. ఈ రోజు ఫిల్మ్ నగర్ అంటే హైదరాబాద్‌కే ఐకాన్. సినీ పరిశ్రమకు కేంద్ర బిందువు. అక్కడ జరిగే ప్రతీ అభివృద్ధి కార్యక్రమంలో సినీ పరిశ్రమను భాగస్వామ్యం చేయాలి. సీఎం రేవంత్ హైదరాబాద్‌ను వినోద రంగానికిప్రపంచంలోనే కేంద్ర స్థానంగా మారుస్తామంటున్నారు. అలాంటప్పుడు ఇక్కడ ఎలాంటి భవంతులు కట్టినా అది తెలుగు పరిశ్రమకు ప్రతిష్ఠను తెచ్చేదిగా ఉండాలి. దానిలో పరిశ్రమ సంబంధిత కార్యక్రమాలు మాత్రమే నిర్వహించుకొనేలా ఉండాలి

- డి.సురేష్‌బాబు, ప్రముఖ నిర్మాత

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

జటాధరుడికి జో లాలి



సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రధారులుగా దర్శకద్వయం వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కించిన సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేశ్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్ నిర్మించారు. నవంబరు 7న తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇటీవలె విడుదలైన టీజర్, ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. తాజాగా మేకర్స్ 'జో లాలి జో...' అంటూ సాగే పాటను విడుదల చేశారు. శ్రీమాన్ కీర్తి సాహిత్యానికి రాజీవ్ రాజ్ అద్భుతమైన స్వరాలు సమకూర్చారు. పావని వాసా, రాజీవ్ రాజ్ మైమరిపించేలా ఆలపించారు.



శరవేగంగా చిత్రీకరణ

వరుణ్ తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ ఓ హారర్ కామెడీ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న విషయం తెలిసిందే. 'వీటీ15' అనేది వర్కింగ్ టైటిల్. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. వరుణ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. వరుణ్ తేజ్, ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. 'వరుణ్ కెరీర్‌లోనే ఈ సినిమా ప్రత్యేకంగా ఉండబోతోంది. 'తొలిప్రేమ' తర్వాత వరుణ్- తమన్ కాంబినేషన్‌లో మరోసారి అదరగొట్టే ఆల్బమ్ రానుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని ఆసక్తికర అప్డేట్స్ త్వరలో ఇవ్వబోతున్నాం' అని మేకర్స్ తెలిపారు.



రష్మికకు అవార్డు ఖాయం

అల్లు అరవింద్

'ఈ 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రం కథను రాహుల్ నాలుగేళ్ల క్రితం చెప్పాడు. 'ఆహా'కు వెబ్ సిరీస్ చేయాలనే ప్లాన్‌లో ఉన్నాడు. కానీ, ఇలాంటి మంచి కథతో సినిమా చేస్తేనే బాగుంటుందని అనిపించింది. ఈ కథలో హీరోయిన్ క్యారెక్టర్ చాలా ఇంటెన్స్‌గా ఉంటుంది. అలాంటి పాత్రకు రష్మిక మాత్రమే న్యాయం చేయగలదు అని అనిపించింది. తను నాకు కూతురు లాంటిది. ఈ సినిమాలో నటనకు గాను రష్మికకు ఉత్తమ నటి అవార్డు రావడం ఖాయం' అని అన్నారు నిర్మాత అల్లు అరవింద్. రష్మిక మందన్న లీడ్ రోల్‌లో రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. దీక్షిత్ శెట్టి కథానాయకుడు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్లపై అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. నవంబరు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన వేడుకలో ట్రైలర్‌ని విడుదల చేశారు. రష్మిక మాట్లాడుతూ 'ఈ చిత్రం కథ విన్నప్పుడు ఇప్పటివరకూ ఇలాంటి ప్రేమ కథని మనం చూడలేదనిపించింది. మనందరి జీవితాల్లో ఇలాంటివి జరుగుతాయి కదా అని అనిపించింది. ఇందులో భూమా అనే పాత్రలో నటించాను. నా కెరీర్‌లో సరైన సమయంలో సరైన ఎంపిక ఈ ప్రాజెక్టు' అని అన్నారు. రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ 'నేను విద్యార్థిగా హాస్టల్‌లో ఉండే రోజుల్లో అనుకున్న కథ ఇది. ట్రైలర్‌లో చూపించినట్లే సినిమా ఆద్యంతం మనసును కదిలించే భావోద్వేగాలతో ఉంటుంది. ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'రష్మిక లేకుంటే 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమానే లేదు. దీక్షిత్ మాకు దొరికిన గొప్ప నటుడు. ఈ చిత్రం తర్వాత ఆయన టాలీవుడ్‌లో మరో పదేళ్లు వరుసగా సినిమాలు చేస్తారు' అని అన్నారు.

గుర్తుండిపోయే విజయం

ప్రదీప్ రంగనాథన్

"డ్యూడ్ సినిమా వంద కోట్ల వసూళ్లను అధిగమించింది. ప్రేక్షకుల ఆదరణ లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు. గుర్తుండిపోయేలా అద్భుత విజయాన్ని అందించిన ఆడియన్స్‌కు కృతజ్ఞతలు. హౌస్‌ఫుల్ కలెక్షన్లతో సినిమా దూసుకుపోతోంది' అని అన్నారు హీరో ప్రదీప్ రంగనాథన్. ఆయన కథానాయకుడిగా, మమిత బైజు కథానాయికగా కీర్తీశ్వరన్ తెరకెక్కించిన చిత్రమిది. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై వై. రవిశంకర్, నవీన్ యెర్నేని నిర్మించారు. ఇటీవలె సినిమా విడుదలై ప్రేక్ష



కాదరణతో థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సందర్భంగా చిత్రబృందం విజయోత్సవ వేడుకను నిర్వహించింది. చిత్ర దర్శకుడు కీర్తీశ్వరన్ మాట్లాడుతూ 'నా తొలి చిత్రం మైత్రీ బేనర్‌లో భారీ విజయాన్ని అందుకొన్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఇంత గొప్పగా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు. నిర్మాత వై.రవిశంకర్ మాట్లాడుతూ 'మా సినిమాకు తెలుగుతో పాటు తమిళంలోనూ అద్భుతమైన ఆదరణ దక్కుతోంది. మా సంస్థలో పరిచయమైన భరత్ కమ్మ, నితీష్ రానా, బుచ్చిబాబు సానా పెద్ద దర్శకులుగా ఎదిగారు. ఇప్పుడు అదే కేటగిరీలో కీర్తీశ్వరన్ చేరినందుకు ఆనందంగా ఉంది' అని అన్నారు.

బాలీవుడ్ హాస్యనటుడు సతీశ్ షా కన్నుమూత



బాలీవుడ్ వెండితెరపై హాస్యనటుడిగా తనదైన ముద్ర వేసిన సతీశ్ షా(74) శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. కొన్నాళ్లుగా ఆయన మూత్రపిండాలకు సంబంధించిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇటీవలే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స జరిగింది. అయినా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ముంబైలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన పూర్తి పేరు సతీశ్ రవిలాల్ షా. 1951లో ముంబైలో జన్మించారు. పుణేలోని ప్రతిష్ఠాత్మక ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో నటనలో శిక్షణ తీసుకున్నారు. హిందీ సినిమా చరిత్రలో అత్యుత్తమ హాస్య చిత్రాల్లో ఒకటిగా భావించే 'జానే భీ దో యారో' చిత్రంలో అవినీతిపరుడైన మున్సిపల్ కమీషనర్ డి మెల్లో పాత్రలో సతీశ్ నటన చిరస్మరణీయంగా నిలిచింది. అలాగే బాలీవుడ్ బ్లాక్‌బస్టర్స్ 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే, హమ్ ఆప్ కె హై కౌన్, మైహూనా, కల్ హో నా హో' లాంటి చిత్రాల్లో ఆయన సహాయ పాత్రల్లో అలరించారు. టీవీ రంగంలో సతీశ్ షా ప్రతిభను నిరూపించిన తొలి కార్యక్రమం 'యే జో హై జిందగీ'. ఈ హాస్య ధారావాహికలో 55 ఎపిసోడ్లలో 55 విభిన్న పాత్రలను పోషించి అరుదైన ఘనతను షా సాధించారు. 'సారాభాయ్ వర్సెస్ సారాభాయ్' షోలో అత్తాకోడళ్ల మధ్య తగవులు పెట్టే ఇంద్రవదన్ సారాభాయ్ పాత్రతో ఆయన బుల్లితెర ప్రేక్షకులకు చేరువయ్యారు. ఐదు దశాబ్దాల పాటు సాగిన ఆయన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో 200కు పైగా సినిమాలు, పలు టీవీ సీరియల్స్‌లో నటించి ప్రేక్షకులను అలరించారు. 1982లో ఆయన ఫ్యాషన్ డిజైనర్ మధు షాను వివాహం చేసుకున్నారు.

భావోద్వేగ ప్రేమ గాథ



మిన్హాజ్ రుమి, యష్నా ముత్తులూరి ప్రధాన పాత్రధారులుగా అఖిల్ రాజ్ తెరకెక్కిస్తోన్న ప్రేమ కథా చిత్రం 'దేవ్-పారు'. ఏకే ప్రొడక్షన్స్ బేనర్‌పై అఖిల్ రాజు దర్శకత్వంలో లోడీ ఫాహద్ అలీఖాన్ నిర్మిస్తున్నారు. శనివారం నిర్వహించిన కారక్రమంలో 'నా ప్రాణమంతా..' అంటూ సాగే ప్రేమ గీతాన్ని దర్శకుడు కృష్ణ చైతన్య ఆవిష్కరించారు. ఈ గీతానికి ఓషో వెంకట్ స్వరాలందించగా, కాలభైరవ ఆలపించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇది ఒక భావోద్వేగ ప్రేమ గాథ. యువతను బాగా ఆకట్టుకుంటుంది. మిన్హాజ్ అద్భుతంగా నటించాడు' అని చెప్పారు. మిన్హాజ్ రోమి మాట్లాడుతూ ' ఈ సినిమాలో ప్రేమ కథతో పాటు భావోద్వేగ సన్నివేశాలు, హాస్యం, వినోదం వంటి అన్ని హంగులూ ఉన్నాయి' అని అన్నారు. నిర్మాత అలీఖాన్ మాట్లాడుతూ 'కొత్త వారికి అవకాశం ఇవ్వాలనే తపన ఈ చిత్రంతో నెరవేరింది' అని పేర్కొన్నారు.

ఈ శీతాకాలం అందమైన రైలు ప్రయాణ అనుభవాన్ని సొంతం చేసుకోవాలనుకుంటున్నారా? అయితే మనోహరమైన ప్రకృతి దృశ్యాల గుండా సాగే ఈ రైలు ప్రయాణాలను ఎంచుకోండి.

చలికాలం చక్కర్లు కొట్టేద్దాం!

చలికాలం వాతావరణం ప్రయాణాలకూ, వినోదాలకూ ఎంతో అనుకూలంగా ఉంటుంది. పైగా ఈ కాలంలో పర్వత ప్రాంతాల ప్రకృతి ఎంతో రమణీయంగా ఉంటుంది. మంచు కప్పేసిన పర్వతాలు, దట్టమైన అడవులు, పారే సెలయేర్లు... ఇలాంటి అద్భుతమైన ప్రకృతి అందాలను వీక్షిస్తూ వాటి గుండా రైల్లో ప్రయాణించే అనుభవాన్ని పొందడం కోసం ఇవిగో ఈ రైలు ప్రయాణాలను ఎంచుకోవచ్చు.



కల్కా - శిమ్లా (హిమాచల్‌ప్రదేశ్)

కల్కా-శిమ్లా రైల్వే స్టేషన్... నిర్మాణ కౌశలానికి గాను 2008లో యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది. 1903లో బ్రిటిషర్లు నిర్మించిన కల్కా-శిమ్లా రైల్వే మార్గం అద్భుతమైన ప్రకృతిదృశ్యాలకు పేరు పొందింది. మంచు పర్వతాల గుండా 900 వంతెనలు, వెయ్యి సొరంగాల మీదుగా సాగే ఈ రైలు ప్రయాణం అసాంతం అద్భుతమైన ప్రకృతిదృశ్యాలు మనల్ని కనువిందు చేస్తాయి. నాలుగు నుంచి ఐదు గంటల పాటు సాగే ఈ ప్రయాణం జీవితంలో మర్చిపోలేని అనుభవాన్ని అందిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



ప్యాలెస్ ఆన్ వీల్స్ (రాజస్థాన్)



అత్యంత విలాసవంతమైన రైలు ప్రయాణాన్ని కోరుకునేవాళ్లు ప్యాలెస్ ఆన్ వీల్స్‌ను తప్పక ఎంచుకోవాలి. ఈ విలావంతమైన రైలు ఏడు రాత్రుళ్లు, 8 పగళ్లు నిరాటంకంగా ప్రయాణిస్తుంది. రాజస్థాన్ నుంచి ఆగ్రా వరకూ నడిచే ఈ రైలును 1982లో లాంచ్ చేశారు. కళ్లుచెదిరే ఇంటీరియర్స్, అద్భుతమైన భోజనం, ఆతిథ్యం.. ఇలా ఈ రైల్లో విలాసాలకు ఏమాత్రం కొదవ ఉండదు. ఈ రైలు ప్రతి సంవత్సరం, సెప్టెంబరు నుంచి ఏప్రిల్ వరకూ నడుస్తుంది. ప్రధాన నగరాలైన ఢిల్లీ, జైపూర్, చిత్తోర్‌ఘడ్, ఉదయ్‌పూర్, ఆగ్రాల మీదుగా ప్రయాణిస్తుంది.

డార్జిలింగ్ - హిమాలయన్ రైల్వే (పశ్చిమ బెంగాల్)

డార్జిలింగ్, హిమాలయన్ టాయ్ ట్రైన్ యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది. 1879 నుంచి 1881 మధ్య కాలంలో నిర్మించిన ఈ రైల్వే లైన్, కొత్త జల్పాయ్‌గురి, డార్జిలింగ్‌ల మధ్య నడుస్తూ ఉంటుంది. ఈ రైలు మార్గం అత్యంత ఎత్తులో ఉన్న రైల్వే స్టేషన్, ఘుమ్ మీదుగా ప్రయాణిస్తుంది. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య ఈ మార్గంలో ప్రయాణించగలిగితే, మనోహరమైన పర్వత దృశ్యాలను వీక్షించే అవకాశం దక్కుతుంది. ఈ నెలల్లో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడంతో పాటు, రైల్లో నుంచి హిమాలయాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయి.


జమ్ము - బారాముల్లా లైన్

కశ్మీర్ శీతాకాలపు భూతలస్వర్గం. కశ్మీరు అందాలను పూర్తి స్థాయిలో వీక్షించాలనుకునేవాళ్లు ఈ రైలు ప్రయాణాన్ని తప్పక ఎంచుకోవాలి. ఈ 324 కిలోమీటర్ల ప్రయాణంలో, మంచు కప్పేసిన పర్వతాలు, అందమైన నదులు కనువిందు చేస్తాయి. అలాగే ప్రపంచంలోనే అత్యంత పొడవాటి చీనాబ్ వంతెన మీదుగా ప్రయాణించే అవకాశం కూడా దక్కుతుంది. బనిహాల్ నుంచి సంగల్దన్ వరకూ సాగే భారతదేశంలోని అతి పొడవాటి సొరంగం కూడా ఈ దారిలోనే ఉంటుంది. కొత్తగా వాడుకలోకి వచ్చిన ఈ రైలు మార్గం ప్రయాణికులకు ఒక కొత్త అనుభవాన్ని అందిస్తుంది.

నీలగిరి మౌంటెన్ రైల్వే

నీలగిరి మౌంటెన్ రైల్వే కూడా మరొక యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదే! మెట్టుపాళ్యం నుంచి ఊటీ వరకూ ప్రయాణించే ఈ రైలు మార్గాన్ని 1908లో బ్రిటిషర్లు నిర్మించారు. అందమైన ప్రకృతిదృశ్యాల గుండా సాగే ఈ రైలు పాతకాలపు ఆవిరి ఇంజన్‌తో నడుస్తుంది. పిల్లలూ, పెద్దలూ, ప్రకృతి ప్రేమికులు, చరిత్ర పట్ల ఆసక్తికలిగిన వారు... ఇలా ఈ రైలు ప్రయాణం ప్రతి ఒక్కర్నీ అందర్నీ అలరిస్తుంది. నీలగిరి కొండల అందాలను ఆస్వాదించాలనుకునేవారు ఈ రైలు ప్రయాణాన్ని మిస్ చేసుకోకూడదు.

చిన్న మాట మాట్లాడినా ప్రమాదమే!



తెలుగు సినీ పరిశ్రమలో ప్రతిభావంతులైన యువ హీరోల్లో కిరణ్ అబ్బవరం ఒకరు. ఈ మధ్యకాలంలో ఆయన నటించిన 'కె-ర్యాంప్' సంచలన విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో ప్రేక్షకుల నాడిని ఎలా పట్టుకోవాలి? సోషల్ మీడియాలో ఎలాంటి పాత్ర పోషిస్తోందనే విషయాలపై ఆయన 'నవ్య'కు ఇచ్చిన ఇంటర్వ్యూ.

'కె-ర్యాంప్' విజయం మీలో ఎలాంటి మార్పు తీసుకువచ్చింది..

'కె-ర్యాంప్' విజయం చాలా ఆత్మవిశ్వాసాన్ని కలగజేసింది. ఈ విజయాన్ని పూర్తిగా ఎంజాయ్ చేస్తున్నాను. ఈ సినిమాను మొదలుపెట్టినప్పుడే దీపావళికి విడుదల చేయాలనుకున్నాం. ఎందుకంటే పండుగకి ఇంట్లో వాళ్లందరితోను కలిపి సినిమాకు వెళ్లాలనుకుంటారు. పైగా పండుగ అంటే నగరాల నుంచి వేల మంది తమ సొంత ఊళ్లకు వెళ్తారు. అలాంటి వారందరు సరదాగా ఎంజాయ్ చేసే సినిమా తీయాలనుకున్నాం. సినిమాలో సీన్స్ అన్నీ అలాగే డిజైన్ చేశాం. ఆ ప్రయత్నంలో విజయవంతమయ్యామనే అనుకుంటున్నా.

కొన్ని వివాదాలూ ఎదురయ్యాయి కదా...

అవును. పత్రికా సమావేశాల్లో కొన్ని వివాదాస్పదమైన ప్రశ్నలు వేస్తూ ఉంటారు. అవి చాలావరకు సినిమాకు సంబంధం లేనివే అయి ఉంటాయి. అప్పుడప్పుడు ఈ ప్రశ్నలు ఎందుకు తలెత్తుతున్నాయనే ఆలోచనల వస్తుంది. కొంచెం ఇబ్బందిగా అనిపిస్తుంది. ఒక పండుగకు నాలుగు సినిమాలు విడుదలయినప్పుడు వాటి మధ్య పోటీ ఉంటుంది. పత్రికా సమావేశాల్లో కూడా ఈ సినిమాలను పోలుస్తూ ప్రశ్నలు అడుగుతూ ఉంటారు. పొరపాటున మాట్లాడే చిన్న చిన్న మాటలు కూడా వివాదాస్పదమవుతున్నాయి. అందువల్ల చాలా సందర్భాలలో వివాదాస్పదమయిన ప్రశ్నలు అడిగినప్పుడు మౌనంగా ఉండిపోతున్నాను.

మీ స్క్రిప్ట్‌ల ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

గత ఏడాదిన్నర నుంచి నా ఆలోచన సరళిలో మార్పు వచ్చింది. నాకు అర్థమయినంత వరకు అందరు ప్రేక్షకులను అలరించే విధంగా సినిమా తీయలేం. ప్రేక్షకులు చాలా స్మార్ట్‌గా ఉంటున్నారు. వారికి నచ్చింది మాత్రమే చూస్తున్నారు. అందువల్ల రకరకాల సినిమాలు చేయాలనుకుంటున్నా. ఉదాహరణకు 'కె-ర్యాంప్'నే తీసుకుందాం. ఇది ఎంటర్‌టైన్‌మెంట్ జోనర్‌కు సంబంధించినది. దీనిని ఇష్టపడే ప్రేక్షకుల కోసం ఎంత కొత్తగా తీయగలం, వారికి థియేటర్స్‌కు ఎలా తీసుకురాగలం? అనే విషయంపైనే ఎక్కువగా ఆలోచించా. నా ఉద్దేశంలో ఇంకా నాకు వయస్సు ఎక్కువ రాలేదు కాబట్టి.. వచ్చే నాలుగేళ్ల పాటు రకరకాల స్క్రిప్ట్‌లను ఎంచుకొని సినిమాలు చేయవచ్చు.

ప్రేక్షకుల అభిరుచులు మారిపోతున్నాయనుకుంటున్నారా?

అనుకున్న సమయానికి సినిమా బయటకు రాకపోతే ఇబ్బందే! నా ఉద్దేశంలో మీడియం బడ్జెట్ సినిమాలకు- సినిమా మొదలుపెట్టిన ఏడు నెలల లోపులో బయటకు వచ్చేయాలి. ప్రొడక్షన్ విషయంలో లేటు అయితే సమస్యలు ఎదురవుతాయి. ప్రేక్షకులు కేవలం వర్తమానంలో ఉన్న భావోద్వేగాలకు ప్రభావితం అవుతున్నారు. ఏదైనా సినిమా



మూడేళ్లు లేటు అయిందనుకుందాం. ఆ సబ్జెక్ట్ అప్పటి దాకా రానిదే అయిఉండవచ్చు. కానీ దానిలో ఉండే ప్రధానమైన పాయింట్స్ ఎక్కడో ఒక చోట వచ్చేస్తున్నాయి. ఎమోషన్స్ పాతబడిపోతున్నాయి. ఉదాహరణకు నేను నటించిన 'దిల్ రుబా' సినిమాను తీసుకుందాం. అది నా ఉద్దేశంలో మంచి సినిమా. 2022లో ప్రారంభించాం. లేటు అయిపోయింది. ఆదరణ తగ్గిపోవటానికి ఈ లేటే కారణం.

మీరు రచయిత కదా... మీ ఉద్దేశంలో తెలుగులో కథా రచయితలు తగ్గిపోవటానికి కారణాలేమిటి?

అవును. నేను రచయిత కావాలని ఇండస్ట్రీకి వచ్చాను. కానీ నటుడయ్యాను. ఇక కథల విషయానికి వస్తే- ప్రతి రచయిత తానే ఎందుకు దర్శకుడు కాకూడదనుకుంటున్నాడు. నా దగ్గరకు వచ్చే వాళ్లలో- "నా దగ్గర కథ ఉంది.. నిర్మాత లేదా డైరక్టర్‌ను చూపిస్తారా?" అడిగేవారు ఎవరూ లేరు. చాలామంది నిర్మాతలు- "మా డైరక్టర్ దగ్గర కథ ఉంది. వినండి" అంటారు. దర్శకులు "మా దగ్గర కథ ఉంది.. వినండి" అంటారు. ఇతర భాషల్లో ఇలాంటి సమస్య లేదు. మళయాళంలో అనేకమంది రచయితలు కనిపిస్తారు.

ప్రేక్షకులను థియేటర్‌కు ఎలా తీసుకురావాలి?

సినిమాకు ఒక వైబ్ క్రియేట్ చేయాలి. కానీ ఆ వైబ్ ఎలా వస్తుందనే విషయం ఎవరికి తెలియదు. టీజర్‌తో వర్క్అవుట్ అవుతుందా? ట్రైలర్‌తో వర్కవుట్ అవుతుందా? అనే విషయం తెలియదు. ఒక సినిమాలో ఉన్నదేమిటనే విషయం పది రోజుల ముందు ప్రేక్షకులకు అర్థమవ్వాలి. అప్పుడే వాళ్లు థియేటర్స్‌కు వస్తున్నారు. సినిమా విడుదలయిన తర్వాత సినిమాలో ఉన్నది అర్థమయినా ప్రయోజనం ఉండకపోవచ్చు. ఓటీటీల్లో వస్తే చూద్దాం అనుకోవచ్చు. 'కె-ర్యాంప్' సినిమా కోసం నేను తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాంతాల్లో పర్యటించాను. ఈ సినిమా విజయం కావటానికి కారణం- దీనిలో ఉన్న ఎంటర్‌టైన్‌మెంట్ ప్రేక్షకులకు అర్థం కావటం. 'థియేటర్‌కు వెళ్లి ఎంజాయ్ చేద్దాం' అనే భావన ఉన్నప్పుడే ప్రేక్షకులు థియేటర్‌కు వస్తారు. లేకపోతే ఓటీటీలో వచ్చినప్పుడు చూద్దాం అని ఆగిపోతున్నారు.

అందరూ 'ఓటీటీలోనే చూద్దాం' అనే ఫీలింగ్‌లో ఉన్నారా?

అందరూ అలా లేరు. ఆడియన్స్‌కు కంటెంట్ నచ్చితే కచ్చితంగా థియేటర్‌కు వస్తారు. ఓటీటీలో చూద్దాం అనుకోరు. సినిమాలో ఉన్న ముఖ్యమైన విషయాలను ప్రేక్షకుడి దాకా పట్టుకు వెళ్లటమే నిజమైన ఛాలెంజ్. ఒకసారి ప్రేక్షకుడు సినిమాలో తమకు నచ్చేది ఉందని నమ్మితే వారు సినిమాను విజయవంతం చేస్తారు. ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో చాలామంది మామూలు ప్రేక్షకులు సినిమా చూసి వచ్చి రివ్యూలు పెడుతున్నారు. "మామా... సినిమా అదిరింది.. థియేటర్‌లో చూడు" అంటున్నారు. లేకపోతే "మామా... సినిమా సో.. సో.. ఓటీటీలో చూసుకోవచ్చులే" అంటున్నారు.

నిర్మాతలు, దర్శకులు కూడా ఓటీటీల కోసమే తీస్తున్నారనే విమర్శ ఉంది కదా...

ఈ విమర్శను నేను అంగీకరించను. ప్రతి దర్శకుడు, నిర్మాత- తన సినిమా థియేటర్‌లో విడుదల చేయాలనే అనుకుంటాడు. మొదలు పెట్టినప్పుడు- థియేటరికల్ కాకుండా మిగిలిన మార్కెట్ల నుంచి ఎంత సొమ్ము వస్తుందని ఆలోచించవచ్చు. కానీ థియేటర్‌లో విడుదల చేయాలనే కోరిక ప్రతి నిర్మాతకు ఉంటుంది. షూటింగ్ ఒక 40 శాతం పూర్తయిన తర్వాత సినిమా ఎలా వస్తోందనే విషయం నిర్మాతకు అర్థమయిపోతుంది. ఒక వేళ ఏదైనా తేడా ఉంటే- మరింత మెరుగ్గా ఎలా చేయాలనే విషయాన్ని ఆలోచిస్తారు. అంతే తప్ప ఓటీటీలో విడుదల చేద్దాం అని వదిలేయరని నా అభిప్రాయం.

సోషల్ మీడియాపై మీ అభిప్రాయమేమిటి?

సోషల్ మీడియా ఒక వైల్డ్ ఫైర్‌లా తగులుకుంది. చాలా జాగ్రత్తగా ఉండాల్సిన రోజులు వచ్చాయి. ప్రతి చిన్న మాట ఆచితూచి మాట్లాడాల్సి వస్తోంది. ఇంతకు ముందు ఏదైనా మాట మాట్లాడితే అందరికీ తెలియటానికి కొన్ని రోజులు పట్టేది. ప్రస్తుతం గంటల సమయం వైల్డ్ ఫైర్‌లా పాకేస్తోంది.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

జీవితం గురించి ఇక్కడే నేర్చుకున్నా..



"విజయం ఒక్క రోజులో రాదు... నిరంతరం కష్టపడితేనే అది మనల్ని వరిస్తుంది" అంటున్నారు బెంగళూరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) ప్రొఫెసర్ మాధవీలత. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన చీనాబ్ రైల్వే వంతెన నిర్మాణంలో ఆమె కీలకపాత్ర పోషించారు. తాను చదువుకున్న 'వరంగల్-నిట్'లో 'టెక్నోజియాన్-2025' ప్రారంభోత్సవానికి హాజరైన మాధవీలత 'నవ్య'తో పలు విషయాలు పంచుకున్నారు.

"నేను 'ఆర్ఈసీ' (ప్రస్తుతం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)- వరంగల్) పూర్వ విద్యార్థిని. సివిల్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ ఇక్కడే చేశాను. ఈ రెండేళ్లు నేను ఇక్కడ గడిపిన కాలాన్ని, అధ్యాపకుల సహకారాన్ని మరిచిపోలేను. జీవితం అంటే ఇక్కడే నేర్చుకున్నాను. ఈనాటి నా విజయానికి పునాది 'నిట్'లో పొందిన జ్ఞానమే. చాలా ఏళ్ల తర్వాత మళ్లీ నేను చదువుకున్న ఈ కాలేజీకి రావడం, ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. నాటి జ్ఞాపకాలన్నీ మరోసారి మనసులో మెదులుతున్నాయి. నా భర్త కూడా ఈ కాలేజీ పూర్వ విద్యార్థే.

సక్సెస్ అంటే..

సక్సెస్ అంటే నా దృష్టిలో రెండు రకాలు. ఒకటి సమాజానికి ఉపయోగపడే రీతిలో నిర్మాణాత్మకమైన ఒక పనిని విజయవంతంగా, అత్యంత ప్రతిభావంతంగా చేయగలిగే 'బాహ్య విజయం' ఒకటి. దీనివల్ల పొందే ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. ఇక మనకు ఆత్మసంతృప్తిని పరిపూర్ణంగా కలిగించేది 'అంతర్ విజయం'. మనిషి ఈ రెండిటినీ ఎప్పుడూ అనుభూతి చెందుతూ ఉండాలి. కష్టపడకుండా ఏదీ రాదు. అలాగని 24 గంటలు కష్టపడాల్సిన అవసరం కూడా లేదు. నా విషయానికి వస్తే... నేను కష్టపడ్డాను అలాగే కుటుంబాన్ని కూడా పట్టించుకున్నాను. జమ్ము-కశ్మీర్‌లోని చీనాబ్ బ్రిడ్జి నిర్మాణంలో పాలుపంచుకున్నప్పుడు... అంత పని ఒత్తిడిలోనూ కుటుంబంతో గడిపాను. బాధ్యతలతోపాటు కుటుంబాన్ని కూడా బ్యాలెన్స్ చేయగలగాలి. కుటుంబం చాలా ముఖ్యం. అయితే కుటుంబం కోసం మన అలవాట్లను మానుకోవాల్సిన అవసరం కూడా లేదు. కష్టపడుతూనే మన హాబీలను కొనసాగించుకోవచ్చు. నాకు వ్యవసాయం అంటే చాలా ఇష్టం. సమయం చిక్కినప్పుడల్లా పొలం పనులు చేస్తాను.


చీనాబ్ వంతెన గుర్తింపు తెచ్చింది...




చీనాబ్ వంతెన నిర్మాణం నాకు అనుభవంతో పాటు గుర్తింపు కూడా తెచ్చిపెట్టింది. ఈ వంతెన నిర్మాణంలో కన్సల్టెంట్‌గా 17 ఏళ్లుగా పనిచేసిన ఏకైక మహిళను నేనే. మధ్యలో ఎంతోమంది వెళ్లిపోయారు. కానీ ఎన్ని కష్టాలు వచ్చినా కొనసాగాను. ఆ వంతెన నిర్మాణంలో ఎంతో మంది కృషి ఉంది.

లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

యువత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. వాటి సాధనకు నిరంతరం శ్రమించాలి. ఏది ముఖ్యమో అదే చేయాలి. సెల్‌ఫోన్‌కు అతుక్కుపోయి గంటల తరబడి సమయాన్ని వృథా చేయకూడదు. మన ముందున్న లక్ష్యాలు ఏమిటి? ఉన్నతస్థాయికి ఎదగడానికి ఏం చేయాలి? అనేది యువత గుర్తెరగాలి. అలాగే సామాజిక సంబంధాలు ఎంతో ముఖ్యం. ఈనాటి యువకులు, ముఖ్యంగా విద్యార్థులు తమ చుట్టు గిరిగీసుకుంటున్నారు. వారికి సన్నిహితులైన స్నేహితులు తక్కువ మంది ఉంటున్నారు. ఎక్కువ మంది స్నేహితులు ఉండాలి. ఏదైనా కష్టం వస్తే చెప్పుకోవడానికి సన్నిహితులు ఉండాలి. పది మంది మనుషులు మనకు దగ్గరగా ఉన్నప్పుడు సమస్యలు చెప్పుకుంటే తేలికవుతుంది. అది లేకపోవడం వల్లే యువత నైరాశ్యానికి గురవుతున్నారు. ఏ రంగంలోనూ నేను విజయం సాధించలేకపోతున్నానే బాధ వారిని కుంగదీస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో వారికి కుటుంబం అండగా ఉండాలి. వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించాలి. విజయం అనేది ఒక్క రోజులో రాదు. నిరంతరం నిజాయితీగా కష్టపడితేనే దాన్ని పొందగలం."





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఇడ్లీ కొట్టు	తెలుగు డబ్బింగ్	అక్టోబర్ 29
బల్లాడ్ ఆఫ్ ఏ స్మాల్ ప్లేయర్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 29
అమెజాన్ ప్రైమ్		
హెడ్డా	ఒరిజినల్ మూవీ	అక్టోబర్ 29
హెజ్బిన్ హోటల్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 29
జియో హాట్‌స్టార్		
మానా కీ హమ్ యార్ నహీన్	హిందీ సిరీస్	అక్టోబర్ 29
లోక ఛాప్టర్ 1: చంద్ర	మలయాళ చిత్రం (తెలుగులో)	అక్టోబర్ 31
సన్ నెక్స్ట్		
బ్లాక్‌మెయిల్	తమిళ చిత్రం	అక్టోబర్ 30

'పింక్ బాల్' మెరుపులు..!



నీతా అంబానీ ఫ్యాషన్ సెన్స్ కేవలం స్టయిల్స్ ట్రెండ్స్‌కు మాత్రమే పరిమితం కాదు. ఆమె దుస్తులు భారతీయ వారసత్వాన్ని ప్రతిబింబిస్తాయి. ఆమె తరచూ భారతీయ చేనేత, బనారసి, కాంజీవరం, పటోలా చీరలు ధరించి అంతర్జాతీయ వేదికల పైన సందడి చేస్తుంటారు. సంప్రదాయ దుస్తులు ధరించినా అధునాతన దుస్తుల్లో కనిపించినా ఆమె లుక్ సామాజిక మాధ్యమాల్లో ప్రముఖంగా చర్చనీయాంశమవుతుంది. ఆమె ఆభరణాల ఎంపిక కూడా అసాధారణంగా ఉంటుంది. మ్యాచింగ్ నగలను ధరించడంలో ఆమెకు ఆమే సాటి. ఇటీవల బ్రిటిష్ మ్యూజియంలో జరిగిన పింక్ బాల్ కార్యక్రమానికి దేశీ స్టయిల్‌లో హాజరయ్యారు నీతా. సంప్రదాయ కాంజీవరం చీర కట్టుకుని అరుదైన పచ్చలు, వజ్రాలు పొదిగిన లాంగ్ నెక్లెస్‌తో భారత దేశ వారసత్వానికి ప్రతీకగా నిలిచారు.

అందమైన చీరలో నీతా...

నీతా ధరించిన కాంజీవరం జరీ పట్టు చీర రంగు పౌడర్ పింక్. దీన్ని స్వచ్ఛమైన మల్బరీ సిల్క్, బంగారు జరీ దారాలతో రూపొందించారు. ఈ చీరను 68 ఏళ్ల మాస్టర్ వీవర్ ఆర్. వర్ధన్ తన స్వహస్తాలతో నేశారు. ఈ సంప్రదాయ కళారూపాన్ని నేయడం తన తండ్రి, తాతల నుంచి నేర్చుకున్నాననీ, ఇది తమ కుటుంబ వారసత్వ కళ అనీ ఆయన గర్వంగా చెబుతున్నారు. మెటాలిక్ సీక్విన్, జర్దోసి వర్క్‌లతో చీర బార్డర్‌ను అందంగా తీర్చిదిద్దారు. కొంగును వెండి జరీ కట్‌వర్క్‌తో అలంకరించారు. ఈ చీర మీద ఆఫ్ షోల్డర్ కోర్సెట్ బ్లౌజ్ ధరించారు నీతా. జరీ దారాలతో ఎంబ్రాయిడరీ వర్క్ చేయడంతో బ్లౌజ్‌కు రిచ్‌లుక్ వచ్చింది. చీర మీద చక్కగా మ్యాచ్ అయ్యింది. చీర కొంగుతోపాటు బ్లౌజ్‌ను ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా డిజైన్ చేశారు.

చక్కని నెక్లెస్

నీతా అంబానీ ధరించిన లాంగ్ నెక్లెస్... ఈవెంట్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇండోర్ మహారాణి సంయోగిత దేవి ధరించిన నెక్లెస్‌ను ప్రేరణగా తీసుకుని ఎంతో ఇష్టంగా దీన్ని చేయించుకున్నారు నీతా. ప్రముఖ జ్యువెలరీ డిజైనర్ కాంతిలాల్ చోటాలాల్ దీన్ని రూపొందించారు. నెక్లెస్ మధ్యలో పెండెంట్‌గా 70 క్యారెట్ల కొలంబియన్ పచ్చను పొదిగారు. దీనికి ఇరువైపులా 40 క్యారెట్ల పియర్ వజ్రాలను డ్రాప్స్‌గా అమర్చారు. పెండెంట్ దిగువన నిజాం కాలం నాటి 40 క్యారెట్ల గుండ్రని వజ్రాన్ని అందంగా కూర్చారు. నెక్లెస్‌కు ఇరువైపులా మరో రెండు కుషన్ కట్ వజ్రాలను సొగసుగా జోడించారు. ఈ లాంగ్ నెక్లెస్‌లో వాడిన వజ్రాలు, పచ్చలను నీతా వ్యక్తిగతంగా సేకరించుకున్నవే కావడం విశేషం. చెవులకు వజ్రాల జుంకాలు, వేలికి పెద్ద వజ్రపుటుంగరం, చేతులకు వజ్రాల గాజులతో నీతా అపురూపంగా కనిపించారు. తేలిక పాటి మేకప్, అలల హెయిర్ స్టయిల్ ఆమె అందాన్ని మరింత పెంచాయి.

ఇషా కూడా...

తల్లితోపాటు హాజరైన ఇషా అంబానీ... పింక్ బాల్ ఈవెంట్‌కు సహ అధ్యక్షత వహించారు. పింక్ థీమ్‌కు తగ్గట్టు అబు జాని సందీప్ ఖోస్లా ప్రత్యేకంగా రూపొందించిన హ్యాండ్ మేడ్ కోచర్ డ్రెస్‌లో మెరిసిపోయారు ఇషా. జర్దోసి వర్క్, గులాబీ రంగు ముత్యాలు, సీక్విన్స్, మెరిసే స్ఫటికాలతో డిజైన్ చేసిన స్కర్ట్‌కు జతగా బ్లష్ పింక్ చామోయిస్ శాటిన్ జాకెట్‌తో రాయల్‌గా కనిపించారు. ఈ డ్రెస్‌ను 30 మంది కళాకారులు 3670 గంటలు శ్రమించి తీర్చిదిద్దారు. చెవులకు పచ్చల జుంకాలు, మెడలో పచ్చల నెక్లెస్, వేలికి పచ్చలు పేర్చిన వజ్రపుటుంగరం, గోళ్లకు పింక్ కలర్ నెయిల్ రింగ్స్‌తో హుందాగా ఆకర్షణీయంగా నిలిచారు ఇషా.





నవంబరు 1 నుంచి బ్యాంకుల్లో వచ్చే మార్పులేమిటంటే..

బ్యాంకుల్లో ఖాతాదారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు వచ్చే నెల 1వ తేదీ నుంచి చెక్ పడనుంది. ఇప్పటి వరకు బ్యాంక్ ఖాతాదారుడికి జరగరానిది ఏమైనా జరిగితే.. వారసులు ఆ ఖాతా సెటిల్ చేసుకోవడం పెద్ద సమస్యగా ఉండేది. లాకర్ల వస్తువుల సెటిల్‌మెంట్‌లోనూ ఇదే సమస్య. అయితే నవంబరు 1 నుంచి ఈ కష్టాలకు తెరపడనుంది. వీటి పరిష్కారానికి వీలు కల్పిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి సంబంధించిన బ్యాంకింగ్ చట్టాల (సవరణ) చట్టం, 2025'ను పార్లమెంట్ ఇప్పటికే ఆమోదించింది. ఈ కొత్త చట్టం ప్రకారం ఈ ఏడాది నవంబరు 1 నుంచి బ్యాంకింగ్ చట్టాల్లో కింది మార్పులు చోటు చేసుకోనున్నాయి. అవేమిటంటే?

నలుగురి వరకు నామినీలు: బ్యాంకు డిపాజిటర్లు ఇక నలుగురి వరకు నామినీలను నామినేట్ చేయవచ్చు. ఈ నలుగురిని ఒకేసారి లేదా ఒకరి తర్వాత ఒకరిని నామినేట్ చేయవచ్చు. ఈ మార్పు వల్ల డిపాజిట్ ఖాతాదారుడికి జరగరాని అనర్థమేదైనా జరిగితే, డిపాజిట్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ తేలికవుతుంది.

లాకర్లలోని వస్తువులకు నామినేషన్: లాకర్లు, సేఫ్ కస్టడీలోని వస్తువుల విషయంలో నామినేషన్‌కు అవకాశం ఉంటుంది. అంతేకాదు వరుస క్రమం ప్రకారం మాత్రమే నామినీలకు లాకర్లను నిర్వహించే అధికారం ఉంటుంది.

వాటాల విభజన: కొత్త చట్టంతో ఖాతాదారు తన తదనంతరం తన డిపాజిట్ లేదా లాకర్‌లోని వస్తువుల్లో ఏ నామినీకి ఎంత మొత్తం లేదా ఎంత శాతం చెల్లించాలనే విషయాన్ని ముందుగానే బ్యాంకుకు తెలియజేయవచ్చు. ఈ సదుపాయం ఒకేసారి నలుగురు నామినీలను నామినేట్ చేసే కేసుల్లో మాత్రమే వర్తిస్తుంది.

ఎవరెవరికి: బ్యాంకుల్లో డిపాజిట్లు, లాకర్లు, సేఫ్ డిపాజిట్ వాల్ట్‌లు ఉన్న వ్యక్తిగత/జాయింట్ లేదా సోల్ ప్రొప్రైటరీ ఖాతాదారులు అందరూ.. ఇక తమకు నచ్చిన నలుగురిని తమ నామినీలుగా నామినేట్ చేయవచ్చు. ఒకేసారి లేదా వరుస క్రమంలో తమ ప్రాధాన్యత ప్రకారం నామినీలను నామినేట్ చేయవచ్చు. అయితే ఎవరో ఒక ఖాతాదారుడికి ప్రతినిధిగా ఉన్న వ్యక్తులు మాత్రం ఎవరినీ నామినేట్ చేసేందుకు అవకాశం లేదు.

తేలిగ్గా క్లెయిమ్స్ పరిష్కారం: కొత్త నిబంధనలతో క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా జరగనుంది. దీంతో క్లెయిమ్‌ల పరిష్కారంలో ఆలస్యం, వివాదాలకు కూడా అవకాశం ఉండదు.

ఒకే దరఖాస్తు: కొత్త చట్టం ప్రకారం నామినీల నామినేషన్ల కోసం ఇక బ్యాంకులన్నీ ఒకే ప్రామాణిక అప్లికేషన్‌ను అనుసరిస్తాయి. దీనివల్ల క్లెయిమ్స్ సెటిల్‌మెంట్, డాక్యుమెంటేషన్ కూడా సులభమవుతుంది.

జాయింట్ ఖాతాల్లో పారదర్శకత: జాయింట్ ఖాతాదారులు పరస్పర అంగీకారంతో నామినీల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయవచ్చు. దీని వల్ల ఖాతాదారుడు చనిపోయినప్పుడు క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియ మరింత తేలికవుతుంది.

మరింత రక్షణ: నామినీల ప్రక్రియ సులభతరం కావడంతో డిపాజిట్లకు, లాకర్లకు చట్టపరంగా మరింత రక్షణ ఏర్పడుతుంది. దీనివల్ల ఖాతాదారుడు మరణించినపుడు.. అతని నామినీలకు ఖాతాలోని సొమ్ము పంపిణీ త్వరగా, సులభంగా పూర్తవుతుంది.

క్రమబద్ధీకరణ: మారిన నిబంధనలతో వరుస క్రమంలో ఉన్న నామినీలు మాత్రమే, లాకర్లలోని వస్తువులు, సేఫ్ డిపాజిట్లను ఖాతాదారుడు సూచించిన నిష్పత్తిలో అందుకోగలుగుతారు.

రికార్డుల నిర్వహణ: ఈ మార్పులతో బ్యాంకులు తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ పద్ధతిలో నామినీల రికార్డులు అప్‌డేట్ చేయాలి. దీనివల్ల మానవ తప్పిదాలకు తావు ఉండదు. బ్యాంకుల మీదా జవాబుదారీతనం పెరుగుతుంది.

హైదరాబాద్.. యాపిల్ ఎయిర్‌పాడ్స్ తయారీ హబ్

ఫాక్స్‌కాన్ ప్లాంట్‌లో ఉత్పత్తి నెలకు 2 లక్షల యూనిట్లకు పెంపు

మరో రూ.1,800 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: యాపిల్ ఎయిర్‌పాడ్స్ తయారీకి భాగ్యనగరం హబ్‌గా అవతరించబోతోంది. యాపిల్ సంస్థ కోసం ఎయిర్‌పాడ్స్ తయారు చేస్తున్న తైవాన్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్‌కు చెందిన హైదరాబాద్ యూనిట్ 'ఫాక్స్‌కాన్ ఇంటర్‌కనెక్ట్ టెక్నాలజీ' (ఎఫ్ఐటీ) ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఉత్పత్తి ప్రారంభించింది. హైదరాబాద్ సమీపంలోని కొంగరకలాన్ ప్లాంట్‌లో కంపెనీ ప్రస్తుతం నెలకు 1,00,000 యూనిట్లకు పైగా ఎయిర్‌పాడ్స్‌ను తయారు చేస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా యాపిల్ ఎయిర్‌పాడ్స్‌కు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా హైదరాబాద్‌లోని యూనిట్‌లో ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకు 2,00,000 యూనిట్లను పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం వచ్చే 6-8 నెలల్లో ప్రొడక్షన్ లైన్లను విస్తరించడంతో పాటు మరో 3,000 మందిని నియమించుకోనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ ప్లాంట్‌లో 2,000 మంది పనిచేస్తున్నారు.

చైనా ప్లస్ వన్ వ్యూహంలో భాగంగా: ఫాక్స్‌కాన్ తన తయారీ కార్యకలాపాలను చైనాను దాటి విస్తరించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా చైనా ప్లస్ వన్ వ్యూహంలో భాగంగా భారత్‌లో తన కార్యకలాపాలను మరింతగా విస్తరించటంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లోని ఎయిర్‌పాడ్స్ తయారీ ప్లాంట్‌ను భారీగా విస్తరిస్తోంది. ఇందుకనుగుణంగానే తైవాన్‌లోని ప్లాంట్ల నుంచి అవసరమైన తయారీ యంత్రాలను ఇక్కడి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గత నెలలో యాపిల్ మార్కెట్లోకి విడుదల చేసిన ఎయిర్‌పాడ్స్ 4, ఎయిర్‌పాడ్స్ ప్రో 3 మోడళ్లను ఉత్పత్తి చేసేందుకు ఈ యంత్రాలను వినియోగించనున్నట్లు సమాచారం. కాగా ఫాక్స్‌కాన్ ఇప్పటికే హైదరాబాద్ యూనిట్ కోసం రూ.3,000 కోట్ల పెట్టుబడులు పెట్టింది. తాజాగా చేపట్టనున్న విస్తరణ కోసం మరో రూ.1,800 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిసింది.

సీసీఎల్ నుంచి ఎన్‌సీసీకి రూ.6,829 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఎన్‌సీసీ లిమిటెడ్.. కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) అనుబంధ సంస్థ సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (సీసీఎల్) నుంచి రూ.6,828.94 కోట్ల ఆర్డర్‌ను అందుకున్నట్లు ప్రకటించింది. ఆర్డర్‌లో భాగంగా జార్ఖండ్‌లోని చంద్రగుప్త ప్రాంతంలో సీసీఎల్‌కు చెందిన ఆమ్రపాలి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులో బొగ్గు వెలికితీత, తరలింపు సహా వ్యాగన్ లోడింగ్ వంటి పనులను చేపట్టాల్సి ఉంటుందని ఎన్‌సీసీ తెలిపింది. ఈ కాంట్రాక్ట్ కాలపరిమితి ఏడు సంవత్సరాలని పేర్కొంది. కాంట్రాక్టులో భాగంగా హెవీ ఎర్త్ మూవింగ్ మెషినరీ (హెచ్ఈఎంఎం)ను వినియోగించాల్సి ఉంటుందని ఎన్‌సీసీ వెల్లడించింది.

కోటక్ బ్యాంక్ లాభం రూ.3,253 కోట్లు

న్యూఢిల్లీ: సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో (క్యూ2) కోటక్ మహీంద్రా బ్యాంక్ స్టాండ్‌ఎలోన్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 3 శాతం తగ్గి రూ.3,253 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.3,344 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.16,239 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.13,649 కోట్లుగా ఉంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 4.54 శాతానికి తగ్గింది. కాగా బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 1.39 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.32 శాతానికి తగ్గాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



26వ తేదీ			
హైదరాబాద్	555	విజయవాడ	575
వరంగల్	557	గోదావరి	565
చిత్తూరు	583	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	117	విజయవాడ	123
వరంగల్	117	గుంటూరు	126
కరీంనగర్	117	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	107
కర్నూలు	117	నెల్లూరు	112
విశాఖపట్నం	119	అనంతపురం	112
గోదావరి	123		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,25,620 ▲	1,15,150 ▲	1,70,000 ▼
విజయవాడ	1,27,000 ▲	1,21,000 ▲	1,53,500 ▲
విశాఖపట్నం	1,26,980 ▲	1,15,000 ▲	1,70,000 ▼
రాజమండ్రి	1,25,620 ▼	1,15,150 ▼	1,53,000 ▼
ప్రొద్దుటూరు	1,23,000 ▼	1,13,160 ▼	1,53,000 ▼
ముంబై	1,21,518 ▼	1,11,310 ▼	1,47,033 ▼

లే అవుట్స్‌లోని స్థలాలు అమ్ముతుంటే జీఎస్‌టీ చెల్లించాలా..!

ఇటీ GST



రాంబాబు గొండాల

జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తొలినాళ్లతో పోల్చుకుంటే ఈ ఎనిమిది సంవత్సరాలలో వివిధ రంగాలకు సంబంధించి చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ఉదాహరణకు రియల్ ఎస్టేట్ రంగాన్ని తీసుకుంటే మొదట్లో నివాసిత (రెసిడెన్షియల్) అపార్ట్‌మెంట్ల అమ్మకానికి 12 శాతం పన్ను ఉండేది. 2019 నుంచి దీన్ని 5 శాతానికి తగ్గించటం జరిగింది. అలాగే మొదట్లో ఉన్న ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) సదుపాయాన్ని తొలగించారు. అయితే వాణిజ్య పరిధిలోకి వచ్చే కమర్షియల్ అపార్ట్‌మెంట్స్‌కు మాత్రం పన్ను శాతంలో గానీ, ఐటీసీ విషయంలో కానీ ఎలాంటి మార్పులు చేయలేదు. మొత్తానికి, నిర్మాణ రంగానికి సంబంధించిన జీఎస్‌టీలో కొంత స్పష్టత ఉన్నప్పటికీ లే అవుట్ వేసి ప్లాట్లను విక్రయించటం.. అంటే స్థలాల అమ్మకం విషయంలో జీఎస్‌టీకి సంబంధించి కొంత గందరగోళం ఉంది. దీనికి ముఖ్య కారణం.. ఈ రంగం ఇంకా అసంఘటితంగానే ఉండటం, అలాగే నిర్మాణ రంగంతో పోలిస్తే వీరికి ఆడిటర్లు, అసోసియేషన్స్ గానీ ఉండవు. అంతేకాకుండా సరైన సలహా ఇచ్చే వారు సాధారణంగా ఉండరు. కాబట్టి లే అవుట్స్‌లోని ప్లాట్లు విక్రయించే టప్పుడు జీఎస్‌టీ చెల్లించాలా? వద్దా? అనే విషయంలో ఈ రంగంలోని వారికి కొంత అవగాహనా లోపం ఉంది.

సర్వీస్ కిందకు వచ్చేవి ఏమిటంటే..

వివరంగా చెప్పాలంటే, జీఎస్‌టీ చట్టంలోని నిర్వచనాల ప్రకారం.. అపార్ట్‌మెంట్లకు సంబంధించి ఒక ప్రాజెక్ట్ మొదలు పెట్టినప్పటి నుంచి ప్రాజెక్ట్ పూర్తయి కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చే వరకు జరిపే అమ్మకాలను 'సర్వీస్' కింద భావిస్తారు. కాబట్టి వీటి మీద జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే 'రెరా' చట్టం ప్రకారం ప్రమోటర్, రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ అనే నిర్వచనం కేవలం నిర్మాణ రంగానికే కాకుండా ఖాళీ లేదా వ్యవసాయ భూములను ప్లాట్లుగా అంటే 'లే అవుట్'గా అభివృద్ధి చేయటానికి కూడా వర్తిస్తుంది. దీంతో ఒక వ్యక్తి కొంత స్థలాన్ని లే అవుట్‌గా డెవలప్ చేసి అందులోని స్థలాలను అమ్మటం అనేది జీఎస్‌టీ వర్తించే అంశం అని ఒక వాదన. దీనికి కారణం ఏమిటంటే, ఒక లే అవుట్‌లో డెవలప్‌మెంట్ జరిగే దశలో ప్లాట్లు అమ్మటం అనేది కంప్లీషన్ సర్టిఫికెట్ రాక ముందు అపార్ట్‌మెంట్లను అమ్మటంతో సమానం. ఎందుకంటే, ఇందులో స్థలం మాత్రమే కాకుండా రోడ్లు, కాలువలు, పార్క్ మొదలైన వాటితో కూడిన డెవలప్‌మెంట్ అనే అంశం ముడిపడి ఉంది. ప్రమోటర్ కేవల స్థలానికే కాకుండా డెవలప్‌మెంట్‌కు కలిపి డబ్బులు తీసుకుంటాడు. దీంతో ఇది కూడా సర్వీస్ కింద భావిస్తూ తగిన జీఎస్‌టీ చెల్లించాలనేది ఒక వాదన. కానీ, జీఎస్‌టీ చట్టం ప్రకారం పొలాలు, స్థలాలు అంటే భూమి అమ్మకం అనేది జీఎస్‌టీలోకి వచ్చే అంశం కాదు. కాబట్టి ఇదే మినహాయింపు లే అవుట్ ప్లాట్లకు కూడా వర్తిస్తుందని ఇంకొక ఆలోచన.

ప్రభుత్వ మార్గదర్శకాలు

ఈ గందరగోళాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ రంగానికి సంబంధించి కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. దీని ప్రకారం, ఏదేనీ ఒక లే అవుట్‌లో అమ్మే స్థలాలకు ఎటువంటి జీఎస్‌టీ వర్తించదు. అంటే లే అవుట్ డెవలప్‌మెంట్ జరిగే దశలో కావచ్చు లేదా పూర్తయిన తర్వాత కావచ్చు.. ఎప్పుడు అమ్మినా ఆ ప్లాట్ల మీద ఎలాంటి జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. ఇదే సమయంలో మరొక వివరణ ఇవ్వటం జరిగింది.

లే అవుట్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి ఎవరికైనా కాంట్రాక్ట్ ఇస్తే అంటే భూమి చదును చేయటం, అంతర్గత రోడ్లు, కాలువల నిర్మాణం లేదా పార్క్ ఏర్పాటు మొదలైన పనులను ఎవరికైనా కాంట్రాక్ట్ ఇస్తే.. సదరు కాంట్రాక్టర్ ఆ మొత్తం మీద జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. అంతే కానీ, ప్లాట్ కొనుగోలుదారుడు ఎలాంటి జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. కాబట్టి ప్రమోటర్, కొనుగోలుదారులు, కాంట్రాక్టర్లు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవటం అత్యంత ఆవశ్యకం.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



ఇప్పటికే సిరీస్ పోయిన దశలో మూడో వన్డే నామమాత్రపు మ్యాచే.. అయితేనేం.. ప్రేక్షకులకదేమీ పట్టలేదు. ఆసీస్ గడ్డపై విరాట్ కోహ్లీ, రోహిత్ చివరి ఆట చూసేందుకు ప్రఖ్యాత సిడ్నీ క్రికెట్ మైదానం కిటకిటలాడిపోయింది. ఇంతటి అభిమానాన్ని ఆ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు కూడా ఏమాత్రం వమ్ము చేయలేదు. ఆసీస్ బౌలర్లపై ఆధిపత్యంతో రోహిత్ తన వింటేజ్ ఆటతీరును ప్రదర్శించగా, ఇక రెండు వరుస డకౌట్ల నుంచి తేరుకున్న విరాట్ క్లాస్ ఇన్నింగ్స్‌తో మైమరిపించాడు. అజేయంగా నిలిచిన ఈ ఇద్దరు భారత్‌ను వైట్‌వాష్ ముప్పు నుంచి తప్పించడంతో పాటు విమర్శకుల నోళ్లు మూయించారు.

ఇద్దరూ ఇరగదీశారు

- సెంచరీ బాదిన రోహిత్
- ఫామ్ చాటుకున్న విరాట్
- ఆఖరి వన్డేలో ఆసీస్‌పై భారత్ ఘనవిజయం

సిడ్నీ: ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియాకు ఓదార్పు విజయం దక్కింది. వెటరన్ స్టార్లు రోహిత్ శర్మ (125 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్సర్లతో 121 నాటౌట్) సెంచరీతో, విరాట్ కోహ్లీ (81 బంతుల్లో 7 ఫోర్లతో 74 నాటౌట్) హాఫ్ సెంచరీతో బ్యాట్లు ఝుళిపించడంతో మూడో వన్డేలో 9 వికెట్ల తేడాతో భారత్ ఘనవిజయం సాధించింది. అయితే సిరీస్‌ను 2-1తో ఆసీస్ దక్కించుకున్నప్పటికీ.. ఈ ఫార్మాట్‌లో తొలిసారిగా భారత్‌ను క్లీన్‌స్వీప్ చేయాలనుకున్న కంగారూల కోరిక మాత్రం నెరవేరలేదు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 46.4 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌటైంది. రెన్షా (56), కెప్టెన్ మిచెల్ మార్ష్ (41), షార్ట్ (30) రాణించారు. హర్షిత్ రాణాకు 4, సుందర్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 38.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 237 పరుగులు చేసి నెగ్గింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా రోహిత్ నిలిచాడు.

అదిరే ఆట: 237 పరుగుల ఛేదనలో ఓపెనర్ రోహిత్, విరాట్ కళ్లుచెదిరే ఆటతీరుతో ప్రేక్షకులను అలరించారు. వీరి ప్రతీ పరుగును వారంతా ఆస్వాదించారు. మరో ఓపెనర్ గిల్ (24)తో రోహిత్ తొలి వికెట్‌కు 69 రన్స్ అందించాడు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన పేసర్ హాజెల్‌వుడ్ 11వ ఓవర్‌లో గిల్‌ను అవుట్ చేశాడు. ఆ తర్వాత ఆసీస్ బౌలర్లకు రో-కో చుక్కలు చూపించారు. ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య క్రీజులోకి వచ్చిన విరాట్ తొలి సింగిల్ తీయగానే స్టేడియం మార్మోగిపోయింది. రెండు వరుస డకౌట్ల తర్వాత వచ్చిన పరుగు కావడంతో కోహ్లీ కూడా సరదాగా పిడికిలి బిగించి చూపాడు. జంపా, హాజెల్‌వుడ్ ఓవర్లలో ఒక్కో ఫోర్‌తో విరాట్ లయ అందుకున్నాడు. రోహిత్ సైతం జంపా ఓవర్‌లో సిక్సర్‌తో గేరు మార్చాడు. 56 బంతుల్లో విరాట్ హాఫ్ సెంచరీ పూర్తి చేయగా, 105 బంతుల్లో రోహిత్ కెరీర్‌లో 33వ శతకాన్ని అందుకున్నాడు. ఆ తర్వాత షార్ట్ ఓవర్‌లో రోహిత్ 6,4తో.. 39వ ఓవర్‌లో విరాట్ ఫోర్‌తో మరో 69 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.



హర్షిత్ (4/39)

చెక్ పెట్టిన రాణా: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్‌ను పేసర్ హర్షిత్ చక్కటి పేస్, బౌన్స్‌తో ఇబ్బందిపెట్టాడు. అలాగే ఫీల్డింగ్‌లో విరాట్, శ్రేయాస్ కళ్లు చెదిరే క్యాచ్‌లతో ఆకట్టుకున్నారు. ఓపెనర్లు మార్ష్, హెడ్ (29) వేగంగా ఆడి తొలి వికెట్‌కు 61 రన్స్ జోడించారు. ఆ తర్వాత బౌలర్ల ధాటికి ఆసీస్ నుంచి భారీ భాగస్వామ్యాలు ఏర్పడలేదు. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు అక్షర్, సుందర్ కట్టడి చేయగా.. రాణా మిడిలార్డర్‌ను కుదురుకోనీయలేదు. దీంతో ఆసీస్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది.

మళ్లీ వస్తామో.. లేదో?

'ఆసీస్‌లో క్రికెట్ ఆడడం నాకిష్టం. 2008లో తొలిసారిగా ఇక్కడికి వచ్చా. అప్పుడు చాలా సరదాగా గడిచింది. ఇక మళ్లీ క్రికెటర్లుగా మేమిద్దరం (రోహిత్, విరాట్) ఇక్కడికి వస్తామో? రామో? తెలియదు. ఆసీస్‌లో ఇంత చక్కటి ఆదరణ లభించడం అద్భుతంగా అనిపిస్తుంది. మమ్మల్ని ఆదరించిన ఆసీస్ ప్రేక్షకులకు కృతజ్ఞతలు' - రోహిత్ శర్మ

వన్డే, టీ20ల్లో కలిపి అత్యధిక పరుగులు (18,437) చేసిన బ్యాటర్‌గా విరాట్. సచిన్ (18,436)ను అధిగమించాడు.

1

- వన్డేల్లో ఎక్కువ 150+ భాగస్వామ్యాలు (12) నమోదు చేసిన జోడీగా సచిన్-గంగూలీతో సమంగా నిలిచిన రోహిత్-విరాట్.
- ఆసీస్‌లో ఎక్కువ సెంచరీలు (6) చేసిన పర్యాటక బ్యాటర్‌గా రోహిత్.
- అంతర్జాతీయ క్రికెట్‌లోని ప్రతీ ఫార్మాట్‌లోనూ కనీసం 5 శతకాలు బాదిన ఏకైక ప్లేయర్‌గా రోహిత్. టెస్టులు (12), వన్డేలు (33), టీ20లు (5) కలిపి ఓవరాల్‌గా అతడికిది 50వ సెంచరీ.
- అతి పెద్ద వయస్సు (38)లో ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ గెలుచుకున్న భారత ప్లేయర్‌గా రోహిత్. ధోనీ (37)ని అధిగమించాడు.
- వన్డేల్లో ఎక్కువ పరుగులు (14,255) సాధించిన రెండో బ్యాటర్‌గా విరాట్. సచిన్ (18,426) ముందున్నాడు.

2



స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా: మార్ష్ (బి) అక్షర్ 41, హెడ్ (సి) ప్రసిద్ధ్ (బి) సిరాజ్ 29, షార్ట్ (సి) విరాట్ (బి) సుందర్ 30, రెన్షా (ఎల్బీ) సుందర్ 56, క్యారీ (సి) శ్రేయాస్ (బి) హర్షిత్ 24, కూపర్ (సి) విరాట్ (బి) హర్షిత్ 23, ఓవెన్ (సి) రోహిత్ (బి) హర్షిత్ 1, స్టార్క్ (బి) కుల్దీప్ 2, ఎలిస్ (సి) రోహిత్ (బి) ప్రసిద్ధ్ 16, జంపా (నాటౌట్) 2, హాజెల్‌వుడ్ (బి) హర్షిత్ 0; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 46.4 ఓవర్లలో 236 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-61, 2-88, 3-124, 5-195, 6-198, 7-201, 8-223, 9-236, 10-236. **బౌలింగ్:** సిరాజ్ 5-1-24-1, హర్షిత్ 8.4-0-39-4, ప్రసిద్ధ్ 7-0-52-1, కుల్దీప్ 10-0-50-1, అక్షర్ 6-0-18-1, సుందర్ 10-0-44-2.

భారత్: రోహిత్ (నాటౌట్) 121, గిల్ (సి) క్యారీ (బి) హాజెల్‌వుడ్ 24, విరాట్ (నాటౌట్) 74, **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 38.3 ఓవర్లలో 237/1. వికెట్ పతనం:** 1-69. **బౌలింగ్:** స్టార్క్ 5-0-31-0, హాజెల్‌వుడ్ 6-1-23-1, ఎలిస్ 7.3-0-60-0, కూపర్ 5-0-36-0, జంపా 10-0-50-0, ఓవెన్ 1-0-2-0, షార్ట్ 4-0-29-0.

హన్సిక, సారికలకు రజతాలు

అండర్-23 ప్రపంచ రెజ్లింగ్

నోవి సాద్ (సెర్బియా): అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఫైనల్ చేరిన భారత రెజ్లర్లు హన్సిక లాంబ (53 కిలోలు), సారిక మాలిక్ (59 కిలోలు) రజతాలతో సరిపెట్టుకున్నారు. పసిడి పోరులో హరున మొరికవ (జపాన్) చేతిలో హన్సిక, రుకా నటామి (జపాన్) చేతిలో సారిక ఓడారు.



అలనా కింగ్ (7/18)

మహిళల వన్డే వరల్డ్‌కప్

సెమీఫైనల్లో ఎవరెవరంటే..

ఇంగ్లండ్ x దక్షిణాఫ్రికా (బుధవారం)

భారత్ x ఆస్ట్రేలియా (గురువారం)

కింగ్ మ్యాజిక్

7 వికెట్లతో విజృంభణ
టాప్ లేపిన ఆసీస్
దక్షిణాఫ్రికా చిత్తు

ఇండోర్: డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియా టాప్ లేపింది. వన్డే వరల్డ్ కప్ లీగ్ దశను అజేయంగా ముగించిన ఆసీస్ మొత్తం 13 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. స్పిన్నర్ అలనా కింగ్ (7/18) తిప్పేయడంతో.. శనివారం ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 7 వికెట్లతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. తొలుత దక్షిణాఫ్రికా 24 ఓవర్లలో 97 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ లారా వొల్వార్ట్ (31) టాప్ స్కోరర్. ఓపెనర్లు వొల్వార్ట్‌ను షట్ అవుట్ చేయగా.. తజ్మిన్ బ్రిట్స్ (6)ను కిమ్ గార్త్ వెనక్కిపంపడంతో సఫారీల పతనం ఆరంభమైంది. వన్‌డౌన్ బ్యాటర్ సునె లుస్ (6) వికెట్‌తో వేటను మొదలెట్టిన కింగ్.. కాప్ (0), డెర్క్‌సెన్ (5), ట్రయాన్ (0), జెఫ్టా (29), క్లాస్ (4), డి క్లెర్క్ (14)ను అవుట్ చేసి సఫారీల వెన్నువిరిచింది. ఛేదనలో ఆసీస్ 16.5 ఓవర్లలో 98/3 స్కోరు చేసి నెగ్గింది. ఓపెనర్ జార్జియా వోల్ (38 నాటౌట్), బెత్ మూనీ (42) మూడో వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలిపించారు.

నేటి మ్యాచ్‌లు

స్టార్ నెట్‌వర్క్‌లో

ఇంగ్లండ్ x న్యూజిలాండ్
వేదిక: విశాఖపట్నం (ఉ.11 నుంచి)

భారత్ x బంగ్లాదేశ్
వేదిక: నవీ ముంబై (మ.3 నుంచి)

ఆసీస్ మహిళా క్రికెటర్లకు లైంగిక వేధింపులు

ఇండోర్‌లో ఘటన
నిందితుడి అరెస్ట్

ఇండోర్: సాఫీగా సాగుతున్న మహిళల వన్డే వరల్డ్ కప్‌లో ఊహించని ఉదంతం చోటు చేసుకుంది. ఇద్దరు ఆస్ట్రేలియా క్రికెటర్లు లైంగిక వేధింపులకు గురి కావడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఆ ఇద్దరు మహిళా క్రికెటర్లు తాము బస చేసిన రాడిసన్ బ్లూ హోటల్ నుంచి సమీపంలోని కేఫ్‌కు బయలు దేరారు. మోటార్ సైకిల్‌పై అనుసరిస్తూ వచ్చిన యువకుడొకరు ఖజ్రానా రోడ్డులోకి రాగానే క్రికెటర్లను అభ్యంతరకర రీతిలో తాకి పరారయ్యాడు. సంఘటనతో షాక్‌కు గురైన క్రికెటర్లు తమ భద్రతా అధికారి డానీ సిమోన్స్‌కు 'డిస్ట్రెస్ కాల్' చేశారు. అప్రమత్తమైన ఆ అధికారి స్థానిక పోలీసులకు సమాచారం అందజేశారు. తక్షణమే అక్కడికి చేరుకున్న పోలీసులు తమ వాహనంలో క్రికెటర్లను హోటల్‌కు చేర్చారు. ఈ ఘటనపై స్థానిక ఎంఐజీ పోలీస్‌స్టేషన్‌లో సిమోన్స్ ఫిర్యాదు చేశారు. అనంతరం విచారణ జరిపిన పోలీసులు.. నిందితుడిని ఆజాద్ నగర్‌కు చెందిన 30 ఏళ్ల అఖీల్‌ఖాన్‌గా గుర్తించి అతడిని అరెస్ట్ చేసినట్టు ఇండోర్ నేర విభాగ అదనపు డీసీపీ రాజేశ్ దంతోదియన్ వెల్లడించారు. అతడిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 74 (మహిళపై దాడి చేయడం), 78 (వెంబడించడం)పై కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్టు తెలిపారు. ఘటనపై మధ్యప్రదేశ్ మంత్రి కైలాస్ విజయ్‌వర్గీయ స్పందించారు. ఇది భారత ప్రతిష్ఠను దెబ్బ తీస్తుందన్నారు.

బీసీసీఐ ఖండన: ఆస్ట్రేలియా క్రికెటర్లపై జరిగిన ఘటనను బీసీసీఐ తీవ్రంగా ఖండించింది. 'అతిథ్యానికి భారత్ పెట్టింది పేరు. ఇలాంటి ఘటనను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోం. మా భద్రతా చర్యలను సమీక్షించుకొని మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తాం' అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అన్నారు.

కంగారూలతోనే సెమీస్ ఎందుకంటే..

మహిళల ప్రపంచ కప్ సెమీఫైనల్లో భారత్ ప్రత్యర్థిగా ఆస్ట్రేలియా ఖరారైంది. శనివారం దక్షిణాఫ్రికాపై గెలిచి అగ్రస్థానంలో నిలిచిన ఆస్ట్రేలియాతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. ప్రస్తుతం పట్టికలో ఆస్ట్రేలియా (13), దక్షిణాఫ్రికా (10), ఇంగ్లండ్ (9), భారత్ (6) తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఈ జట్లన్నీ ఇప్పటికే సెమీస్ చేరాయి. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లను శనివారం ఆడేశాయి. ఆదివారం (అక్టోబరు 26న) జరిగే లీగ్ చివరి మ్యాచుల్లో బంగ్లాదేశ్‌తో భారత్, న్యూజిలాండ్‌తో ఇంగ్లండ్ తలపడనున్నాయి. వీటిల్లో ఇంగ్లండ్ గెలిస్తే 11 పాయింట్లతో రెండో స్థానానికి చేరుతుంది. దక్షిణాఫ్రికా మూడో స్థానానికి పడిపోతుంది. ఒకవేళ బంగ్లాపై నెగ్గినా భారత్ ఖాతాలో 8 పాయింట్లే ఉంటాయి కాబట్టి హర్మన్‌సేన నాలుగో స్థానంలో ఎలాంటి మార్పుండదు. కాబట్టి, తొలి స్థానంలో ఉన్న ఆసీస్‌తో నాలుగో స్థానంలో ఉన్న భారత్ సెమీస్‌లో ఆడాల్సి ఉంటుంది.

ఫైనల్లో దీక్ష x లక్ష్య

● ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్

చెంగ్డు: ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్‌లో బాలికల అండర్-17 విభాగంలో దీక్ష సుధాకర్, లక్ష్య రాజేష్ ఫైనల్ చేరి భారత్‌కు పసిడిని ఖాయం చేశారు. తుదిపోరులో వీరిద్దరూ తలపడనుండడంతో స్వర్ణ, రజతాలు మన ఖాతాలో చేరనున్నాయి. సెమీస్‌లో దీక్ష 21-8, 21-17తో యున్ చియావ్ (తైపీ)పై, లక్ష్య 21-15, 21-19తో రియా (జపాన్)పై నెగ్గారు. కాగా, అండర్-15 కేటగిరీలో షైనా మణిముత్తు ఫైనల్ చేరింది.

సాయితేజకు నాలుగు వికెట్లు

బరోడా 230/6
ఏపీతో రంజీ

విజయనగరం: మీడియం పేసర్ సాయితేజ (4/28) చెలరేగడంతో ఆంధ్రతో శనివారం ప్రారంభమైన ఎలీట్ గ్రూప్ 'ఏ' రంజీట్రోఫీ మ్యాచ్‌లో బరోడా ఇక్కట్లలో పడింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన బరోడా మొదటి రోజు ముగిసే సరికి తొలి ఇన్నింగ్స్‌లో 230/6 స్కోరు చేసింది. విష్ణు సోలంకి (99 బ్యాటింగ్), కెప్టెన్ అజిత్ సేథ్ (65 బ్యాటింగ్) రాణించారు. పుదుచ్చేరితో మొదలైన గ్రూప్ 'డి' మ్యాచ్‌లో తొలిరోజు ఆఖరికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 255/1 స్కోరు చేసింది.

ఫేక్ పోస్టులపై డిప్యూటీ స్పీకర్ ఫిర్యాదు

» అస్థిరత సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలంటూ డీజీపీకి లేఖ



అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాజకీయ అస్థిరత సృష్టించేందుకు సోషల్ మీడియా ద్వారా ఫేక్ ప్రచారం చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై తాను అనని మాటల్ని తన ఫొటోతో సోషల్ మీడియా ద్వారా వ్యాప్తి చేసేందుకు ప్రయత్నించిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అంబోజి వినయ్ కుమార్‌పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీల మధ్య ద్వేషం, అధికార కూటమిలో చిచ్చు రేపేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తుల్ని వదిలి పెట్టొద్దంటూ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు లేఖ రాశారు. డీజీపీకి రాసిన లేఖతో పాటు వినయ్ కుమార్(జగన్ అన్న అభిమాని) అంటూ జగన్‌తో పాటు తన ఫొటో పెట్టుకున్న వినయ్ కుమార్ అనే వ్యక్తి సోషల్ మీడియా ఖాతా వివరాల స్క్రీన్ షాట్లు జతచేశారు. రాష్ట్రంలో అస్థిరత సృష్టించడమే లక్ష్యంగా ఫేక్ పోస్టుల కుట్ర జరిగిందని.. బీఎన్ఎస్‌లోని 196(వర్గాల మధ్య విద్వేష ప్రేరణ), 353(శాంతి భద్రతలకు భంగం కలిగించే ప్రకటన), 356(వ్యక్తుల పరువుకు భంగం కలిగించడం) సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలని కోరారు.

'జోగి'కి కల్తీ మద్యం ముడుపులు!

» మాజీ మంత్రికి వాటాలు ఇచ్చాం.. అంగీకరించిన అద్దేపల్లి జనార్దనరావు

» రెండోరోజూ కొనసాగిన జనార్దనరావు సోదరుల విచారణ

విజయవాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యం తయారీ వ్యవహారంలో ప్రధాన నిందితులు అద్దేపల్లి జనార్దనరావు సోదరులకు, మాజీ మంత్రి జోగి రమేశ్‌కు మధ్య ఆర్థిక వ్యవహారాలపై సిట్ అధికారులు గట్టి ఆధారాలు సేకరించినట్లు తెలిసింది. జోగి రమేశ్‌కు వాటా ఇచ్చినట్లు విచారణలో జనార్దనరావు అంగీకరించినట్లు సమాచారం. అన్నదమ్ములను శనివారం రెండోరోజు విచారణలో భాగంగా వేర్వేరు గదుల్లో ఉంచి సిట్ అధికారులు ప్రశ్నిస్తూ, ఆడియో, వీడియోలో రికార్డు చేయించారు. ఇప్పటికే జనార్దనరావు విడుదల చేసిన వీడియోలో కల్తీ మద్యం వ్యవహారంలో జోగి రమేశ్ పేరును ప్రస్తావించిన విషయం తెలిసిందే. వైసీపీ హయాంలో కొవిడ్ సమయం నుంచి నకిలీ మద్యం తయారు చేస్తున్నట్లు ఆయన అంగీకరించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారు చేసిన జనార్దనరావు నాడు వైసీపీ ప్రభుత్వంలోని కొంతమందికి నెలవారీగా మామూళ్లు ముట్టజెప్పినట్లు అధికారులు సమాచారం రాబట్టారు. ఆ ముడుపులను ఎవరి ద్వారా ఎవరెవరికి జనార్దనరావు పంపారన్న వివరాలను తెలుసుకున్నారు. ఇందులో జోగి రమేశ్ పేరును వెల్లడించినట్లు తెలిసింది. కాగా, నకిలీ మద్యం తయారీ వ్యవహారంలో కొంతమంది పేర్లు మాత్రమే ఇప్పటివరకు బయటకు వచ్చాయి. మిగిలినవారి పాత్రపై జనార్దనరావు సోదరులను రెండు రోజులుగా సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. జయచంద్రారెడ్డికి ఆఫ్రికాలో ఉన్న డిస్టిలరీల్లో తనకు వాటా ఉందని జనార్దనరావు అంగీకరించినట్లు తెలిసింది. కల్తీమద్యం తయారీలో మరిన్ని మెళకువలను గ్రహించడానికే ఆఫ్రికా వెళ్లినట్లు ఆయన తెలిపినట్లు సమాచారం.

రైతన్నకు నష్టపరిహారం ప్రకటించండి: షర్మిల

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వర్షానికి పంట నష్టపోయిన రైతన్నకు నష్టపరిహారం ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. రైతుకు జరిగిన నష్టంపై అంచనా వేసేందుకు వెంటనే ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. పత్తి, వరి, మొక్కజొన్న, కూరగాయలతో పాటు ఇతర పంటలు పనికి రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు మునిగిపోయినట్లుగా ప్రభుత్వ అధికారులే లెక్కల్లో చెప్పారన్నారు. ప్రకాశం జిల్లాలో 14,000 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లాలో 8,000 ఎకరాలు, కోనసీమ జిల్లాలో 7,000 ఎకరాల్లో పంటలు మునిగినట్లుగా అధికారులు ప్రకటించారన్నారు. పంట నష్టం ఇంకా పెరుగుతోందన్నారు. 158 మండలాల్లో లక్షన్నర ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని షర్మిల వివరించారు.

పెట్టుబడులే లక్ష్యంగా.. 3 రోజులు.. 25 కీలక భేటీలు

ముగిసిన సీఎం యూఏఈ పర్యటన.. 'యంగెస్ట్ స్టేట్.. హయ్యెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్' నినాదంతో సాగిన టూర్

» విశాఖ సదస్సుకు రావాలని అందరికీ చంద్రబాబు ఆహ్వానం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన మూడు రోజుల యూఏఈ పర్యటన ముగిసింది. శనివారం ఆయన దుబాయ్ నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. మూడ్రోజుల పర్యటనలో ప్రముఖ వ్యాపారవేత్తలు, యూఏఈ మంత్రులతో 25 కీలక సమావేశాల్లో చంద్రబాబు బృందం పాల్గొంది. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించి, నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ ఇన్వెస్టర్స్ మీట్‌కు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ పర్యటనలో గ్రీన్ ఎనర్జీ, లాజిస్టిక్స్, షిప్ బిల్డింగ్ యూనిట్ నిర్మాణానికి కీలక అడుగులు పడ్డాయి. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో చంద్రబాబు పర్యటన విజయవంతం అయింది. అమరావతిలో ప్రపంచస్థాయి గ్రంథాలయాన్ని ఉచితంగా నిర్మించేందుకు ప్రముఖ రియాల్టీ సంస్థ శోభా గ్రూప్ ముందుకొచ్చింది. రూ.100 కోట్లతో ఈ గ్రంథాలయాన్ని నిర్మించనున్నట్లు శోభా గ్రూప్ చైర్మన్ రవి మీనన్ వెల్లడించారు. రాష్ట్రంలో లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటులో ఏపీ ప్రభుత్వానికి సహకరిస్తామని దిగ్గజ సంస్థ షరాఫ్ గ్రూప్ వైస్ చైర్మన్, షరాఫ్ డీజీ సంస్థ వ్యవస్థాపకుడు షరాఫుద్దీన్ షరాఫ్ హామీఇచ్చారు. షరాఫ్ గ్రూప్ తమ అనుబంధ సంస్థ అయిన హింద్ టెర్మినల్స్ ప్రైవేటు లిమిటెడ్ ద్వారా ఏపీలో లాజిస్టిక్స్ రంగంలో పెట్టుబడులు పెడతామని ఆయన పేర్కొన్నారు. షిప్ బిల్డింగ్ రంగంలో ప్రముఖ సంస్థ అయి న ట్రాన్స్‌వరల్డ్ గ్రూప్ చైర్మన్ రమేశ్ ఎస్ రామకృష్ణన్.. దుగరాజపట్నం పోర్టులో షిప్ బిల్డింగ్ యూనిట్ నిర్మాణానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. వైద్య ఆరోగ్య రంగంలో అనుభవం కలిగిన బుర్జిల్ హెల్త్‌కేర్ హోల్డింగ్స్.. తిరుపతిలో స్పెషల్ క్యాన్సర్ సెంటర్ నిర్మాణం చేపట్టేందుకు ముందుకొచ్చింది.



దుబాయి పర్యటనలో యూఏఈ విదేశాంగ మంత్రి తనిబిన్ అహ్మద్ అల్ జయూదీని కలిసిన సీఎం చంద్రబాబు

యంగెస్ట్‌స్టేట్..హయ్యెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్..

చంద్రబాబు పర్యటన ఆసాంతం 'యంగ్ గెస్ట్ స్టేట్.. హయ్యెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్' నినాదంతో సాగింది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించడంతోపాటు ఎక్కువ మంది పారిశ్రామికవేత్తలను విశాఖలో జరిగే సీఐఐ పెట్టుబడుల భాగస్వామ్య సదస్సుకు రప్పించడమే లక్ష్యంగా చంద్రబాబు బృందం నిర్వహించిన సన్నాహక రోడ్‌షో ఒక ముఖ్యఘట్టంగా నిలుస్తుంది.

గ్రీన్ ఎనర్జీలో పెట్టుబడులకు ఆసక్తి

రాష్ట్రప్రభుత్వం గ్రీన్ ఎనర్జీపై ఎక్కువగా దృష్టి సారిస్తున్న నేపథ్యంలో ఆ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపాయి. ఎనర్జీ రంగంలో దిగ్గజ సంస్థ అయిన అపెక్స్ ఇన్వెస్ట్‌మెంట్స్.. పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులకు ఆసక్తి చూపింది. మరో ఇంధన సంస్థ మస్దార్ కూడా సౌర, పవన, గ్రీన్‌హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపింది. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో దిగ్గజ సంస్థ అగ్రియా గ్రూప్.. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, హెల్త్ టెక్ రంగాల్లో నూతన ఆవిష్కరణలపై పనిచేస్తున్న జీ42 సంస్థ, లులూగ్రూప్, అబూధాబీ నేషనల్ ఆయిల్ కంపెనీ, తదితర సంస్థల అధిపతులతోనూ సీఎం సమావేశమయ్యారు. ఏఐలో కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ఏపీలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్-దుబాయ్ సిలికాన్ ఒయాసిస్(డీఎస్‌ఓ) మధ్య కొత్త భాగస్వామ్యాలకు యూఏఈ ప్రభుత్వం అంగీకారం తెలిపింది.

తెలుగు జాతిని ఉత్తేజపరిచేలా..

చంద్రబాబు తన పర్యటన చివరి రోజు యూఏఈలోని ప్రవాస తెలుగు ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చేసిన ఉత్తేజభరిత ప్రసంగం తెలుగువారిని ఆకట్టుకుంది.

అధికారులను కాదని తానే!

పెట్టుబడులు రాబట్టే విషయంలో చంద్రబాబు ఎంత శ్రద్ధ తీసుకుంటారో దుబాయ్‌లోని భారత కాన్సుల్ జనరల్ సతీశ్ కుమార్ శివన్ వివరించారు. 'కియా మోటార్స్ సంస్థను పెట్టుబడులు కోరడానికి చంద్రబాబు దక్షిణ కొరియాలో పర్యటించినప్పుడు నేను అక్కడే విధులు నిర్వహిస్తున్నాను. రాష్ట్రాభివృద్ధి కోసం సీఎంగా ఆయన పడే తపనను దగ్గరుండి చూశాను. అధికారులు కాకుండా స్వయంగా తానే పవర్ పాయింట్ ప్రజంటేషన్లు ఇచ్చారు' అని ఆయన కొనియాడారు.

డబుల్ స్పీడ్

(మొదటి పేజీ తరువాయి)

చేటుచేసుకుంటున్నాయి. మోదీ 2000 నుంచి రాజకీయాల్లో ఉన్నారు. పోటీ చేసిన ప్రతి ఎన్నికల్లో విజయం సాధించారు. గతంలో గుజరాత్ సీఎంగా పనిచేశారు. 2014 నుంచి 11 ఏళ్లగా ప్రధానిగా ఉన్నారు. మరో నాలుగేళ్లు కొనసాగుతారు. ఈ దశాబ్దం ఆయనదేననడంలో సందేహం లేదు.' అని పేర్కొన్నారు.

16 నెలల్లో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు

16నెలల్లో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్లు విలువైన పెట్టుబడులు సాధించగలిగామని.. మరో 5 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని చంద్రబాబు తెలిపారు. ఏపీలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయన్నారు.

గ్రీన్ ఎనర్జీ, వ్యవసాయం, హార్టికల్చర్, లాజిస్టిక్స్ రాజధానిలో పెట్టుబడులకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నవంబరులో జరగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేనే విజయం సాధిస్తుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఎన్డీయే నాయకులు ఎప్పుడు కోరినా బిహార్ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

తెలుగు ప్రవాసులతో నెట్‌వర్క్

వివిధ దేశాల్లో ఉన్న తెలుగు వారందరినీ ఒక్కతాటిపైకి తెచ్చేందుకు కృషిచేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. ఇందులో భాగంగా ప్రవాస తెలుగు సమూహాలతో ఓ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. దీనిద్వారా తెలుగువారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 'తెలుగు సమాజం భవిష్యత్‌లో ఒకనాటికి ప్రపంచంలో అత్యంత ప్రభావవంతమైన, శక్తివంతమైన సమాజంగా నిలుస్తుంది' అని స్పష్టం చేశారు.

డేటాకు మైండ్ అప్లై చేస్తే.. ఏఐ

» నాడు కరోనా.. నేడు ఏఐ గురించి జగన్ నోట ఆణిముత్యాలు

» సోషల్ మీడియాలో మీమ్స్ హల్‌చల్

(అమరావవతి-ఆంధ్రజ్యోతి)

నాడు కోవిడ్ మహమ్మారి గురించి కానీ, నేడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి కానీ.. ఏ అంశమైనా సరే మాట్లాడటంలో మాజీ సీఎం జగన్ స్టైలే వేరు! బహుశా ఆయన్ను మించినవారు లేకపోవచ్చు! ఆయన నోట వచ్చే ఆణిముత్యాలు అలాంటివి మరి! పండితులను కూడా తికమక పెట్టేలా జగన్ చెప్పగలరు! అంతేకాదు.. సోషల్ మీడియాలో నెటిజన్లకు టైమ్‌పాస్ అవుతున్నారు! తాజాగా జగన్ విశ్లేషణ మీమ్స్‌కు మేతగా మారింది. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జగన్ మీడియాతో మాట్లాడిన విషయం తెలిసిందే. అనుకూల మీడియాతో ప్రెస్ కాన్ఫరెన్స్ పేరిట రెండు గంటలకు పైగా మాట్లాడారు. విశాఖకు గూగుల్ ఏఐ డేటా సెంటర్ రావడం తన చలవే అన్నట్టుగా చెప్పారు. తాను 2023లో అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన ఫలితమే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు కారణమైందన్నారు. అంతటితో ఆగకుండా.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి మరపురాని మాటలు చెప్పారు. 'గొప్ప మార్పుకైనా గాని, డేటా సెంటర్ అనేది డేటా ఉంటే, ఆ డేటాను రకరకాలుగా ఆ డేటాకు మైండ్ అప్లై చేస్తే అది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అని జగన్ సెలవిచ్చారు. జగన్ చెప్పినదానికి అర్థం ఏమిటో తెలియక ఐటీలో తలపండినవారు సైతం తికమకపడిపోతున్నారు. నాలుగేళ్లక్రితం ప్రపంచాన్ని వణికించిన కరోనాగురించి కూడా జగన్ సింపుల్‌గా తనదైన స్టైల్లో చెప్పారు. 'కరోనా గురించి భయపడాల్సిందేముంది.. పారాసిటమల్ వేసుకుంటే అదే పోతుంది. బ్లీచింగ్ పౌడర్ చల్లితే వైరస్ నశిస్తుంది' అని తేల్చేశారు.

జగన్‌లో ఏదో తేడా కనిపిస్తోంది

» వెంటనే చికిత్స చేయించాలి: ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డిలో ఏదో తేడా కనిపిస్తుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఒకప్పుడు నందమూరి బాలకృష్ణ అభిమానిగా ఆయన బ్యానర్లు, ఫ్లెక్సీలు మోసినోడు... ఇప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని విచిత్రంగా మాట్లాడుతున్నాడు. తల్లికి, చెల్లికి దూరంగా ఉన్నాడు. కనీసం భారతమ్మ అయినా జగన్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లి బ్రెయిన్ పరీక్ష చేయించాలి. నాకైతే జగన్‌లో ఏదో తేడా స్పష్టంగా కనిపిస్తుంది. ఆయనకు వైద్యుల సమక్షంలో చికిత్స అవసరం' అని సోమిరెడ్డి అన్నారు.

ముంచుకొస్తున్న 'మొంథా'!

(మొదటి పేజీ తరువాయి)

కాకినాడకు 920 కి.మీ. ఆగ్నేయంగా కేంద్రీకృతమై ఉంది. ఇది ఆదివారం ఉదయానికి నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ప్రవేశించి తీవ్ర వాయుగుండంగా, ఆ తరువాత మరింత బలపడి సోమవారం ఉదయానికి తుఫాన్‌గా బలపడుతుంది. దీనికి థాయ్‌లాండ్ దేశం సూచించిన 'మొంథా' అని పేరు పెట్టనున్నారు. ఇది 28 సాయంత్రం లేదా రాత్రికి మచిలీపట్నం-కళింగపట్నం మధ్య కాకినాడ వద్ద (ఒక అంచనా మేరకు కాకినాడ-తుని మధ్య) తీరం దాటుతుందని ఐఎండీ తెలిపింది. ఈ నేపథ్యంలో 28న ఉదయం కోస్తాలో తీరం వెంబడి గంటకు 60నుంచి 70 కి.మీ. వేగంతో గాలులు వీయనున్నాయి. తుఫాన్ తీరం దాటే సమయంలో గాలులు 90 నుంచి 110 కి.మీ. వేగంతో వీస్తాయి. తుఫాన్ ప్రభావంతో భారీ నుంచి అతిభారీ, అక్కడక్కడా కుంభవృష్టిగా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో 27 నుంచి 29 వరకూ పలు జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ నెల 29 వరకు కోస్తాలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని ఐఎండీ హెచ్చరించింది. శనివారం విశాఖ నుంచి కృష్ణపట్నం వరకు ఓడరేవుల్లో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక జారీచేశారు.



నంద్యాల జిల్లా గడివేముల మండల కేంద్రంలో మొక్కజొన్న పంటను రక్షించుకుంటున్న రైతులు

బీచ్‌లకు పర్యాటకుల ప్రవేశంపై నిషేధం

ఆదివారం కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు, దక్షిణ కోస్తాలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని, సోమవారం నుంచి వర్షాలు పెరుగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. తుఫాన్ ప్రభావంతో సముద్రం అలజడిగా మారి, అలలు ఎగసిపడే అవకాశం ఉన్నందున సముద్ర తీరాలు, నదుల్లో చేపలు పట్టడం, అన్ని బోటింగ్ కార్యకలాపాలను నిలుపుదల చేసి, బీచ్‌లకు పర్యాటకుల ప్రవేశాన్ని నిషేధించాలని కోస్తా జిల్లాల కలెక్టర్లకు సూచించినట్లు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.

కాకినాడ పోర్టు అప్రమత్తం

తుఫాన్ ముప్పు ఎదుర్కొనేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని కలెక్టరేట్‌లలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. అదనపు కరెంటు స్తంభాలు, సిబ్బంది, జనరేటర్లను సిద్ధం చేస్తున్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌తో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ టెలీకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు కాకినాడ పోర్టుల్లో అన్ని కార్గో ఎగుమతి, దిగుమతులు నిలిపివేయనున్నారు. ఇక్కడ లంగరు వేసిన ఓడలను సోమవారం మధ్యాహ్నం నుంచి సముద్రంలోకి తరలించనున్నారు.

అప్రమత్తంగా ఉండండి: సీఎం

'మొంథా' ముప్పు నేపథ్యంలో ప్రతి జిల్లా కలెక్టర్ తుఫాన్ రక్షణ చర్యలకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకుని, తగిన వనరులతో సన్నద్ధంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా ఇప్పటి నుంచే సన్నాహక చర్యలు సమగ్రంగా చేపట్టాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావిత జిల్లాలకు ఇన్‌చార్జి అధికారులను నియమించి, నష్ట నివారణకు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. తుఫాన్ ప్రభావం ఉండే అన్ని మండలాల్లో వెంటనే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లు సహా ఇతర అధికారులను సీఎస్ విజయానంద్ ఆదేశించారు. భారీవర్షాలు, వరదలను దృష్టిలో ఉంచుకుని, సహాయ కార్యక్రమాలకు 11 జిల్లాలకు ప్రభుత్వం రూ.14 కోట్లు మంజూరు చేసింది. విపత్తు సహాయ కార్యక్రమాలకు తక్షణ ఖర్చులు భరించడానికి ఈ నిధులు తీసుకోవటానికి జిల్లా కలెక్టర్లకు అనుమతిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

పలు జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు

» తుఫాను హెచ్చరికలతో అధికారులు అప్రమత్తం

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అధికారులు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. అన్నమయ్య, కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో సోమ, మంగళవారాలు, బాపట్ల, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో సోమవారం నుంచి బుధవారం వరకు మూడురోజుల పాటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. కోనసీమ జిల్లాలో తుఫాను హెచ్చరికలకు అనుగుణంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని కలెక్టర్ ఆదేశించారు.

విపత్తు సహాయం పంపిణీ: మంత్రి నాదెండ్ల

శనివారం సాయంత్రం పౌరసరఫరాల శాఖ అధికారులతో మంత్రి నాదెండ్ల మనోహర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని తీరప్రాంత జిల్లాల్లోని మండల స్థాయి స్టాక్ పాయింట్లలో నెలవారీ కేటాయింపుల కంటే ఎక్కువగా స్టాక్ ఉంచాలని ఆదేశించారు. తుఫాను షెల్టర్లు, సహాయక శిబిరాల్లో ఆహారాన్ని తయారు చేయడానికి ఎంఎల్ఎస్ పాయింట్లలో అందుబాటులో ఉన్న బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను ఉపయోగించుకోవాలన్నారు. జిల్లాల్లో ఇప్పటికే కోసిన వరి ధాన్యాన్ని సమీపంలోని రైస్ మిల్లులకు తరలించేందుకు వ్యవసాయాధికారులతో సమన్వయం చేసుకుని తగిన ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

కొత్త భాగస్వామ్యాలపై నమ్మకం



ఏడురోజుల ఆస్ట్రేలియా పర్యటన కొత్త భాగస్వామ్యాలపై నమ్మకం కలిగించిందని మంత్రి లోకేశ్ చెప్పారు. పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన ఆయన శనివారం 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. 'వారం రోజులపాటు ఆస్ట్రేలియాలోని నాలుగు ప్రధాన నగరాల్లో పర్యటించాను. పారిశ్రామికవేత్తలతో భేటీలు జరిగాయని చెప్పారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను పరిశీలించాను. క్రీడలను శక్తిమంతమైన రంగంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్రంలో అవకాశాలు చాలా ఉన్నాయని గుర్తించాను. భారత దేశం 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థవైపు దూసుకుపోతున్న ఈ సమయంలో పరిశోధనలు, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ శక్తి బలోపేతం వంటి వాటిపై ఆలోచనలు పంచుకున్నాం' అని వివరించారు. తన పర్యటన ఫలాలు విశాఖ పారిశ్రామిక సదస్సులో ప్రతిబింబిస్తాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

దావోస్ తరహాలోనే..!

రాష్ట్రంలోని సానుకూలతలు చెప్పడానికే లోకేశ్ ప్రాధాన్యం

» విశాఖ భాగస్వామ్య సదస్సుకు సన్నాహకంగా ఆస్ట్రేలియాలో పారిశ్రామికవేత్తలతో భేటీలు

» పెట్టుబడుల వాతావరణం, చంద్రబాబు పాలనాదక్షత, విద్య, నైపుణ్యాభివృద్ధి, క్రీడలపై ఫోకస్

» వారం పర్యటన సంతృప్తినిచ్చిందని ట్వీట్

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దావోస్‌లో ఈ ఏడాది జనవరిలో జరిపిన పర్యటన తరహాలోనే రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ ఆస్ట్రేలియా పర్యటన సాగింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అనుకూల వాతావరణం.. సీఎం చంద్రబాబు పాలనానుభవంతో గత 16 నెలల్లో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం.. విశాఖకు గూగుల్ డేటా సెంటర్‌ను తీసుకురావడానికి తాను పడిన కష్టాన్ని పారిశ్రామికవేత్తలకు వివరించారు. పెట్టుబడుల కోసం అక్కడ ఒప్పందాలకు తొందరపడకుండా వారందరినీ వచ్చే నెల 14, 15 తేదీల్లో విశాఖ భాగస్వామ్య సదస్సుకు రప్పించడానికే ఆయన ప్రాధాన్యమిచ్చారు. వారి పెట్టుబడులకు పూర్తి భరోసా ఇచ్చారు. ఒకసారి ఏపీ ప్రభుత్వంతో చేతులు కలిపాక వారి ప్రాజెక్టుల బాధ్యత మొత్తం తమదేనని హామీ ఇచ్చారు. గడువు కంటే ముందే అనుమతులు వచ్చేలా చేస్తామని.. ఉత్పత్తి మొదలయ్యేదాకా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. చంద్రబాబు పాలనానుభవం.. పాలనాదక్షతలను బాగా మార్కెటింగ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లోనే రూ.పది లక్షల కోట్ల పెట్టుబడులను రాబట్టామని వివరించారు. ప్రపంచ స్థాయి దిగ్గజ సంస్థ గూగుల్‌ను రాష్ట్రంలోని విశాఖ తీరప్రాంతంలో రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పించడానికి తాము పడిన కష్టాన్ని వివరించారు. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ రూ.87 కోట్లతో దేశంలోనే అదిపెద్ద స్టీల్ ప్లాంట్‌ను స్థాపించనుండడం.. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు విశాఖలో తమ కార్యకలాపాలను పెద్దఎత్తున ప్రారంభించేందుకు సిద్ధమవుతుండడాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ప్రాంతాల వారీగా, క్లస్టర్ల వారీగా పరిశ్రమల స్థాపనపై రూపొందించిన ప్రత్యేక కార్యాచరణను ఆయా సంస్థల దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో గత పాలకుల విధ్వంసక చర్యలపై పెట్టుబడిదారుల్లో నెలకొన్న భయాలను తొలగించడంపైనా లోకేశ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. 2014-19 నడుమ, 2024లో కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో నెలకొన్న పారిశ్రామిక సానుకూల వాతావరణాన్ని వివరించారు. ముఖ్యంగా రాష్ట్రానికి ప్రధాని మోదీ వెన్నుదన్నుగా నిలవడాన్ని సోదాహరణంగా వివరించడంలో లోకేశ్ సఫలమయ్యారు. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు అనుమతులు, ముడిఇనుప ఖనిజం కేటాయింపుపై ఆయన స్పందించిన విధానాన్ని తెలియజేశారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు సందర్భంగా దేశీయ చట్టాలతో ఎదురయ్యే ఇబ్బందులను తొలగించేలా ప్రధాని చొరవతో కేంద్రం చేపట్టిన సవరణలనూ వివరించారు. ఆస్ట్రేలియాలోని ప్రముఖ యూనివర్సిటీల వీసీలు, ప్రొఫెసర్లతో చర్చలు జరిపారు. విద్యతోపాటు క్రీడల రంగంలోనూ సహకారం అర్థించారు. రాష్ట్రంలో క్రికెట్ అకాడమీలు, ఉమ్మడి శిక్షణ శిబిరాలు, ఫ్రెండ్లీ మ్యాచ్‌ల నిర్వహణపై దృష్టి సారించాలని కోరారు.



దుబాయ్‌లో ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఎన్నారైలకూ బీమా

» దుబాయ్‌లో కొత్త పథకానికి సీఎం శ్రీకారం

విజయవాడ కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రవాసాంధ్రుల సంక్షేమం, అభివృద్ధి, భద్రతలో భాగంగా రాష్ట్రప్రభుత్వం ఏపీఎన్ఆర్‌టీ సొసైటీ ద్వారా ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకాన్ని అందిస్తోంది. ఈ పథకాన్ని సీఎం చంద్రబాబు శుక్రవారం దుబాయ్‌లో ప్రారంభించారు. విదేశాల్లో పనిచేస్తున్న రాష్ట్రానికి చెందిన ఉద్యోగులు, విద్యార్థులు దీనితో లబ్ధిపొందవచ్చు. ఈ బీమా పరిధిలోని వ్యక్తి ప్రమాదంలో మరణించినా లేదా శాశ్వత అంగవైకల్యం కలిగినా రూ.10 లక్షల ఆర్థిక సాయం అందుతుంది. దీనిని రాష్ట్రం నుంచి విదేశాలకు వెళ్లిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సీఎం ఆకాంక్షిస్తున్నారు.

బంగారంలో 'బిస్కెట్ల'దే జోరు



ప్రొద్దుటూరులో భారీగా పెరిగిన అమ్మకాలు

రోజుకు 10 కేజీల వరకూ సాగిన విక్రయాలు

(ప్రొద్దుటూరు, ఆంధ్రజ్యోతి)

ఆభరణాల రూపంలోనే బంగారం కొనడానికి ఎక్కువ మంది ఇష్టపడతారు. కానీ పుత్తడి ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో ట్రెండ్ మారింది. పసిడి పురిగా పేరుగాంచిన కడప జిల్లా ప్రొద్దుటూరులో బంగారు బిస్కెట్ల వ్యాపారం జోరుగా సాగింది. ఆగస్టు 1న పది గ్రాముల బంగారం రూ.లక్షకు చేరుకోగానే ప్రజలు కొనుగోళ్లపై దృష్టి పెట్టారు. అక్టోబరు 20 దీపావళి వరకు గోల్డ్ రేట్ అనూహ్యంగా పెరిగింది. ఈ సమయంలో ప్రతి రోజు ప్రొద్దుటూరు మార్కెట్‌లో 5 నుంచి 10 కిలోల వరకు బంగారు బిస్కెట్ల కొనుగోళ్లు జరిగాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. మార్కెట్‌లో కేవలం ఈ బిస్కెట్ల టర్నోవరే రోజుకు రూ. 25 కోట్ల నుంచి రూ. 50 కోట్ల మేర ఉంటుందని బులియన్ వర్గాల సమాచారం. ఒకపక్క బంగారం రేటు పెరుగుతుండటంతో పాటు.. మరోపక్క రియల్ ఎస్టేట్ రంగం మందగించడం కూడా ఇక్కడి వ్యాపారులకు కలిసివచ్చింది. ప్రొద్దుటూరులో ఎక్కువ మంది వ్యాపారులు, డాక్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయం ఎక్కువగా ఉన్న వారు బంగారాన్ని బిస్కెట్ల రూపంలో కొనుగోలు చేశారని చెబుతున్నారు.

ఆభరణాల వెలవెల

ఆభరణాల తయారీ, కొనుగోళ్లకు కస్టమర్లు ముందుకు రావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. గత రెండు నెలలుగా గోల్డ్ మార్కెట్ మొత్తంలో ఆభరణాల అమ్మకాలు 30 నుంచి 40 శాతం మాత్రమే ఉంటే, బిస్కెట్ల అమ్మకాలు మాత్రం 50 నుంచి 60 శాతం ఉందని వెల్లడించారు. ఇంట్లో శుభకార్యాలున్న వారు తప్పని పరిస్థితుల్లో ఆభరణాల కొనుగోలు, తయారీకి మొగ్గుచూపారన్నారు. బంగారంతో పాటు వెండి రేటు కూడా చుక్కలనంటింది. దీంతో చాలామంది వెండి దిమ్మెలు పెద్దఎత్తున కొనుగోళ్లు చేసినట్లు తెలుస్తోంది. కిలో వెండి ధర చెన్నైలో సుమారు పది వేలు ఎక్కువగా ఉండటంతో ప్రొద్దుటూరు నుంచి పెద్ద ఎత్తున చెన్నైకి వెండిని తరలించినట్లు చెబుతున్నారు.

తిరిగి అమ్మేందుకు వస్తున్నారు

పూర్ గోల్డ్, ప్యూర్ సిల్వర్ వ్యాపారం తప్ప ఆభరణాల వ్యాపారం బాగా తగ్గిపోయింది. దీపావళి నుంచి బంగారం ధరలు తగ్గుతూ వస్తున్నాయి. 10 గ్రాముల ధర లక్ష లోపునకు వచ్చేస్తుందనే అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం రూ. 1.32 లక్షల నుంచి రూ. 1.23 లక్షలకు తగ్గడంతో బిస్కెట్లు అమ్మడానికి కొందరు మార్కెట్‌కు తీసుకొస్తు న్నారు. కానీ మార్కెట్‌లో మాత్రం తక్కువకు అడుగుతున్నారు.

- బుశెట్టి రామ్మోహన్, గోల్డ్ డైమండ్ సిల్వర్ మర్చంట్ అసోసియేషన్, ప్రొద్దుటూరు

నకిలీ సర్టిఫికెట్‌తో హెవీ డ్రైవింగ్ లైసెన్స్!

» ఆర్టీయేను మాయ చేసిన కావేరి డ్రైవర్ లక్ష్మయ్య



కారంపూడి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదానికి గురైన వేమూరి కావేరి బస్సును నడిపిన డ్రైవర్ మిర్యాల లక్ష్మయ్య ఆర్టీయే అధికారులను మాయ చేసినట్టు పోలీసులు గుర్తించారు. పల్నాడు జిల్లా కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి చెందిన లక్ష్మయ్య.. పదో తరగతి చదివినట్లు నకిలీ సర్టిఫికెట్ సృష్టించి హెవీ లైసెన్సు పొందాడు. హెవీ డ్రైవింగ్ లైసెన్సు పొందడానికి 8వ తరగతి వరకు చదివి ఉండాలి. కానీ, లక్ష్మయ్య 5వ తరగతి వరకు మాత్రమే చదివాడు. ఇక, లక్ష్మయ్య డ్రైవింగ్ కెరీర్ కూడా ఏమీ బాగోలేదని తెలుస్తోంది. 2004లో లారీ నడుపుతూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఓ చెట్టును ఢీ కొట్టాడు. ఆ ఘటనలో లారీ క్లీనర్ మృత్యువాత పడ్డాడు. తర్వాత హైదరాబాద్‌లో కావేరీ ట్రాన్స్‌పోర్ట్‌లో డ్రైవర్‌గా చేరాడు. హైదరాబాద్-బెంగళూరు మధ్య నడిచే బస్సులకు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తాజా ఘటనకు సంబంధించి పోలీసులు శనివారం లక్ష్మయ్యను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

పదేళ్లు... ఐదు ప్రమాదాలు

» 81 మంది సజీవ దహనం

అమరావతి, అక్టోబరు 25: తాజా బస్సు దగ్ధం ఘటన నేపథ్యంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో గత 10 ఏళ్లలో జరిగిన ప్రమాదాల్లో దగ్ధమైన స్లీపర్ బస్సుల ఘటనలను పరిశీలిస్తే... అన్ని ప్రమాదాలూ తెల్లవారుజామునే జరిగాయి. కర్నూలు సమీపంలో జరిగిన ఈ దుర్ఘటనతో సహా మొత్తం ఐదు ప్రమాదాలు జరగ్గా... 81 మంది దుర్మరణం పాలయ్యారు. 2016, జూలై 27న కర్ణాటకలోని హుబ్లీ సమీపంలో నాన్ ఏసీ స్లీపర్ బస్సు ప్రమాదానికి గురైంది. బస్సు వెనుక భాగం నుంచి మంటలు చెలరేగాయి. బస్సులో 18 మంది ఉండగా ముగ్గురు మరణించారు. 2022, అక్టోబరు 8న మహారాష్ట్రలోని నాసిక్ వద్ద ముంబయికి చెందిన ప్రైవేటు స్లీపర్ బస్సు ప్రమాదానికి గురయింది. ట్రైలర్ ట్రక్కును ఢీకొట్టి మంటల్లో దగ్ధమైన ఘటనలో 12 మంది దుర్మరణం పాలవ్వగా 43 మంది గాయపడ్డారు. 2023, జూలై 1న మహారాష్ట్రలోనే మరో ప్రమాదం జరిగింది. నాగపూర్-పూనే మధ్య నడిచే ఈ బస్సు ఎక్స్‌ప్రెస్ హైవేలో బుల్ఢానా జిల్లాలో అగ్నికి ఆహుతయింది. ముగ్గురు పిల్లలతో సహా మొత్తం 25 మంది చనిపోగా ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ ఏడాది అక్టోబరు మొదటి వారంలో రాజస్థాన్‌లో మరో స్లీపర్ బస్సు దగ్ధమైంది. సామర్థ్యాన్ని మించి 57 మందితో జైసల్మేర్ నుంచి జోధ్‌పూర్ వెళ్తున్న ఈ ఏసీ స్లీపర్ బస్సు థయాయాత్ వద్ద ప్రమాదానికి గురయింది. 20 మంది సజీవ దహనయ్యారు.

రోడ్డు భద్రత సమావేశాలేవీ?

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల్లో ఏటా 8 వేలమందికి పైగా మరణిస్తున్నా పాలకులు, అధికారులకు పట్టడం లేదు. కొన్నేళ్లుగా రోడ్డు భద్రత సమావేశాలు కూడా జరగట్లేదు. ప్రతి ఆర్నెళ్లకు తప్పనిసరిగా జరగాల్సిన సమావేశాలు ఒక్కటి కూడా జరగలేదు. రవాణా శాఖ మంత్రి, రవాణా శాఖ కమిషనర్ ఉమ్మడిగా కలిసి సమావేశాలు నిర్వహించలేదు.

అగ్గి రాజుకుంటే అంతే!

» స్లీపర్, ఏసీ బస్సుల్లోనే తరచూ ప్రమాదాలు

హైదరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సాధారణ బస్సులతో పోలిస్తే స్లీపర్, ఏసీ బస్సుల్లోనే తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. బస్సు క్యాబిన్ డివైడర్లకు తగిలి నిప్పు రాజుకోవడం, డీజిల్ ట్యాంక్ రోడ్డుకు తగిలి మంట అంటుకోవడం, ఏసీ బస్సుల్లో ఇంజన్ వేడికి మంటలు చెలరేగడం వంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయి. బస్సుల ఇంటీరియర్ ఆకర్షణీయంగా కనిపించడానికి ఉపయోగిస్తున్న సామగ్రి... ఈ ప్రమాదాలకు ప్రధాన కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. రెగ్జిన్ సీట్లు, కర్టెన్లు, డెకరేషన్ సామాగ్రికి కొంచెం వేడి తగిలినా.. అంటుకుంటాయి. బస్సుల ప్రమాదాలను నివారించాలంటే ఫైర్ ఫ్రెండ్లీ వస్తువుల వాడకం తగ్గించాలని నిపుణులు సూచిస్తున్నారు. ట్రావెల్స్ సంస్థలు కొద్దిపాటి డిజైన్ మార్పులతో ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని అభిప్రాయపడుతున్నారు. రోడ్ల పరిస్థితి, ప్రమాదాల తీవ్రతను అధ్యయనం చేసి, అనుగుణంగా డిజైన్లలో మార్పులకు అనుమతిస్తే ప్రమాదాలు నివారించేందుకు అవకాశం ఉంటుందంటున్నారు. ప్రమాదం జరిగినప్పుడు ప్రయాణికులను అప్రమత్తం చేసేలా అలారం, ప్రధాన, అత్యవసర ద్వారాలు వెంటనే తెరుచుకునేలా ఉంటే.. ప్రయాణికుల ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు.

బస్సులకే బీమా.. ప్రయాణికులకేదీ?

హైదరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కోట్లలో వ్యాపారం చేస్తున్న ట్రావెల్స్ సంస్థలు.. తెలిసీ చేస్తున్న చిన్న తప్పిదంతో ప్రమాద బాధితులకు బీమా పరిహారం అందని పరిస్థితి నెలకొంటోంది. ప్రభుత్వం, ట్రావెల్స్ యాజమాన్యాలు దయతలచి ఇచ్చే పరిహారమే తప్ప బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా లేకుండా పోతోంది. ట్రావెల్స్ సంస్థలు బస్సులకు సరైన బీమా చేయించకపోవడమే దీనికి కారణం. నిబంధనల ప్రకారం ట్రావెల్స్ సంస్థలు మోటారు వాహనాల చట్టం ఐఎంటీ-44 క్లాజు ప్రకారం ప్రీమియం చెల్లించాలి. దీనివల్ల అనుకోని ప్రమాదమేదైనా జరిగితే అందులోని ప్రయాణికులకు కూడా బీమా పరిహారం అందేందుకు వీలుంటుంది. కానీ ఆర్థిక భారం తగ్గించుకునేందుకు చాలా సంస్థలు ఐఎంటీ-44 లేకుండానే బీమా చేయిస్తున్నాయి. ట్రావెల్స్ సంస్థల అక్రమాల కారణంగానూ.. ప్రయాణికులకు బీమా అందకుండాపోతోంది. పర్మిట్ ఖర్చులు మిగుల్చుకునేందుకు.. ఒకే నంబర్ ప్లేట్‌పై ఎక్కువ బస్సులు తిప్పడం, సీటింగ్ అనుమతులు తీసుకుని, స్లీపర్ బస్సులుగా మార్చి నడిపిస్తుండం వంటి అక్రమాలు సమస్యగా మారుతున్నాయి. కర్నూలు జిల్లాలో ప్రమాదానికి గురైన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు విషయంలో ఇలాగే జరిగింది. డయ్యూడామన్‌లో రిజిస్ట్రేషన్ చేసి, ఆలిండియా పర్మిట్ తీసుకున్నారు. తర్వాత ఒడిశా రాయగడలో బస్సులో మార్పులు చేయించి, ఫిట్‌నెస్ ధ్రువీకరణ చేయించారు. రాయగడ అధికారులు ఈ బస్సుకు 43 సీట్ల ఏర్పాటు అనుమతి మాత్రమే ఇచ్చారు. కానీ సంస్థ స్లీపర్ బస్సుగా మార్చింది.

మృతదేహాల కోసం నిరీక్షణ!

» మాంసపు ముద్దలుగా మారిన మృతదేహాలు

» డీఎన్ఏ పరీక్షలకు విజయవాడ ల్యాబ్‌కు నమూనాలు

» సోమవారం ఉదయం ఫలితాలు వచ్చే అవకాశం

» ఆ తర్వాతే అప్పగిస్తామంటున్న అధికారులు

కర్నూలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాద దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబీకులు తమవారి మృతదేహాల కోసం నిరీక్షిస్తున్నారు. ఆప్తులను కోల్పోయిన ఆవేదనకు తోడు డీఎన్ఏ రిపోర్టు రావడానికి కనీసం 48గంటలు పడుతుందని చెబుతుండటంతో ఉసూరుమంటున్నారు. కర్నూలు నగరానికి 22 కిలోమీటర్ల దూరంలో కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఘోర ప్రమాదంలో 'వేమూరి కావేరి' ట్రావెల్స్‌కు చెందిన బస్సులోని 19మంది ప్రయాణికులు అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పూర్తిగా కాలిపోయిన మృతదేహాలు మాంసపు ముద్దగా మారాయి. రిజర్వేషన్ చార్ట్ ప్రకారం మృతులతో పాటు వారి కుటుంబీకులను గుర్తించారు. అయితే ఏ మృతదేహం ఎవరిదో గుర్తించలేనంతగా కాలిపోవడంతో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా డీఎన్ఏ పరీక్షల అనంతరం మృతదేహాలను అప్పగిస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మృతదేహాలను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఫోరెన్సిక్ విభాగం ఏసీ గదుల్లో భద్రపరిచారు. దీంతో శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వద్ద మృతదేహాల కోసం వచ్చిన రక్త సంబంధీకులు నిరాశతో వెనుదిరిగారు.





కర్నూలు జీజీహెచ్‌లో బస్సు ప్రమాద ఘటనకు సంబంధించి వైద్యాధికారులు, పోలీసుల హెల్ప్ డెస్క్, కర్నూలు జిల్లా చిన్న టేకూరు వద్ద పూర్తిగా కాలిపోయిన బస్సు వద్ద ప్రత్యేక పోలీస్ బృందం పరిశీలన

రేపు ఉదయానికి డీఎన్ఏ రిపోర్టులు: కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ మెడికల్ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ టి.సాయి సుధీర్ ఆధ్వర్యంలో డీఎన్ఏ పరీక్షల కోసం మృతదేహాల నుంచి కండరాలు, ఎముకలు, దంతాల నమూనాలు సేకరించారు. అలాగే మృతుల రక్తసంబంధీకులైన తల్లి, తండ్రి, పిల్లలు మొత్తం 16మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. బిహార్, ఒడిశాకు చెందిన ఇద్దరు మృతుల రక్త సంబంధీకుల నమూనాలు విజయవాడలో సేకరించారు. ఈ శాంపిల్స్ శనివారం విజయవాడ ల్యాబ్‌లో అప్పగించారు. ఫలితాలు రావడానికి కనీసం 48గంటలు పడుతుందని వైద్యులు పేర్కొన్నారు. సోమవారం ఉదయానికి డీఎన్ఏ రిపోర్టు వచ్చే అవకాశం ఉంది. బస్సుప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినవారి మృతదేహాల కోసం నెల్లూరు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక నుంచి వారి బంధువులు వచ్చారు. వారికి కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ప్రభుత్వ అతిథి గృహంలో బస, భోజన ఏర్పాట్లు చేశారు. అయితే రెండు రోజులు నిరీక్షించలేక చాలామంది స్వగ్రామాలకు వెళ్లిపోయారు. సమాచారం కోసం పోస్టుమార్టం విభాగం సమీపంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు.

బ్యాటరీలు పేలడంతో పెరిగిన తీవ్రత

ప్రమాదం జరిగిన సమయంలో బస్ కార్గోలో రియల్‌మీ ఆర్ఎంఎక్స్ 3990 సెల్‌ఫోన్లు 235కు పైగా ఉన్నాయి. బెంగళూరుకు చెందిన ఓ వ్యాపారి వాటిని హైదరాబాద్‌లో బుక్ చేసి ఈ బస్సులో రవాణా చేస్తున్నారు. బస్ కింద ఇరుక్కుపోయిన పల్సర్ బైక్, రోడ్డు రాపిడికి నిప్పురవ్వలు రావడం, బైక్ పెట్రోల్ ట్యాంక్ మూత ఊడిపోయి పెట్రోలు బయటకు చిమ్మడంతో మంటలు చెలరేగాయని గుర్తించారు. ఆ అగ్ని కీలలు సెల్‌ఫోన్లకు తాకడం, ఫోన్లు కాలిపోయి బ్యాటరీలు ఒక్కసారిగా పేలిపోవడంతో ప్రయాణికుల సీట్ల దిగువన ఉన్న ఇనుప రేకులు పగిలిపోయి ప్రమాద తీవ్రత పెరిగిందని అంటున్నారు. బస్సులో ఉన్న రెండు 12 కేవీ బ్యాటరీలు కూడా పేలిపోవడంతో మంటల తీవ్రత మరింత పెరిగింది. ఏసీ బస్సు కావడం వల్ల ఆక్సిజన్ ఎక్కువై మంటలు వేగంగా వ్యాపించడానికి కారణమైందని నిపుణులు చెబుతున్నారు. అత్యవసర ద్వారాలు తెరుచుకోకపోవడం కూడా మృతుల సంఖ్య పెరగడానికి కారణమైందని అంటున్నారు.

నిర్లక్ష్యపు నిప్పు



రెయిలింగ్‌ను బైక్ ఢీకొట్టాక శివశంకర్ కిందపడిన ప్రాంతం

(మొదటి పేజీ తరువాయి)

నడుపుతున్న శివశంకర్ అక్కడికక్కడే మరణించాడు. వెనుక కూర్చున్న అతని స్నేహితుడు ఎర్రిస్వామి మరొకరు గాయపడ్డాడు. బైకు రోడ్డు మధ్యలో పడిపోయింది. బైక్‌ను ప్రైవేటు బస్సు తోసుకుని వెళ్లడంతో ప్రమాదం జరిగి, బస్సు మంటల్లో చిక్కుకొందని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఎర్రిస్వామిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. బైక్ కదలికలకు సంబంధించిన వీడియో ఫుటేజీలు పరిశీలించి ఈ నిర్ధారణకు వచ్చారు.

పోలీసుల దర్యాప్తులో మలుపు

గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయల్దేరిన వేమూరి కావేరి ట్రావెల్స్‌కు చెందిన డీడీ01 ఎన్9490 ఏసీ స్లీపర్ బస్సు శుక్రవారం తెల్లవారుజామున కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామానికి ఐదారు కిలోమీటర్ల దూరంలో ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో బస్సులో 44 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు కలిపి 46 మంది ఉన్నారు. మంటల్లో చిక్కుకున్న ఈ బస్సులో అద్దాలు పగులగొట్టి 27 మంది ప్రయాణికులు చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు. మంటల్లో చిక్కుకుని 19 మంది మరణించారు. ఈ దుర్ఘటనలో బస్సు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంపై దర్యాప్తు బాధ్యతను పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్యకు అప్పగించారు. శుక్రవారం రాత్రే రంగంలోకి దిగిన పోలీస్ విచారణ బృందం కర్నూలు నగరం నుంచి చిన్నటేకూరు సమీపంలో ప్రమాదం జరిగిన ప్రదేశం వరకు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. బస్సు తగలబడిపోవడానికి కారణమైన పల్సర్ బైక్‌కు సంబంధించిన ఫుటేజీలు గుర్తించారు. బైక్‌పై వెళ్తూ మరణించిన శివశంకర్‌తోపాటు ఉన్న మరో యువకుడిని ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. ఆ యువకుడిని తుగ్గలి మండలం రాంపల్లికి చెందిన సి.ఎర్రిస్వామిగా గుర్తించారు. ఆ యువకుడిని అదుపులో తీసుకొని పోలీసులు విచారించారు. ముందు వెళ్తున్న పల్సర్ బైక్‌ను ప్రైవేటు బస్సు ఢీకొట్టడంతో బైకర్ బి.శివశంకర్ ఎగిరి పక్కకు పడిపోయి మృతి చెందాడని, ఆపకుండా ముందుకు వెళ్లడంతో ప్రమాదం జరిగిందని మొదట్లో పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన విషయం తెలిసిందే. కానీ కేసు దర్యాప్తులో మలుపు తిరిగింది.

ప్రమాదానికి ముందు ఏం జరిగిందంటే...

కర్నూలు శివారులోని బి.తాండ్రపాడు గ్రామం ప్రజానగర్‌లో నివాసం ఉంటున్న బి.శివశంకర్, తుగ్గలి మండలం రాంపల్లికి చెందిన సి.ఎర్రిస్వామిలు ఇద్దరూ స్నేహితులు. గురువారం రాత్రి ఇద్దరూ కర్నూలులో భోజనాలు చేశారు. ఎర్రిస్వామిని అతడి స్వగ్రామం రాంపల్లిలో దింపి వస్తానని శివశంకర్ తన బైక్‌పై ఎక్కించుకొని గురువారం అర్ధరాత్రి బయలుదేరాడు. 'వర్షం వస్తోంది.. ఉదయమే వెళ్తా' అని ఎర్రిస్వామి వారించినా వినలేదు. హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి-44లో చిన్నటేకూరు సమీపంలో కియ షోరూం ఎదురుగా ఉన్న ఓ బంకులో రూ.300కు పెట్రోల్ పట్టించుకున్నారు. అప్పుడు సమయం అర్ధరాత్రి 2:24 గంటలు. బైక్‌కు హెడ్‌లైట్ వెలగడం లేదని, లెఫ్ట్ ఇండికేటర్ వెలుతురులోనే వెళ్లారని బంకు సిబ్బంది తెలిపారు. ఆ తర్వాత 2:42 గంటల ప్రాంతంలో ఆరంఘర్ హోటల్ వద్ద సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యారు. అక్కడి నుంచి రెండు కి.మీ. వెళ్లాక 2:45 గంటల సమయంలో బైక్ కుడివైపు డివైడర్‌ను ఢీకొని రోడ్డు మధ్యలో పడిపోయింది. వెనకాల కూర్చున్న ఎర్రిస్వామి డివైడర్ మధ్యలో గడ్డిపై పడటంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. రోడ్డుపై పడిపోయిన బి.శివశంకర్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చలనం లేని మిత్రుడిని ఎర్రిస్వామి రోడ్డు పక్కకు లాగాడు. ఆ తర్వాత పది నిమిషాల వ్యవధిలో ఓ ఆర్టీసీ బస్సు సహా మూడు బస్సులు అదే మార్గంలో బెంగళూరు వైపు వెళ్లాయి. రోడ్డు మధ్యలో పడి ఉన్న బైక్‌ను గమనించి పక్కన వెళ్లాయి. రోడ్డు మధ్యలో పడిపోయిన బైక్‌ను పక్కకు లాగేద్దామని ఎర్రిస్వామి ప్రయత్నించాడు. ఇంతలో 2:55 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు వచ్చింది. రోడ్డు మధ్యలో పడిఉన్న ఆ బైక్‌ను తోసుకుంటూ వెళ్లింది. భారీ శబ్దం రావడంతో డ్రైవర్ బ్రేక్ వేసి వదిలి ముందుకు వెళ్లాడు. మళ్లీ భారీ శబ్దం రావడంతో మరోసారి బ్రేక్‌వేసి వదిలాడు. ఈ క్రమంలో బస్సు కింద ఇరుక్కుపోయిన బైక్ ట్యాంక్ మూత తెరుచుకొని పెట్రోల్ రోడ్డుపై కారుతూ వచ్చింది. బైక్, రోడ్డు మధ్య రాపిడి వల్ల నిప్పురవ్వలు ఎగిసి పెట్రోల్‌ను అంటుకుంది. క్షణాల్లో బస్సు మొత్తం మంటలు వ్యాపించడంతో 15 నిమిషాల్లో ఘోరం జరిగిపోయింది. ఈ ప్రమాదంలో ఏపీకి చెందిన ఆరుగురు, తెలంగాణకు చెందిన ఆరుగురు, కర్ణాటకకు చెందిన ఇద్దరు, తమిళనాడుకు చెందిన ఇద్దరు, బిహార్, ఒడిశాకు చెందిన ఒక్కొక్కరు, గుర్తు తెలియని మరో వ్యక్తి కలిపి 19 మంది సజీవదహనమైన సంగతి తెలిసిందే.

ముందుగానే బైక్ ప్రమాదం

బస్సు ప్రమాదంపై ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టాం. సీసీ ఫుటేజీలు పరిశీలించాక శివశంకర్ బైక్‌పై వెళ్లిన ఎర్రిస్వామితో పాటు ప్రైవేటు బస్సు డ్రైవర్లు ఇద్దరిని విచారించాం. వారు చెప్పిన వివరాలు పరిశీలిస్తే.. డివైడర్‌ను ఢీకొట్టడం వల్ల బైక్ రోడ్డుపై పడిపోయింది. శివశంకర్ తలకు బలమైన గాయాలై మృతి చెందాడు. ఎర్రిస్వామి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఎర్రిస్వామి హైదరాబాద్ జీహెచ్ఎంసీలో పని చేస్తున్నాడు. రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను ఎర్రిస్వామి పక్కకు లాగేసే ప్రయత్నం చేసేలోపే వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు వచ్చింది. బస్సు కింద ఇరుక్కున్న బైక్‌ను ముందుకు లాక్కుని వెళ్లింది. బైకర్ మద్యం సేవించాడా..? లేదా..? అన్నది ఇప్పుడే చెప్పలేం. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేశాం.

\- డాక్టర్ కోయ ప్రవీణ్, కర్నూలు రేంజ్ డీఐజీ

బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం..

ప్రమాద ఘటనకు ప్రైవేటు బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్య నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఎంత వర్షం పడుతున్నా బస్సు హెడ్ లైట్ వెలుతురుకు రోడ్డుపై ముందు భాగంలో పడిపోయిన బైక్‌ను గుర్తించకపోవడం బాధ్యతారాహిత్యమని అంటున్నారు. బైక్‌ను ఢీకొనగానే దడేల్‌మనే భారీ శబ్దం వచ్చిందని ప్రయాణికులు చెబుతున్నారు. శబ్దం రాగానే బ్రేక్ వేసి వదిలేశానని డ్రైవర్ లక్ష్మయ్య కూడా పోలీస్ విచారణలో వెల్లడించినట్లు సమాచారం. తక్షణమే బస్సు ఆపేసి కిందకు దిగి ఏం జరిగిందో గుర్తించి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని అంటున్నారు. 19 మంది ప్రాణాలు అగ్నికి ఆహుతి అయ్యేవి కావని అభిప్రాయపడుతున్నారు. బస్సు ముందు భాగంలో పల్సర్ బైక్ ఇరుక్కుపోయినా డ్రైవర్ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా దాదాపు 200 మీటర్ల వరకు బస్సును వేగంగా ముందుకు పోనిచ్చాడు. ప్రమాదంలో బస్సులో మంటలు వ్యాపించాయి. ట్రావెల్ యాజమాన్యం రవాణా శాఖ నిబంధనలు పాటించకపోవడం కూడా ప్రమాద తీవ్రతను పెంచిందని అంటున్నారు.

కన్నీటి కథలు

బదిలీపై బెంగళూరు వెళ్తూ ఒంగోలు వాసి మృతి

» ఇంటర్వ్యూకు వెళ్తూ తమిళనాడు యువకుడు కూడా



యువన్ శంకర్‌రాజా



ఆదిశేషగిరిరావు

ఒంగోలుక్రైం/చెన్నై, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంలో ఒంగోలుకు చెందిన బొంతా ఆదిశేషగిరిరావు(48) మృతిచెందారు. హైదరాబాద్ ఐవోసీలో ఆయన మేనేజర్‌గా పనిచేసేవారు. ఆయనకు భార్య, కుమార్తె, కొడుకు ఉన్నారు. ఇటీవల ఆయనకు బెంగళూరుకు బదిలీ కావడంతో గురువారం రాత్రి బయల్దేరారు. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన బస్సు ప్రమాదంలో సజీవ దహనమయ్యారు. ఒంగోలులో వారి బంధువులు లేరు. స్థానిక సుజాతనగర్‌లో నివాసం ఉన్న మిత్రుడు జీవీ సత్యనారాయణ ప్రమాద విషయం తెలిసిన వెంటనే కర్నూలు వెళ్లారు.

అదే చివరి ఫోన్ కాల్

బస్సు ప్రమాద మృతుల్లో తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లా పూలువపట్టి తోటత్తుపాళయానికి చెందిన యువకుడు యువన్ శంకర్ రాజా (23) ఉన్నారు. బీఎస్సీ చేసిన అతడు ఆర్నెల్ల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు మందుల కంపెనీలో ఉద్యోగంలో చేరారు. ఉద్యోగంలో చేరిన నెల రోజులకు సొంతూరుకు వచ్చి తల్లిదండ్రులను చూసి వెళ్లారు. అప్పటి నుంచి మళ్లీ తల్లిదండ్రుల వద్దకు వచ్చేందుకు సెలవు దొరకలేదు. తమిళనాడులోనే ఏదో ఒక చోట పని చేయాలని నిర్ణయించుకున్నారు. సేలంలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూ కాల్ లెటర్ వచ్చింది. ఇంటర్వ్యూ కోసం హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లి, అక్కడి నుంచి సేలం వెళ్లాలని నిర్ణయించుకున్నారు. శుక్రవారం ఇంటర్వ్యూ ఉందని, అందుకోసం బాగా ప్రిపేరవుతున్నానంటూ ముందురోజు తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పారు. ఇంతలోనే బస్సు ప్రమాదంలో మరణించారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌ను కట్టడి చేయాలి

» ఆర్టీసీ దూరప్రాంత సర్వీసులు ప్రవేశపెట్టాలి: ఈయూ

విజయవాడ (బస్‌స్టేషన్), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను కట్టడి చేసి, ఆర్టీసీ ద్వారా దూర ప్రాంత సర్వీసులు ప్రవేశపెట్టాలని ఆ సంస్థ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జి.వి.నరసయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. 'దేశంలోనే అత్యంత సురక్షిత ప్రయాణాన్ని అందించేది ఏపీఎస్ఆర్టీసీ మాత్రమే. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ప్రైవేట్ ఆపరేటర్లకు పోటీగా అధునాతన సౌకర్యాలతో దూర ప్రాంతాలకు నడిపేందుకు ఏసీ, ఏసీ స్లీపర్ బస్సులను ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీయే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి' అని వారు కోరారు.

అతివేగం.. ప్రాణ సంకటం!

» వేగ నియంత్రణ మాటేలేని ప్రైవేటు బస్సులు

హైదరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ నుంచి విజయవాడ ఇబ్రహీంపట్నం మధ్య దూరం సుమారు 250 కిలోమీటర్లు.. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు మూడు గంటల్లో ఆ దూరాన్ని అధిగమిస్తాయి. అది కూడా టీ తాగడానికి కొంతసేపు, టోల్‌గేట్ల వద్ద ఆలస్యం కొంతసేపు కలిపితేనే.. అంటే ఆ బస్సులు ఎంత వేగంతో దూసుకెళుతున్నాయో అర్థమవుతుంది. ఈ హైవేలో రెండుచోట్ల స్పీడ్‌గన్‌లు ఉన్నాయి. కానీ, అవెక్కడున్నాయో తెలిసిన బస్సు డ్రైవర్లు ఆ ప్రాంతాల దగ్గరకు వచ్చేసరికి వేగం తగ్గిస్తున్నారు. నిజానికి మన హైవేలలో చాలా వరకు బస్సులైతే గంటకు 80 కి.మీ వేగంతో, కార్ల వంటివి అయితే 100 కి.మీ వేగంలోపే ప్రయాణించేలా డిజైన్ చేసినవి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం చూసినా హైవేలపై బస్సుల గరిష్ఠ వేగం గంటకు 90 కిలోమీటర్లు మించకూడదు. తెలంగాణలో అయితే గంటకు 80 కి.మీ వేగం దాటకూడదు. కానీ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను గంటకు 120 కి.మీకు పైగా వేగంతో నడుపుతున్నారు. దీనితో ఏ చిన్న తేడా వచ్చినా క్షణాల్లోనే వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోతారు. బ్రేకులు వేసినా వాహనం ఆగేందుకు దూరం ఎక్కువ పడుతుంది. సడన్ బ్రేక్ వేస్తే వాహనం బోల్తాపడే ప్రమాదమూ ఉంటుంది. 'అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ స్టేట్ హైవే అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ అఫీషియల్స్(ఆస్టో)' అధ్యయనం ప్రకారం.. గంటకు 100 కిలోమీటర్లపైన వేగంతో వెళుతున్న వాహనం డ్రైవర్ 2.5 సెకన్లలోపే ప్రమాదాన్ని గుర్తించి, ప్రతిస్పందించాలి. ఆలస్యమైతే ప్రమాదం తప్పదు.

ఔటర్‌పై ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

» రెయిలింగ్‌ను ఢీకొట్టి 20 అడుగుల లోతులో పల్టీ

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డుపై ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు ప్రమాదానికి గురైంది. వేగంగా వెళుతున్న బస్సు అదుపు తప్పి ఇనుప రేలింగ్‌ను ఢీకొట్టి.. 20అడుగుల లోతులో బోల్తా కొట్టింది. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట్ ఓఆర్ఆర్‌లో ఈ ప్రమాదం సంభవించింది. ఆ సమయంలో బస్సులో ఆరుగురు ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు, ఒక చెకింగ్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. అందరికీ గాయాలయ్యాయి. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. 40 సీట్ల సామర్థ్యం గల న్యూగో ఎలక్ట్రిక్ ట్రావెల్స్ బస్సు శనివారం ఉదయం మియాపూర్ నుంచి గుంటూరుకు బయలుదేరింది. బస్సులో 10 సీట్లు మాత్రమే రిజర్వు అయ్యాయి. మియాపూర్ నుంచి మూసాపేట వై జంక్షన్ వరకూ ఆరుగురు బసెక్కారు. మరో నలుగురు ఎల్బీనగర్ వద్ద ఎక్కాల్సి ఉంది. బస్సు మధ్యాహ్నం 12.40గంటల ప్రాంతంలో పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ఆర్ వద్దకు చేరుకుంది. టోల్‌ప్లాజా వద్దకు వస్తుండగా బస్సుకు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో పాటు డ్రైవర్ వీరాంజనేయరెడ్డి, అదనపు డ్రైవర్ శ్రీనివాస్, చెకింగ్ ఇన్‌స్పెక్టర్ గోపీకృష్ణకు గాయాలయ్యాయి. టోల్ ప్లాజా సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన ఫైర్, ఔటర్ సిబ్బంది బస్సులో ఇరుక్కున వారిని బయటకు తీశారు. చికిత్స కోసం క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ తొమ్మిది మందికి ప్రాణాపాయం లేదని వైద్యులు పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై కేసులు

» నిబంధనలు ఉల్లంఘించిన 289 బస్సులపై చర్యలు

» 'కర్నూలు' ఘటన నేపథ్యంలో ఆర్టీఏ ప్రత్యేక తనిఖీలు

అమరావతి, విశాఖపట్నం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలులో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రవాణా అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించకుండా బస్సులు నడుపుతున్న పలు ప్రైవేటు ట్రావెల్ ఏజెన్సీలకు శనివారం భారీ షాక్ ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇక్కడ బస్సుల్ని పరుగులు పెట్టించే ట్రావెల్ ఆపరేటర్లకు చెక్ పెట్టారు. ఒక్కరోజే 289 ట్రావెల్ బస్సులపై అధికారులు కేసులు నమోదు చేశారు. ఇందులో అగ్నిమాపక పరికరాలు లేని బస్సులు 103 ఉన్నట్లు వెల్లడైంది. రవాణా చట్టాన్నే లెక్క చేయకుండా తిరుగుతున్న 18 ప్రైవేటు ట్రావెల్ బస్సులను సీజ్ చేసినట్లు రవాణాశాఖ కమిషనర్ మనీశ్‌కుమార్ సిన్హా తెలిపారు. అత్యవసర ద్వారం లేని 13 బస్సులు, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని, ఇతర ఉల్లంఘనలకు సంబంధించి 127కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. అనధికారిక మార్పులు చేసిన 45, ప్రయాణికుల జాబితాలేని 34, వాణిజ్య వస్తువులు సరఫరా చేస్తున్న 10, కనీస రికార్డులు లేని 8 బస్సులపై ఎంవీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకున్నట్లు సిన్హా చెప్పారు. అగ్నిమాపక పరికరాలు లేని వాహనాలకు భారీ జరిమానా విధించామని, ఇతర ఉల్లంఘనలపై రూ.7.08 లక్షల వరకు ఫైన్ వేశామన్నారు. అత్యధికంగా ఏలూరులో 55, తూర్పు గోదావరిలో 17, కోనసీమలో 27, చిత్తూరు జిల్లాలో 22, కర్నూలు జిల్లాలో 12, నంద్యాల జిల్లాలో 4 కేసులు నమోదయినట్టు వివరించారు. చట్టవిరుద్ధంగా వాహనాలను నడిపినా, ప్రయాణికుల భద్రత పట్టించుకోకపోయినా ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. పర్మిట్ నిబంధనలు పాటించి ప్రయాణికులకు భద్రత కల్పించేవరకూ ఈ ప్రక్రియను కొనసాగిస్తామని సిన్హా స్పష్టం చేశారు. కాగా, విశాఖ నుంచి బయలుదేరిన ప్రైవేటు ట్రావెల్ బస్సులను రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్‌సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండు బృందాలు తనిఖీ చేశాయి. సీబుక్‌లో ఉన్న సీటింగ్‌ను మార్చి అదనపు బెర్తులు ఏర్పాటుచేయడం, అత్యవసర ద్వారం మూసేసి అక్కడ అదనంగా సీట్లు ఏర్పాటుచేయడం, అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచకపోవడం, పర్మిట్ ముగిసినా బస్సును తిప్పుతుండడం వంటి ఉల్లంఘనలకు 10 బస్సులపై కేసులు నమోదు చేసి, రూ.2.5 లక్షల చొప్పున జరిమానా విధించారు. పర్మిట్ ముగిసిన బస్సును సీజ్ చేశారు.



విజయవాడలో బస్సులను తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.